www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 3-11-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 198 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 10.06 తదుపరి తదియ; నక్షత్రం: అనూరాధ పూర్తి; వర్జ్యం: ఉ.10.19 -12.03; దుర్ముహూర్తం: సా.4.08-4.53; అమృతఘడియలు: రా. 8.45-10.29; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 5.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మరీ ఇంత నీచమా?



..రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. రాజశేఖర రెడ్డి భార్యగా, కుటుంబ పెద్దగా విజయలక్ష్మి చెప్పిన అంశాలతో కూడా జగన్ మద్దతుదారులు విభేదించడం ఆశ్చర్యం కలిగించింది. అప్పట్లో ఏమి జరిగిందో చెప్పగలిగే అర్హత విజయలక్ష్మికి కాక మరెవరికి ఉంటుంది?

..షర్మిలకు వ్యతిరేకంగా, జగన్‌కు అనుకూలంగా వైవీ సుబ్బారెడ్డి విలేకరుల సమావేశం పెట్టిన తర్వాత.. ఆయన కుమారుడు విజయలక్ష్మి వద్దకు వెళ్లి 'మా నాన్నను అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా. జగన్ వద్ద మేం జీతగాళ్లం మాత్రమే. మమ్మల్ని అర్థం చేసుకోండి' అని చెప్పుకొన్నారు. ఇది నిజమో కాదో జగన్ మద్దతుదారులు తెలుసుకోవాలి. దీన్నిబట్టి ఎవరు చెబుతున్నది నిజమో? ఎవరి పక్షాన ధర్మం ఉందో? ఎవరు న్యాయం చేయాలనుకుంటున్నారో? ఎవరు అన్యాయం చేస్తున్నారో స్పష్టమవుతుంది.

..2004కు ముందు రాజశేఖర రెడ్డికి ఉన్న ఆస్తులను జగన్, షర్మిల మధ్య పంచారు. తంటా అంతా 2004లో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సమకూరిన ఆస్తుల విషయంలోనే. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నెలకొల్పిన కంపెనీలు, సమకూర్చుకున్న ఆస్తులు జగన్ రెడ్డి పేరు మీదనే ఎందుకున్నాయో ఆడిటర్‌గా ఉన్న విజయసాయి రెడ్డికి తెలుసు.

..ఒక దశలో విజయసాయి రెడ్డిని రాజశేఖర రెడ్డి పిలిపించుకొని 'సాయీ.. ఆస్తులు, కంపెనీలు అన్నీ జగన్ రెడ్డి పేరు మీదనే ఎందుకు ఏర్పాటు చేస్తున్నావు? మా షర్మిల పరిస్థితి ఏమిటి? ఆమెకు కూడా సమానంగా వాటా ఉండాలి. నా భార్య విజయలక్ష్మి పేరిట ఆస్తులు ఏమీ వద్దు' అని స్పష్టంచేశారు. విజయసాయి రెడ్డి బదులిస్తూ 'ఇప్పుడు ఆస్తులు, కంపెనీలు షర్మిల పేరు మీదకు బదిలీ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. మొత్తం ఆస్తులు జగన్ పేరిట ఉన్నప్పటికీ చెల్లి షర్మిలకు గిఫ్ట్‌గా ఎప్పుడైనా ఇవ్వవచ్చు' అని చెప్పడంతో 'అదేదో జాగ్రత్తగా చూడు. నా బిడ్డకు అన్యాయం జరగకూడదు' అని రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారు. ఇది నిజమో కాదో విజయసాయి రెడ్డి, జగన్ రెడ్డి చెప్పాలి.

..ఆస్తుల్లో షర్మిలకు వాటా లేని పక్షంలో పంపకాల ప్రస్తావనను జగన్ ఎందుకు తెచ్చారో, ఎంఓయూ ఎందుకు రాశారో చెప్పాలి కదా! రాజశేఖర రెడ్డి ఆజ్ఞ మేరకు షర్మిలకు సమాన హక్కు ఉన్నప్పటికీ ఆస్తుల్లో 40% మాత్రమే ఇస్తానని జగన్ ఎందుకు అడ్డం తిరిగారు? 55:45 శాతం నిష్పత్తిలోనైనా పంచాలని విజయలక్ష్మి ప్రతిపాదించినా జగన్ రెడ్డి అంగీకరించలేదు. విధిలేని పరిస్థితుల్లో 40% వాటాకే షర్మిల అంగీకరించాల్సి వచ్చింది.

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4లో..

ఇదేం విలాసం!?

ప్రజాస్వామ్యంతో మరీ ఇంత పరిహాసమా?

ఓ వ్యక్తి సుఖం, స్వార్థం కోసం ఇంత బరితెగింపా?



జగన్.. 'ఆంధ్రా ఎస్కోబార్'

- వైట్‌హౌస్‌లోనూ ఇలాంటి కారిడార్ ఉండదు
- జగన్ మనసు అర్థం కావడం లేదు
- ఎప్పటికీ తానే రాజు.. చక్రవర్తి అనుకున్నారా?
- దొంగలకు ఇంత ఇన్నోవేషన్ ఎక్కడిది?
- నిబంధనల బేఖాతరు.. పర్యావరణ విధ్వంసం
- ప్యాలెస్‌ను వీడియో తీసి ప్రజల్లో చర్చకు పెడతాం
- ప్యాలెస్ సందర్శనకు ప్రజలకూ అవకాశం ఇస్తాం
- వారి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే భవనాన్ని దేనికి వాడుకోవాలో నిర్ణయిస్తాం: సీఎం
- అధికారులు, మీడియాతో కలిసి ప్యాలెస్ సందర్శన
- రాజరికాన్ని తలపిస్తుండడాన్ని చూసి విస్మయం

అధికారం అడ్డంపెట్టుకుని చేసే తప్పులకు రుషికొండ ప్యాలెస్ ఓ కేస్ స్టడీ: బాబు

14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన నేను ఏన్నో దేశాలు తిరిగాను. ఎన్నో ప్యాలెస్‌లు చూశాను. కానీ ఒక వ్యక్తి విలాసం కోసం పర్యావరణాన్ని హరించి ప్యాలెస్ కట్టడం ఎక్కడా నేను చూడలేదు. రుషికొండ ప్యాలెస్‌లోని ఫర్నిచర్, షాండ్లియర్స్, కమోడ్స్ చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది. ఒక వ్యక్తి దుర్మార్గంతో ఇలాంటి ప్రయోగాలు చేశాడా అని బాధ కలుగుతోంది. ఉత్తరాంధ్ర నీటిపారుదల ప్రాజెక్టుల కోసం గత ఐదేళ్లలో రూ.400 కోట్లు కూడా జగన్ ఖర్చుపెట్టలేదు. కానీ, కేవలం తన విలాసం కోసం రూ.430 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారు. - సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలో రుషికొండ ప్యాలెస్‌ను చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో నిబంధనలను ఇంతగా ఉల్లంఘించగలరా అని ఆశ్చర్యం, ఉద్వేగం కలుగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం అడ్డం పెట్టుకుని చేసిన విధ్వంసం, బరితెగింపుపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఆయన రుషికొండపై ప్యాలెస్‌ను సందర్శించారు. నాలుగు బ్లాక్‌లను నిశితంగా పరిశీలించారు. ప్యాలెస్

మిగతా 13వ పేజీలో...



మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలో పార పట్టి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

రోడ్లకు సం..క్రాంతులు

- జనవరి 15 నాటికి గుంతలు లేని రోడ్లు 13
- 860 కోట్లతో రాష్ట్రమంతటా మరమ్మతులు
- గుంతలు లేని ఏపీ మిషన్‌కు సీఎం శ్రీకారం

నక్కపల్లిలో 70 వేల కోట్లతో స్టీల్ ఫ్యాక్టరీ

జనవరిలో కొత్త రేషన్‌కార్డులు!

కొత్తగా పెళ్లైన జంటలకు, అర్హత ఉన్న పేదలకు తొలి ప్రాధాన్యం 12

కూటమిలో చిటపటలు!



- క్షేత్రస్థాయిలో చిన్న విషయాలకే గొడవలు
- గోదావరి జిల్లాల్లో చేయిదాటుతున్న పరిస్థితులు
- ఫొటోలు, కండువాల విషయంలో రచ్చ
- పలుచోట్ల ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని టీడీపీ, జనసేన పార్టీల నేతల్లో అసంతృప్తి
- కొత్తగా వస్తున్న వైసీపీ నేతలతోనూ సమస్యలు
- అగ్రనాయకులు కల్పించుకుని సమన్వయ కమిటీలు వేయాలని సీనియర్ల సూచనలు

కొన్నిచోట్ల రచ్చకెక్కుతున్న తమ్ముళ్లు, సైనికులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వంలో అగ్రనాయకులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నా... కింది స్థాయి నేతల్లో అక్కడక్కడ సఖ్యత లోపిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు చేజారిపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల మధ్య గ్యాప్ పెరుగుతోంది. ఎన్నికల సమయంలో ఉన్న సమన్వయం ఇప్పుడు కొరవడుతోంది. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతోంది. అగ్రనేతలు కల్పించుకుని పరిస్థితిని చక్కదిద్దకపోతే చిలికి చిలికి గాలివానగా మారే ప్రమాదం లేకపోలేదు. గ్రామ స్థాయి నుంచి ప్రారంభమైన అంతరం మండల స్థాయికి, ఇప్పుడు నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ చేరింది. ఉమ్మడి

మిగతా 13వ పేజీలో...



వచ్చే ఏడాదీ గోల్డ్ జిగేల్!

- ఇన్వెస్టర్లకు మళ్లీ రెండంకెల్లో రిటర్నులు
- 3,000 డాలర్లకు ఔన్స్ గోల్డ్!? 10
- బులియన్ విశ్లేషకుల అంచనా ఇదీ..
- గత సంవత్సరంలో పసిడి 32 శాతం అప్
- 39 శాతం పెరిగిన వెండి విలువ

పోలవరంపై జగన్ బొంకులు 12

గత ఐదేళ్లలో ప్రాజెక్టు సర్వనాశనం

గతం మరచి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు

మానవత్వమా.. నీవెక్కడ? 14

నడిరోడ్డుపై అమ్మ!



- అర్ధరాత్రి మరో ఊరిలో వదిలేసిన కొడుకు
- అవసాన దశలో.. చలిలో వృద్ధురాలి అవస్థలు
- కాలు విరగడంతో కొన్నాళ్లుగా కదల్లేని స్థితి
- అదే ఊరిలో కూతురు ఉన్నా తీసుకెళ్లని వైనం
- పత్తికొండలో అమానవీయ ఘటన

ఆరోగ్య శాఖలో ఔషధాల దందా

ప్రభుత్వ ఆసుపత్రులకు తక్కువ ధరలకు బ్రాండెడ్ ఔషధాలను సరఫరా చేసే పేరుతో జగన్ హయాంలో భారీ స్కామ్‌కు పాల్పడ్డారు. తక్కువ ధరకే పేద రోగులకు నాణ్యమైన మందులిస్తామని ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం చేకూర్చారు. చివరికి జనరిక్ మందులు సరఫరా చేసి నాణ్యతను దెబ్బతీశారు. ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

- 'సెంట్రలైజ్డ్' విధానంతో దోపిడీ 13
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల నష్టం
- మందుల ధర పెంచేసిన శ్రీకృష్ణ ఫార్మా
- మార్కెట్ ధర కంటే అధిక ధరకు సరఫరా
- 36% తక్కువ ధరకే ఇస్తున్నట్లు కలరింగ్
- జగన్ జమానాలో చెలరేగిపోయిన సంస్థ
- మంత్రి ఆరాతో వాస్తవాలు వెలుగులోకి

నా సలహా వంద కోట్లు!



2

- పార్టీల నుంచి వసూలు చేసే ఫీజు ఇదే
- రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడి



వామ్మో స్టిరాయిడ్స్!

- నొప్పుల నివారణకు ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఆర్ఎంపీలు
- కొందరు వైద్యులదీ అదే దారి.. విచ్చలవిడిగా వాడితే దుష్ప్రభావాలు
- తరచూ ఇన్ఫెక్షన్ల ప్రమాదం.. బోలు ఎముకలు, బరువు పెరగడం,చర్మం పల్చబడటం వంటి సమస్యలు 12
- హృద్రోగ, కిడ్నీ వ్యాధుల గండం.. నిర్దేశిత రీతిలో వాడకుంటే ముప్పే

తూర్పు మణిహారం విశాఖ



విశాఖ తూర్పు తీరంలో ఇటీవల నేవీ నిర్వహించిన ఓ విన్యాసం

త్వరలో థియేటర్ లెవెల్ కమాండ్.. త్రివిధ దళాల కేంద్రంగా సాగర నగరం

- సమన్వయంతో ఉమ్మడి ఆపరేషన్లు
- దేశ రక్షణలో తూర్పు నేవీ కీలకపాత్ర
- 'సిటీ ఆఫ్ డెస్టినీ'కి ఎన్నెన్నో ప్రత్యేకతలు
- 3 అణు జలాంతర్గాముల తయారీ
- 2 నెలల వ్యవధిలోనే 2 జలప్రవేశం
- ప్రతి రెండేళ్లకోసారి 'మిలాన్'

తూర్పు నౌకాదళం ఇటీవల స్టార్ ఎస్-4 అణు జలాంతర్గామిని ప్రారంభించడంతో విశాఖపట్నం పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోయింది. రెండు నెలల క్రితమే ఐఎన్ఎస్ అరిఘాత్ సేవలను ప్రారంభించగా, ఆ వెంటనే అత్యంత వేగంగా స్టార్ ఎస్-4 జలప్రవేశం చేయడంతో ప్రపంచం ఆశ్చర్యపోయింది. స్వదేశీ పరిజ్ఞానంతో విశాఖలో తయారు చేసిన మూడో అణు జలాంతర్గామి ఇది. మన దేశ రక్షణ రంగంలోనే తూర్పు నౌకాదళం అత్యంత వ్యూహాత్మకమైనది.

విశాఖ కేంద్రంగా సేవలందిస్తున్న తూర్పు నౌకాదళంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం... 14లో



ఐఎన్ఎస్ డేగాలో నిలిపి ఉంచిన హాక్స్ యుద్ధ విమానాలు

క్షయ కేసులు 26% భారత్‌లోనే

న్యూఢిల్లీ, నవంబరు 2: ప్రపంచంలోని క్షయ కేసులు 26 శాతం భారత్‌లోనే ఉన్నాయి. మొత్తం కేసుల్లో 56 శాతం కేవలం అయిదు దేశాల్లో ఉండగా, వాటన్నింటిలోనూ భారత్‌లోనే అధికంగా ఈ వ్యాధి ప్రభావం కనిపిస్తోంది. ఇండోనేషియాలో 10%, చైనాలో 6.8%, ఫిలిప్పీన్స్‌లో 6.8%, పాకిస్థాన్‌లో 6.3 శాతం కేసులు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) విడుదల చేసిన గ్లోబల్ టీబీ రిపోర్ట్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. టీబీ కారణంగా జరిగే మరణాల్లో 81 శాతం ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లోనే ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. మందులకు లొంగని మల్టీడ్రగ్ రెసిస్టెన్స్ టీబీ బాక్టీరియా (ఎండీఆర్-టీబీ) ప్రభావం కూడా భారత్‌లోనే అధికంగా ఉంది. క్షయ నివారణకు వినియోగించే ఐసోనియాజిడ్, రిఫాంపిన్ మందులకు కూడా లొంగని బాక్టీరియానే ఎండీఆర్-టీబీగా వ్యవహరిస్తున్నారు.

మోదీవి చిల్లర రాజకీయాలు: సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల రంగు బయటపడుతోందని, వాటి రద్దుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో శుక్రవారం పెట్టిన పోస్టుపై సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. చిల్లర రాజకీయ నాయకుల తరహాలో ప్రధాని అబద్ధాలు చెప్పడం విచారకరమన్నారు. గ్యారెంటీల అమలు విజయవంతంగా సాగుతోందని తెలిపారు. ఆర్థిక పరిస్థితిని అధిగమించి పథకాలను అందిస్తుంటే.. వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన ప్రధాని ఒక చిల్లర రాజకీయ నాయకుడి తరహాలో అసత్య ఆరోపణలు చేయడం కర్ణాటక రాష్ట్రాన్ని, కన్నడిగులను అవమానించినట్లే అని పేర్కొన్నారు. దేశంలో అత్యధిక పన్ను వసూళ్లలో మహారాష్ట్ర తర్వాత 11.9 శాతం కన్నడిగులదేనన్నారు. అన్నింటినీ రాజకీయ రంగులో చూసే ధోరణి వీడాలని ప్రధానికి హితవు పలికారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కూడా ప్రధానిపై విరుచుకుపడ్డారు. అబద్ధాలు, మోసం, నకిలీ, లూటీ వంటివి మోదీ ప్రభుత్వ మూల మంత్రాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు సాధ్యమయ్యాయా? అని ప్రశ్నించారు. 2004తో పోలిస్తే 2022లో మహిళలు, దళితులు, చిన్నారులపై 1.7శాతం నేరాలు పెరిగాయని అన్నారు.

అయ్యప్ప స్వాములకు రూ.5 లక్షల ఉచిత బీమా

కొట్టాయం, నవంబరు 2: ఈ ఏడాది మండలం-మకరవిలక్కు పూజల నివిత్తం శబరిమల వచ్చే అయ్యప్ప స్వాముల కోసం కేరళ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ తెలిపారు. శబరిమల వచ్చే భక్తులందరికీ ఆలయాన్ని నిర్వహించే ట్రావంకోర్ దేవస్వోమ్ బోర్డు (టీడీబీ) ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తుందని వెల్లడించారు. సన్నిధానం, పంబ, అప్పచ్చిమేడు, నీలక్కల్ ఇతర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అక్కడ గుండెకు సంబంధించిన వ్యాధుల చికిత్సకు కూడా ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు.

హిందీపై మాకు ఎలాంటి ద్వేషం లేదు: ఉదయనిధి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హిందీ భాషపై తమకెలాంటి ద్వేషం లేదని, అయితే నిర్బంధంగా తమపై రుద్దడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. బీజేపీ ఒకే భాష, ఒకే సంప్రదాయం, ఒకే ఎన్నిక విధానాన్ని తమిళనాడు, కేరళ ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ... ద్రావిడం అనేది తమిళ సంస్కృతి సంప్రదాయాలకు గౌరవం తెస్తోందన్నారు.దేశంలో ప్రాంతీయ భాషలు సజీవంగా ఉన్నాయంటే ద్రావిడ ఉద్యమమే కారణమన్నారు.

ఆంక్షలపై అమెరికాతో చర్చిస్తున్నాం: భారత్

న్యూఢిల్లీ, నవంబరు 2: రష్యాకు సాయం చేస్తున్నారనే కారణంతో భారతీయ కంపెనీలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించడంపై భారత్ స్పందించింది. సమస్యల పరిష్కారానికి అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. వ్యూహాత్మక వాణిజ్యం, నియంత్రణకు సంబంధించి భారత దేశం బలమైన చట్టాలను కలిగి ఉందని అలాగే ఐక్యరాజ్యసమితి ఆంక్షలపై కూడా అవగాహన కలిగి ఉందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ తెలిపారు. దేశంలోని చట్టాలు, ఐక్యరాజ్యసమితి నిబంధనలకు అతీతంగా ఏ భారతీయ కంపెనీ వ్యవహరించలేదని, దీని గురించి అమెరికాకు వివరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు.

ఉప ముఖ్యమంత్రిపై ఎక్స్‌లో అనుచిత వ్యాఖ్యలు

» సైబర్ పోలీసులకు జనసేన ఫిర్యాదు

విజయవాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఎక్స్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై జనసేన నేతలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పవన్ కల్యాణ్, ఆయన కుమార్తెలపై ఎక్స్‌లో అనుచిత వ్యాఖ్యలతో పోస్టింగ్‌లు పెట్టారని పశ్చిమ నియోజకవర్గ నేతలు సాయిశరత్, సంగీత, కనకారావు శనివారం ఫిర్యాదు చేశారు. ఎక్స్‌లో నేహ కల్యాణ్, ఎఫ్ రెడ్డి పేర్లతో ఉన్న ఖాతాల్లో ఈ వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఏపీకి వరదలా పెట్టుబడులు: డూండీ రాకేశ్

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పెట్టుబడులు ఏపీకి వరదలా రానున్నాయని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేశ్ చెప్పారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు వద్దకు పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారు. ఇది చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై అబద్ధాలతో విమర్శలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమ రాష్ట్రానికి తీసుకురాని వైసీపీ నేతలు.. ఉన్న పరిశ్రమలను జే ట్యాక్స్ కోసం తరిమికొట్టారు. ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నారు' అని రాకేశ్ చెప్పారు.

ఎట్టకేలకు ఏవోలకు ఇంక్రిమెంట్లు

» నాలుగేళ్ల ఎదురు చూపులకు మోక్షం


గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ అధికారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న ఇంక్రిమెంట్ మంజూరుకు పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో 140 మంది వ్యవసాయ విస్తరణ అధికారులకు నాలుగేళ్ల క్రితం ఏఓలుగా అడ్‌హాక్ ప్రమోషన్ కల్పించారు. అప్పటి నుంచి వారికి న్యాయబద్ధంగా సంవత్సరానికి ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలి. కానీ నాలుగేళ్లపాటు రాష్ట్ర కార్యాలయం చుట్టూ తిరిగినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్‌ను ఆశ్రయించగా, ఆయన చొరవతో ప్రభుత్వం ఇంక్రిమెంట్ మంజూరుకు అవసరమైన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు ఏఓలకు ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు చర్యలు సత్వరం చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ డిల్లీరావు జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌కు అగ్ని పరీక్షేనా..!

సంక్లిష్టంగా బీజేపీతో ముఖాముఖి.. మహారాష్ట్రలో మిత్రుల ఓటు బదిలీపైనే ఆశలు

» హరియాణా ఎన్నికల తర్వాత ఆచితూచి అడుగులేస్తున్న హస్తం

» పోటీలో 50 మంది రెబెల్స్..!



న్యూఢిల్లీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ-కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. సుస్థిరాభివృద్ధి పేరుతో బీజేపీ దూసుకుపోతుండగా.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించి సత్తా చాటేందుకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. అయితే.. హరియాణా ఎన్నికల్లో బీజేపీతో ముఖాముఖి తలబడి.. దెబ్బతిన్న కాంగ్రెస్ మహారాష్ట్రలోనూ భారీ అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. మహారాష్ట్ర విధానసభలో మొత్తం 288 అసెంబ్లీ సీట్లుండగా.. 75 స్థానాల్లో బీజేపీ-కాంగ్రెస్ నేరుగా తలబడుతున్నాయి. కొన్ని స్థానాల్లో నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగనుండగా.. మరికొన్ని చోట్ల మిత్ర పక్షాల ఓటు బదిలీపై ఈ రెండు జాతీయ పార్టీలు ఆధారపడుతున్నాయి. మిత్రపక్షాల ఓటు బదిలీ విషయంలో బీజేపీ ధీమాగా ఉండగా.. కాంగ్రెస్ శిబిరంలో కల్లోలం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరువు ప్రాంతమైన విదర్భతోపాటు.. పశ్చిమ, ఉత్తర మహారాష్ట్రలు, మరాఠ్వాడా, కొంకణ్‌తోపాటు.. ముంబై, థానె ప్రాంతాల్లో కమలం-హస్తం మధ్య గట్టిపోటీ నెలకొంది.

గత ఫలితాల్లో కమలం హవా

2019 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ ముఖాముఖి తలపడ్డ చోట్ల కమలనాథులు పైచేయి సాధించారు. విదర్భ ప్రాంతంలో 32 చోట్ల ఈ రెండు పార్టీలు తలపడగా.. 23 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ తొమ్మిదింటితో సరిపెట్టుకుంది. మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార పీఠానికి చేరువవ్వాలంటే.. విదర్భలో సత్తా చాటాలనే ఆనవాయితీ కొనసాగుతోంది. బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, విపక్ష నేత(కాంగ్రెస్) విజయ్ వెడట్టివార్ ఈ ప్రాంతానికి చెందినవారే. ఇక ముంబై మహానగరంలో అత్యధిక స్థానాలను సాధించే పార్టీ అధికారపీఠానికి చేరువవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ 12 సీట్లు ఉండగా.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్కచోట మాత్రమే విజయం సాధించింది. పట్టణ ఓటర్లు చాలా వరకు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని.. పారిశ్రామికవేత్తలు పూర్తిగా ఆ పార్టీ నియంత్రణలో ఉండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముంబైలో కాంగ్రెస్‌కు మిత్రపక్షం శివసేన(యూబీటీ) ఓట్లు పక్కాగా బదిలీ అయితే తప్ప.. ఆ పార్టీ సత్తా చాటే అవకాశాలు అంతంత మాత్రమేనంటున్నారు. మరాఠ్వాడలో 10 స్థానాలకు గాను.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మూడుచోట్లే సఫలమైంది. పశ్చిమ మహారాష్ట్రలో ఏడు స్థానాలుండగా.. బీజేపీ ఐదింటిని, కాంగ్రెస్ రెండింటిని దక్కించుకున్నాయి.


తిరుగుబాటు బావుటాలు..

టికెట్ల జారీ తర్వాత అసంతృప్తులను, రెబెల్స్‌ను బుజ్జగించడం బీజేపీ- కాంగ్రెస్‌లకు కత్తిమీద సాములా మారినట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలకు చెందిన 50 రెబెల్స్ నామినేషన్లు వేయగా.. ఈ నెల 4న ఉపసంహరణ గడువులోగా వారిని సముదాయించే దిశలో ముఖ్య నేతలు చర్యలు తీసుకుంటున్నారు. 36 మంది మహాయుతి నుంచి టికెట్ ఆశించి భంగపడి.. రెబెల్స్‌గా నిలబడ్డారు. వీరిలో అత్యధికంగా బీజేపీ నుంచి 19 మంది, శివసేన(శిందే వర్గం) నుంచి 16 మంది, ఒకరు ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) నుంచి ఉన్నారు. ఎంవీఏకు చెందిన 14 మంది నేతలు.. తిరుగుబాటు అభ్యర్థులుగా నిలిచారు. వీరిలో అత్యధికంగా 10 మంది కాంగ్రెస్ నుంచి, నలుగురు శివసేన(యూబీటీ) ఉన్నారు. ఇదిలా ఉండగా, రాజ్ థాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సమితి(ఎంఎన్ఎస్)కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్‌థాక్రే కుమారుడు అమిత్‌తోపాటు.. ఆ పార్టీ నుంచి బరిలోకి దిగిన బలమైన అభ్యర్థులకు కమలనాథులు ఏకపక్ష మద్దతునిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది శివసేన(శిందే) వర్గానికి ఇబ్బందికరంగా మారనుంది.

ప్రచారానికి 14 రోజులే..

ఈ నెల 4తో నామినేషన్ల ఉపసంహరణ ముగుస్తుంది. 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకు.. అంటే.. 14 రోజులు మాత్రమే ప్రచారానికి అవకాశం ఉంటుంది. ఈ మధ్యలో ఉండేవి రెండు ఆదివారాలు మాత్రమే..! దీంతో అభ్యర్థులు ఉరుకులు-పరుగులతో ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రెండు ఆదివారాల్లో స్టార్ కాంపెయినర్లు సుడిగాలి పర్యటనలు నిర్వహించాల్సి వస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా బీజేపీ సోషల్ మీడియా విభాగం డిజిటల్ ప్రచారాన్ని ముమ్మరం చేయగా.. కాంగ్రెస్ ఈ విషయంలో ఒకింత వెనకబడి ఉందని తెలుస్తోంది.

లోకం తీరు



వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ఉగ్రవాదులు హతం

» నలుగురు జవాన్లకు గాయాలు

» కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఘటన

శ్రీనగర్, నవంబరు 2: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేత కొనసాగుతోంది. శనివారం ఉదయం అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ముష్కరులు హతమయ్యారు. నలుగురు సైనికులు గాయపడ్డారు. శుక్రవారం బుద్గామ్ జిల్లాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వలసకార్మికులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు ముష్కరుల కోసం కూంబింగ్ చేపట్టాయి. అనంత్‌నాగ్ జిల్లాలోని ఖాన్యార్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో గాలింపు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో సైనికులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో జవాన్లు ఎదురుదాడి చేశారు. ఈ ఘటనలో ఓ ఉగ్రవాదిని హతమార్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం హల్కన్ గాలి ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న క్రమంలో మరో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు చెప్పారు. ఈ ఘటనలో నలుగురు సైనికులు గాయపడ్డారు.

ఉగ్రవాదులను చంపొద్దు.. పట్టుకోవాలి

జమ్మూకశ్మీర్‌లో ఇటీవలి కాలంలో వరుస ఉగ్రవాద దాడులు పెరగడంపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధినేత, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా అనుమానం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ఎవరో కుట్ర పన్ని దాడులు చేయిస్తున్నట్లు ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి ఉగ్రవాద దాడులపై కేంద్రం దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్లలో చంపకుండా, ప్రాణాలతో పట్టుకొని ప్రశ్నిస్తే.. వారి వెనుక ఉన్నవారెవరో బయటకు వస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది.

నా సలహా ఖరీదు 100 కోట్లు!

» పార్టీల నుంచి వసూలు చేసే ఫీజు ఇదే

» వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వెల్లడి



పట్నా, నవంబరు 2: ఎన్నికల వ్యూహకర్త, బిహార్‌లోని జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిషోర్ తాను వసూలు చేసే ఫీజు ఎంతో వెల్లడించారు. దేశంలోని పలు రాజకీయ పార్టీలకు వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ వాటికి తానందించిన సేవలకు గానూ తీసుకునే ఫీజు ఎంతో ప్రకటించారు. బిహార్ ఉప ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్... తన ఫీజుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీ నిర్వహణకు తనకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడుగుతున్నారని, తాను ఏదైనా పార్టీకి వ్యూహకర్తగా సేవలందిస్తే అందుకు ఫీజుగా రూ.100 కోట్లు, అంతకుమించి కూడా తీసుకుంటానని చెప్పారు. వివిధ రాష్ట్రాలలో పది ప్రభుత్వాలు తన వ్యూహాలతో నడుస్తున్నాయని ప్రశాంత్‌కిషోర్ చెప్పుకొచ్చారు. తాను ఒక ఎన్నికలకు వ్యూహకర్తగా పనిచేస్తే వచ్చే సొమ్ముతో రెండేళ్ల రాజకీయ పార్టీని నిర్వహించగలనని అన్నారు. ఒక పార్టీ నుంచి వంద కోట్లు, ఆపైన తీసుకునే తాను ఆర్థికంగా బలహీనంగా ఉన్నట్లా? అంటూ ప్రశాంత్ కిషోర్ ఎదురు ప్రశ్నించారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వ్యూహకర్తగా పనిచేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రశాంత్ కిషోర్‌కు ఆ ఎన్నికలలో నరేంద్ర మోదీ విజయం సాధించడంతో తిరుగు లేకుండా పోయింది. ఆ తర్వాత 2015 ఎన్నికలలో బిహార్‌లో జేడీయూ-ఆర్జేడీ కూటమికి ప్రశాంత్ కిషోర్ పనిచేశారు. 2017లో ఉత్తరప్రదేశ్‌లో వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్‌ను నియమించుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి ఆ ఎన్నికలలో ఓటమి తప్పలేదు. అయితే, ఆ తర్వాత 2021లో పంజాబ్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించడంలో ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు పనిచేసాయి. 2019లో ఏపీలో వైసీపీకి సలహాదారుగా వచ్చిన ప్రశాంత్... ఆ ఎన్నికలలో జగన్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2020లో ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఘన విజయానికి, 2021లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్నికలలో బీజేపీని ధీటుగా ఎదుర్కోవడంలో టీఎంసీకి ప్రశాంత్ కిషోర్ కీలకంగా పనిచేశారు.

ఎయిర్ ఇండియా విమానంలో తూటా

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, ఖాట్మండూ, నవంబరు 2: విమానాలకు వరుస బాంబు బెదిరింపుల వేళ అప్రమత్తంగా ఉండాల్సిన తరుణంలో భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. అక్టోబరు 27న దుబాయ్ నుంచి ఢిల్లీ వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో తూటా లభ్యమైంది. ఏఐ 916 విమానంలో సిబ్బంది శుభ్రం చేస్తుండగా ప్రయాణికుల సీట్ పాకెట్‌లో తూటా దొరికింది. దీంతో ఆయుధ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఇండియన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానానికి శనివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఖాట్మండూ నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో బాంబు ఉందంటూ అగంతకులనుంచి సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నేపాల్ రాజధాని ఖాట్మండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు 4 గంటల పాటు తనిఖీలు చేశారు. చివరకు బాంబు బెదిరింపు ఉత్తిదే అని తేల్చారు. ఈ నెల 28న కూడా నేపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానానికి కూడా ఇలాగే బాంబు బెదిరింపు వచ్చింది. సోషల్ మీడియా ద్వారా శనివారం మొత్తం 19 ఇండిగో విమానాలకు బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. గత రెండు వారాల్లో ఇప్పటివరకు 510 స్థానిక, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. కాగా, బిహార్‌లోని దర్భంగా నుంచి న్యూఢిల్లీ వచ్చే బిహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు కూడా శుక్రవారం సాయంత్రం ఇలాంటి హెచ్చరికే వచ్చింది. దీంతో రైలును మధ్యలో ఓ స్టేషన్‌లో నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

మీ చర్యలు బాధ్యతారహితం

ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.. కెనడాకు భారత్ గట్టి హెచ్చరిక

» అమిత్ షాపై కెనడా మంత్రి మోరిసన్ నిరాధార ఆరోపణలు: రణధీర్ జైస్వాల్


రణధీర్ జైస్వాల్

న్యూఢిల్లీ/ఒట్టావా, నవంబరు 2: కెనడాలో ట్రూడో ప్రభుత్వంపై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఆ దేశ మంత్రి అసంబద్ధ, నిరాధార వ్యాఖ్యలు చేయడంపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేసింది. కెనడాలోని భారత దౌత్యవేత్తలను ఆడియో, వీడియో నిఘాలో ఉంచడంపై ట్రూడో ప్రభుత్వానికి అధికారికంగా నిరసన తెలిపినట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. శనివారం ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. 'ఈ అంశంపై కెనడా హై కమిషన్ ప్రతినిధికి శుక్రవారం సమన్లు జారీ చేశాం. కేంద్ర హోంమంత్రిని ఉద్దేశించి పబ్లిక్ సేఫ్టీ అండ్ నేషనల్ సెక్యూరిటీ స్టాండింగ్ కమిటీ ముందు ఆ దేశ మంత్రి డేవిడ్ మోరిసన్ ఇటీవల అసంబద్ధమైన, నిరాధారమైన వ్యాఖ్యలు చేయడాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టంగా తెలియజేశాం. భారత్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి, ఇతర దేశాలను ప్రభావితం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే కెనడా అధికారులు అంతర్జాతీయ మీడియాకు నిరాధార సమాచారం లీక్ చేశారు. కెనడాలోని ప్రస్తుత ప్రభుత్వ రాజకీయ అజెండా, ప్రవర్తనా సరళిపై భారత్‌కు చాలాకాలంగా ఉన్న అభిప్రాయాన్ని ఇది ధ్రువీకరిస్తోంది. ఇటువంటి బాధ్యతారాహిత్యమైన చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి' అని జైస్వాల్ పేర్కొన్నారు. 'కెనడాలోని కొందరు భారత దౌత్యవేత్తలు ఆడియో, వీడియో పర్యవేక్షణలో ఉన్నారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వం వారికి ఇటీవల సమాచారం ఇచ్చింది. వారి కమ్యూనికేషన్లను కూడా అడ్డుకున్నారు. ఈ చర్యలు దౌత్య, కాన్సులర్ ఒప్పందాలను ఉల్లంఘించడమే. మన దౌత్య సిబ్బంది ఇప్పటికే తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో పనిచేస్తున్నారు. దౌత్య నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కెనడా చర్యలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి" అని జైస్వాల్ ఆరోపించారు. కెనడాలోని పార్లమెంట్ హిల్‌లో దీపావళి వేడుకలు రద్దు కావడం దురదృష్టకరమన్నారు.

కెనడా మరో కవ్వింపు చర్య

భారత్‌పై కెనడా మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. ఖలిస్థానీ తీవ్రవాదులతో పాటు తమ ప్రభుత్వ నెట్‌వర్క్‌లను హ్యాక్ చేయడానికి భారత అధికారులు సైబర్ టెక్నాలజీని ఉపయోగించారని ట్రూడో ప్రభుత్వం ఆరోపించింది. కెనడాపై సైబర్ దాడికి పాల్పడతాయని అనుమానిస్తున్న దేశాల జాబితాలో భారత్‌ను కూడా చేర్చింది. ఆ దేశ గూఢచార సంస్థ సీఎస్ఈ (కమ్యూనికేషన్స్ సెక్యూరిటీ ఎస్టాబ్లిష్‌మెంట్) తాజాగా విడుదల చేసిన నేషనల్ సైబర్ థ్రెట్ అసెస్‌మెంట్ 2025-26 నివేదికలో చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాతో పాటు ఐదో స్థానంలో భారత్ పేరును కూడా పేర్కొంది. కెనడా సహా ఇతర దేశాల్లోనూ ఖలిస్థానీ శక్తులు, ప్రభుత్వ అసమ్మతివాదులను ట్రాక్ చేయడానికి భారత్ తన సైబర్ సామర్థ్యాలను దుర్వినియోగం చేసిందని సీఎస్ఈ నివేదిక ఆరోపించింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని ఆరోపణలు చేసిన తర్వాత కెనడా మిలిటరీకి చెందిన వెబ్‌సైట్లతో పాటు అనేక కెనడియన్ వెబ్‌సైట్లపై భారత్ అనుకూల హ్యాకర్ల గ్రూపు దాడి ప్రారంభించిందని ఆరోపించింది. ఈ ఆరోపణలపై రణధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. 'ఎప్పటిలాగా ఏ ఆధారాలు లేకుండానే వారు ఇలాంటి ఆరోపణలు చేస్తుంటారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత్‌కు ఎవరితో మేలు!

డొనాల్డ్ ట్రంప్, కమల హారిస్ విధానాల్లో మనకు ఏది మేలు?



అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సిద్ధమైంది. మంగళవారమే దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ట్రంపా? కమలా? ఎవరు గెలిస్తే భారత్‌కు మేలు జరుగుతుంది? అనేదానిపై అనేక విశ్లేషణలు తెరమీదికి వస్తున్నాయి.

కమల హారిస్ గెలిస్తే!

కమల హారిస్.. భారత మూలాలు ఉన్న నాయకురాలు. ఆమె తల్లి తమిళనాడుకు చెందినవారుకాగా, తండ్రి జమైకా దేశానికి చెందిన వారు. ఇరువురు అమెరికాలో వివాహం చేసుకున్నారు. కమల తరచుగా చెన్నైకు రావడమే కాకుండా దక్షిణాది వంటకాలను ఎంతో ఇష్టపడతారు. భారతీయ సంప్రదాయాలను కూడా ఆమె అర్థం చేసుకున్నారు. అయితే, ఆమె భారత్‌కు అత్యంత అనుకూలంగా ఉన్నారా? అనే విషయంలో ఇతమిత్థంగా ఏమీ చెప్పలేని పరిస్థితి ఉంది. గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలు దీనికి బలాన్ని చేకూరుస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు కమల తనదైన శైలిలో స్పందించారు. "ఈ ప్రపంచంలో కశ్మీరీలు ఒంటరిగా లేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. పరిస్థితిని మేం నిశితంగా గమనిస్తున్నాం. అవసరమైనప్పుడు, పరిస్థితులు డిమాండ్ చేసినప్పుడు మేం జోక్యం చేసుకుంటాం" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు, భారత అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని పరిశీలించవచ్చని కూడా అన్నారు. భారత్ వ్యవహారంలో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ విధానాలను ఆమె కొనసాగిస్తే ఆందోళన తప్పదన్న భావన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా భారత్‌లో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, అంతర్గత విషయాల్లో బైడెన్ కొన్ని అభ్యంతరకర విధానాలను అనుసరిస్తున్నారు. ప్రధానంగా ముస్లింలు ఇతర మైనారిటీల విషయంలో మోదీ ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని బైడెన్ సర్కారు ఆరోపిస్తోంది. అయితే, ఇటీవల.. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల మాట్లాడుతూ.. తన పాలన బైడెన్ పాలనకు భిన్నంగా ఉంటుందన్నారు. కమల తన ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్‌ను ప్రకటించారు. వాల్జ్‌కు చైనాతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడం, తరచుగా ఆయన బీజింగ్‌లో పర్యటించడం వంటివి భారత్‌కు భవిష్యత్తులో ఇబ్బందికర పరిణామాలేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలావుంటే, ఇమ్మిగ్రేషన్, ఎనర్జీ అంశాలలో కమల హారిస్ వల్ల భారత్‌కు మేలు జరుగుతుందని చెబుతున్నారు. హెచ్-1బీ వీసాలను మరింత పెంచే అవకాశం ఉందని, ఇది భారత ఐటీ సేవల రంగానికి భారీ మేలు చేస్తుందని అంటున్నారు.

ట్రంప్ విజయం సాధిస్తే!

రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ విజయం దక్కించుకుంటే.. భారత్‌కు ఎలాంటి మేలు జరుగుతుందన్న చర్చ కూడా సాగుతోంది. ప్రధాని మోదీతో ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. భారత్ కూడా ట్రంప్ విజయాన్నే కోరుకుంటున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మోదీ-ట్రంప్ పలు విషయాలపై కలిసి పనిచేయడం, 2020 ఎన్నికల్లో 'అబ్ కీబార్-ట్రంప్ సర్కార్(ఈసారి ట్రంప్ ప్రభుత్వమే) అంటూ మోదీ నినదించడం వంటివి ఇరువురి మధ్య బంధాన్ని స్పష్టం చేస్తున్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రంప్ పాలనలో ఇరువురు నేతలు కలిసిమెలిసి పనిచేసినట్టు చెప్పుకొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు భారత్‌కు దన్నుగా మారుతున్నాయి. తాను అధ్యక్ష పీఠం ఎక్కగానే ఈ యుద్ధాన్ని తక్షణం నిలిపివేస్తానని ట్రంప్ హామీ ఇస్తున్నారు. ఇది.. మాస్కోతో చెలిమి చేస్తోందన్న పాశ్చాత్య దేశాల విమర్శల నుంచి బయటపడేందుకు భారత్‌కు ఉపయోగపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే.. ట్రంప్ విజయం సాధిస్తే.. భారత దిగుమతులు, ఎగుమతులపై సుంకాలు పెంచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

\- సెంట్రల్ డెస్క్

ఎల్లుండే అమెరికా ఎన్నికలు

» జనవరి 20న శ్వేతసౌధంలోకి కొత్త అధ్యక్షుడు



అమెరికా అధ్యక్ష ఎన్నికలు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 5న ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో అధ్యక్ష రేసులో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ అభ్యర్థి కమల హారిస్‌లలో ఎవరు గెలుస్తారు? ఫలితం ఎప్పుడు వస్తుంది? అనే అంశాలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇరు పార్టీలు చరిత్రాత్మకంగా భావిస్తున్న ఈ ఎన్నికల్లో ఇప్పటికే వివిధ దశల్లో 4.1 కోట్ల మంది అమెరికన్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 5న పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే, అధ్యక్షుడిని ప్రకటించేందుకు కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. స్థానిక మీడియా వర్గాల సమాచారం ప్రకారం.. ఓట్ల లెక్కింపు చేపట్టిన రాత్రి లేదా మరుసటి రోజు విజేతను ప్రకటించవచ్చని తెలుస్తోంది. ఇక, 'అసోసియేటెడ్ ప్రెస్' వంటి పెద్ద సంస్థలు ఇప్పటికే పలు సర్వేలు చేశాయి. పోలింగ్ ప్రక్రియ ముగియగానే ఈ సర్వే ఫలితాలను వెల్లడించనున్నాయి. సాధారణంగా 270 లేదా అంతకన్నా ఎక్కువ ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా పరిగణిస్తారు. ఇక, ఎవరు విజయం దక్కించుకున్నా.. 2025, జనవరి 20న శ్వేత సౌధంలో అడుగు పెట్టనున్నారు.

అత్యంత కీలక రాష్ట్రాలివే

అధ్యక్ష బరిలో ఉన్న వారి జాతకాలను నిర్ణయించే అత్యంత కీలక రాష్ట్రాలు ఏడు ఉన్నాయి. వీటిని స్వింగ్ స్టేట్స్‌గా పిలుస్తారు. జార్జియా, మిచిగాన్, పెన్సిల్వేనియా, అరిజోనా, విస్కాన్సిన్, నెవాడా, ఫ్లోరిడా రాష్ట్రాల ఓటర్లే అంతిమంగా అధ్యక్ష అభ్యర్థిని నిర్ణయిస్తారు. వీరితోపాటు మరో కీలక రాష్ట్రం ఓహియో కూడా ఉంది. గత రెండు దఫాలుగా ఈ రాష్ట్ర ప్రజల తీర్పు కూడా నిర్ణయాత్మకంగా ఉంటోంది. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టాలనుకునేవారికి ఈ రాష్ట్రాల్లో గెలుపు అత్యంత కీలకం. మరీ ముఖ్యంగా గత కొన్ని ఎన్నికల నుంచి పెన్సిల్వేనియా కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడ 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఉన్నాయి. ఇవి దక్కించుకోవడం కోసం అభ్యర్థులు చమటోడుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఈ రాష్ట్రం ఇదే తరహా పాత్ర పోషించనుందని సర్వేలు చెబుతున్నాయి. 2020 ఎన్నికల్లో అరిజోనా, జార్జియా, విస్కాన్సిన్, నెవాడాలలో జో బైడెన్ స్వల్ప ఆధిక్యంతో ట్రంప్‌ను ఓడించారు. అధ్యక్ష ఎన్నికల ఫలితం ఎప్పుడు వస్తుందనేది కూడా.. కీలక రాష్ట్రాలపై ఆధారపడి ఉంటుంది. 2020 ఎన్నికల్లో జో బైడెన్‌ను విజేతగా ప్రకటించేందుకు నాలుగు రోజుల సమయం పట్టింది.

\- సెంట్రల్ డెస్క్

6, 7 తేదీల్లో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమలకు వర్షసూచన
- రెండో వారంలో మరో అల్పపీడనం

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 6, 7 తేదీల్లో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది తీరం వైపునకు అల్పపీడనంగానే వచ్చి బలహీనపడుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో తమిళనాడు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఇదికాకుండా ఈ నెల రెండో వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని, అది బలపడి వాయుగుండంగా మారే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు శనివారం సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది.



సాగర్ నీటిమట్టం 588.50 అడుగులు

మాచర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం 588.50 అడుగులు, నీటి నిల్వ 307.57 టీఎంసీలుగా ఉంది. కుడి కాలువ ద్వారా 9,700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,870 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,354 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లో 48,124 క్యూసెక్కులు ఉంది. కాగా శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 20,754 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కామన్ వెల్త్ కాన్ఫరెన్స్‌కు ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో జరిగే 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్(పీపీసీ)లో పాల్గొనేందుకు కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ ఛైర్‌పర్సన్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ కాన్ఫరెన్స్‌లో 50కిపైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. మన దేశం నుంచి ఎంపీ పురందేశ్వరి హాజరవుతున్నారు. మహిళల సమస్యలు, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపు తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారు. ఆస్ట్రేలియాలో జరిగే ఈ సమావేశాల్లో ఆమె పాల్గొని, 11న తిరిగి స్వదేశానికి వస్తారు.

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం

- వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో పెరిగిన రద్దీ



నారాయణగిరి వద్ద క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు



ఆక్టోపస్ భవనం వద్ద క్యూలైన్లో ప్రవేశించేందుకు తోసుకుంటున్న భక్తులు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంతం, లడ్డూ కౌంటర్, అఖిలాండం, అన్నప్రసాద భవనం, ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన కూడళ్లలో రద్దీ నెలకొంది. రింగ్ రోడ్డు కూడా వాహనాలతో నిండిపోయింది. వాహనాలు అధికంగా రావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరుమలలో ట్రాఫిక్ సమస్యలు కనిపించాయి. ఇక, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, గదులు కేటాయించే సీఆర్వో, పద్మావతి, ఎంబీసీ కౌంటర్లూ భక్తులతో కిటకిటలాడాయి. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథిగృహం నుంచి శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ ఆలయం, ఆక్టోపస్ భవనం సర్కిల్ మీదుగా కల్యాణవేదిక వరకు వ్యాపించింది. వీరికి 24 గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు టైంస్లాట్ టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు కూడా దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పడుతోంది.

శివయ్య సన్నిధిలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో లీలా కుమార్

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం వారిని శ్రీస్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈఓ/ఉపకమిషనర్ గోగినేని లీలాకుమార్ అందజేశారు.

రొయ్యల కంపెనీలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీక్

107 మందికి అస్వస్థత

- నలుగురి పరిస్థితి విషమం.. గుంటూరు తరలింపు
- యాజమాన్యంపై కేసు నమోదుకు ఆదేశం



నిజాంపట్నం ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలోని రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీక్ అవడంతో 107 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని నిజాంపట్నం వైద్యశాలకు తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించారు. రాయల్ మెరైన్ రొయ్యల పీల్లింగ్ షెడ్డులో శనివారం మధ్యాహ్నం హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీకయ్యింది. ఆ యాసిడ్ గాలిని పీల్చడంతో ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సహచర కార్మికులు కంపెనీ నుంచి బయటకు పరుగులు తీశారు. కంపెనీ బయట రోడ్డుపైనే కొంతమంది అస్వస్థతకు గురై పడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తన సోదరుడు శివప్రసాద్‌ను వైద్యశాలకు పంపించారు. ప్రథమ చికిత్సతోనే 70 మంది మహిళా కార్మికులు కోలుకోగా, నిజాంపట్నంలో ఇంకా 30 మంది చికిత్స పొందుతున్నారు. నలుగురు మహిళా కార్మికుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తెనాలి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. కర్లపాలెం, పిట్టలవారిపాలెం, బాపూజీపాలెం, గోకర్ణమఠం గ్రామాలకు చెందిన మహిళలు శనివారం కూడా కంపెనీలో రొయ్యల తలకాయలు తీయడానికి వచ్చారు. అక్కడ పనిచేసే సూపర్‌వైజర్లు క్లీనింగ్ చేయడానికి అవసరమైన కెమికల్‌ను కాకుండా మరో ప్రమాదకరమైన కెమికల్‌ను విడుదల చేయడం వల్లనే కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న బంధువులు వందలాదిగా కంపెనీకి తరలివచ్చారు.

ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సంఘటన జరిగిన కంపెనీని కలెక్టర్ మురళి, ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, మంత్రి సోదరుడు శివప్రసాద్ పరిశీలించారు. సరైన జాగ్రత్తలు తీసుకోలేదంటూ కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనపై విచారించి కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో బాధితులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మెరుగైన వైద్యసేవల కోసం ఇద్దరిని తెనాలి, మరో ఇద్దరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలకు, మరో ఇద్దరిని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు.



కంపెనీలో పనిచేసే మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్, మంత్రి సోదరుడు

రాయల్ మెరైన్ కంపెనీ, భవనం టీడీపీ నాయకులదే!

రాయల్ మెరైన్ కంపెనీ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆ భవనం టీడీపీ నాయకులదే. రాయల్ మెరైన్ కంపెనీ బాపట్లకు చెందిన ఓ టీడీపీ నేతకు చెందినది. దీంతో యాజమాన్యానికి ప్రజాసంఘాలు, కొంత మంది ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆ టీచర్ తొలగింపు సరైనదే

- అధికారుల నిర్ణయానికి హైకోర్టు సమర్థన
- నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయురాలిపై ఆగ్రహం

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం ఉందని నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించి దివ్యాంగుల కోటాలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన జి.వెంకట నాగ మారుతి అనే ఉపాధ్యాయురాలిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ టీచర్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. న్యాయస్థానం ఆమెకు రూ.లక్ష ఖర్చులు విధించింది. ఈ సొమ్మును వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల నిర్వహిస్తున్న విశాఖపట్నంలోని ఓంకార్ అండ్ లయన్స్ ఎడ్యుకేషన్ సొసైటీకి నెల రోజుల్లో చెల్లించాలని నాగ మారుతిని ఆదేశించింది. ఆధారాలను ఆరు వారాల్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. తప్పుడు మార్గంలో ఉద్యోగం పొందారని గుర్తించిన తరువాత.. పిటిషనర్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ డీఈవో ఇచ్చిన ఉత్తర్వుల్లో ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రైబ్యునల్‌ను(ఏపీఏటీ) జోక్యం చేసుకోకుండా ఉండాల్సిందని కోర్టు అభిప్రాయపడింది. ట్రైబ్యునల్ ఉత్తర్వులను సవరించి.. అధికారుల ఉత్తర్వులను సమర్థించింది. నాగ మారుతి ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం నాగులవరం జెడ్పీహెచ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా పనిచేస్తున్నారు. డీఎస్సీ-2012లో దివ్యాంగుల కోటాలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. అయితే నాగ మారుతి బోగస్ మెడికల్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందారని డి.నారాయణ అనే 2012 డీఎస్సీ అభ్యర్థి 2014 మార్చిలో డీఈవోకు ఫిర్యాదు చేశారు.

రా'బంధువు'!



నిందితుడు సుశాంత్

మూడున్నరేళ్ల చిన్నారిపై పైశాచికం.. ఆపై చంపి పూడ్చిపెట్టిన ఉన్మాది

- నేరం ఒప్పుకొన్న నిందితుడు.. అరెస్టు
- తిరుపతి జిల్లా వడమాలపేటలో దారుణం
- ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశం
- బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం
- నేడు పరామర్శించనున్న హోంమంత్రి అనిత

పుత్తూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బతుకుతెరువు కోసం భార్యతో కలిసి అత్తగారింటికి వస్తే తీరని శోకం మిగిలింది. వారి మూడున్నరేళ్ల కుమార్తెపై సమీప బంధువు లైంగిక దాడిచేసి, కనీస జాలి కూడా లేకుండా హతమార్చి మురుగు కాలువలో పాతిపెట్టేశాడు. తిరుపతి జిల్లా వడమాలపేటలో ఈ దారుణం జరిగింది. వివరాలివీ.. కేవీబీ పురం మండలానికి చెందిన దంపతులు కూలి పనుల కోసం మూడున్నరేళ్ల కుమార్తె, ఏడాది వయసున్న బాబుతో నెల క్రితం వడమాలపేట మండలానికి వలస వచ్చారు. పిల్లలను అమ్మమ్మ వద్ద వదిలి దంపతులిద్దరూ పనులకు వెళ్లేవారు. పిల్లలకు మామ వరసైన సుశాంత్ (22) అప్పుడప్పుడూ వారింటికి వచ్చేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న పాపను చాక్లెట్లు కొనిస్తానంటూ పాఠశాల వెనుక నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లిన సుశాంత్ అత్యాచారానికి పాల్పడడమే కాకుండా హతమార్చి మురుగు కాలువలో పాతిపెట్టాడు. చిన్నారి కన్పించకపోయేసరికి ఆమె తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనుమానంతో సుశాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.10లక్షల పరిహారం ప్రకటించారు. హోంమంత్రి అనిత ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబాన్ని ఆదివారం ఆమె పరామర్శించనున్నారు. ఘటనపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బాలికపై అత్యాచారం!

'ఇన్‌స్టాగ్రామ్'లో యువకుడితో ప్రేమ

- తిరుపతిలోని లాడ్జిలో 9రోజులుగా మకాం
- 'తూర్పు' యువకుడిపై పోక్సో కేసు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఒక లాడ్జిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాంకిశోర్ కథనం మేరకు.. రేణిగుంట మండలానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ కుమార్తె తిరుపతిలో 9వ తరగతి చదువుతోంది. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన సతీష్ చెన్నైలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీర్దిదరికీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమకు దారితీసింది. ఈ నేపథ్యంలో సతీష్ 9రోజుల క్రితం తిరుపతికి వచ్చాడు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ లాడ్జిలో బాలికతో కలసి మకాం వేశాడు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా తమ కుమార్తె కనిపించడంలేదని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో సీఐ రాంకిశోర్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం వారిద్దరూ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి బాలిక తల్లిదండ్రులతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపేశారు. అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు, ముగ్గురు మహిళలు దుర్మరణం



ముల్లా బీబీ, కురువ వీరనాగమ్మ, కురువ గౌరమ్మ

ఎమ్మిగనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నందవరం మండలం మంత్రాలయం 167 హైవేపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృత్యువాత పడ్డారు. మంత్రాలయం పట్టణానికి చెందిన ముల్లా గనిబాషా, భార్య ముల్లా బీబీ, పిల్లలతో కలిసి దైవదర్శనం నిమిత్తం ఆదోని సమీపంలో ఉన్న సుల్తానాపురం గ్రామానికి సొంత ఆటోలో బయల్దేరి వెళ్లారు. అక్కడ శుక్రవారం రాత్రి నిద్రచేసి శనివారం తెల్లవారుజామునే తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. అదే విధంగా నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన వీరనాగమ్మ, గౌరమ్మ నందవరంలో ఉన్న భీరప్పస్వామి ఆలయంలో అమావాస్య రోజు నిద్రచేసి స్వగ్రామానికి బయల్దేరారు. నందవరం నుంచి ఆటోలో ముగతి గ్రామం వరకు వచ్చారు. హాలహర్వి వెళ్లేందుకు ముల్లాగని బాషా ఆటో ఎక్కారు. ధర్మాపురం టోల్ ప్లాజా సమీపానికి చేరుకోగానే బెంగళూరు నుంచి మంత్రాలయానికి వస్తున్న కారు ఆటోను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వీరనాగమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందగా, ముల్లా బీబీ(32), గౌరమ్మ(60) ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ప్రమాదంలో గాయాలపాలైన ముల్లానబి, చిన్నారులు ఖాజావలి, నజియాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. కాగా కారులో ప్రయాణిస్తున్న బెంగళూరు వాసులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

మరీ ఇంత నీచమా?

దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబం బజారున పడింది. నిన్నటి దాకా వివేకానంద రెడ్డి హత్య నేపథ్యంలో కుటుంబంలో గొడవలు ఏర్పడగా, ఇప్పుడు ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పదహారు మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరిలో కాసు బ్రహ్మానంద రెడ్డికి మినహా మిగతా అందరికీ పిల్లలు ఉన్నారు. చాలా మంది ముఖ్యమంత్రుల పిల్లలు ఎవరో, ఇప్పుడేం చేస్తున్నారో, ఎక్కడ ఉంటున్నారో కూడా చాలా మందికి తెలియదు. మాజీ ముఖ్యమంత్రుల పిల్లల్లో ఒక్క జగన్మోహన్‌రెడ్డి మాత్రమే రాజశేఖర రెడ్డి వారసత్వంతో ముఖ్యమంత్రి కాగలిగారు. అదే సమయంలో రాజశేఖర రెడ్డి కుటుంబంలో మరే ఇతర మాజీ ముఖ్యమంత్రుల ఇళ్లలో జరగని విధంగా గొడవలు కూడా తార స్థాయికి చేరాయి. అధికారంతో పాటు సంపద కూడా పోగవడంతో పంపకాల్లో వివాదం ఏర్పడింది. అటు అధికారంలోనూ, ఇటు సంపద పంపిణీలోనూ అన్న జగన్మోహన్‌రెడ్డి తనకు న్యాయం చేయలేదన్న ఆవేదనతో చెల్లి షర్మిల రాజకీయంగా వేరు కుంపటి పెట్టుకున్నారు.

> రాజశేఖర రెడ్డి మరణానికి సోనియాగాంధీ కారణమని కొంతకాలం, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కారణం అని మరికొంత కాలం ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధి పొందిన జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబును ఎంచుకున్నారు. చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని నిందించడానికి కూడా జగన్‌రెడ్డి వెనుకాడటం లేదు. రాజశేఖర రెడ్డి కుటుంబంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు దివంగత నేత ఆత్మబంధువులు, ఆయన అంటే పడి చచ్చేవారు తీవ్రంగా కలత చెందుతున్నారు. జగన్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పే సంఘటనలు ఇన్ని జరిగినా, జరుగుతున్నా మేధావులుగా, విశ్లేషకులుగా ప్రచారం చేసుకుంటున్న కొందరు ఇప్పటికీ అతనికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వింతగానే ఉంది. ఇలాంటి వారి వల్ల చంద్రబాబుకు ఎలాంటి నష్టం జరుగుతుందో తెలియదు గానీ, రాష్ట్రానికి మాత్రం కచ్చితంగా ఎంతో కొంత నష్టం జరిగి తీరుతుంది.

ఏ పార్టీని అంటిపెట్టుకొని రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారో ఆ పార్టీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని ఆగ్రహించి జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని ముఖ్యమంత్రి కాగా, చెల్లి షర్మిల తన తండ్రి నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకే రాష్ట్ర అధ్యక్షురాలిగా ఇప్పుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ఉన్న ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. తాను ఆశించిన రాజ్యసభ పదవి లభించి ఉంటే అన్నతో షర్మిల విభేదించి ఉండేవారు కాదు. వైసీపీలో తన పాత్ర లేకుండా పోవడానికి వదిన భారతి కారణం అన్నది షర్మిల భావన! అదే సమయంలో రాజశేఖర రెడ్డి సొంత తమ్ముడైన వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాశ్ రెడ్డికి జగన్ దంపతులు వత్తాసు పలకడం కూడా రాజశేఖర రెడ్డి కుటుంబంలో విభేదాలు భగ్గుమనడానికి ప్రధాన కారణమైంది. ఇప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం కూడా వచ్చిపడింది. దీంతో రాజశేఖర రెడ్డి భార్య శ్రీమతి విజయలక్ష్మి నోరు విప్పాల్సి వచ్చింది. కుటుంబ ఆస్తులలో జగన్, షర్మిలకు సమాన హక్కు ఉందని, అలా ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆజ్ఞ అని ఆమె బహిరంగ లేఖ ద్వారా తేల్చి చెప్పారు. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. అయితే విజయలక్ష్మి చెప్పిన విషయాలతో జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న వారు విభేదిస్తున్నారు. సోషల్ మీడియాలో పలువురు పోస్టులు, వీడియోల రూపంలో జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఆస్తుల్లో వాటా ఉన్న మాట నిజమైతే షర్మిలపై కేసులు ఎందుకు లేవు? ఉమ్మడి ఆస్తులైతే ఎంఓయూ అవసరం ఏమిటి? వంటి ప్రశ్నలను లేవనెత్తడంతో పాటు షర్మిలను విలన్‌గా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో చిత్తుగా ఓడిన తర్వాత కూడా జగన్‌రెడ్డికి మద్దతుగా సోషల్ మీడియాలో అంతమంది నిలబడడం ఆశ్చర్యంగా ఉంది. దీన్నిబట్టి వారందరినీ జగన్‌రెడ్డి బాగా సంతృప్తిపరుస్తున్నట్టు భావించాలి. రాజశేఖర రెడ్డి భార్యగా, కుటుంబ పెద్దగా విజయలక్ష్మి చెప్పిన అంశాలతో కూడా జగన్ మద్దతుదారులు విభేదించడం ఆశ్చర్యం కలిగించింది. అప్పట్లో ఏమి జరిగిందో చెప్పగలిగే అర్హత విజయలక్ష్మికి కాక మరెవరికి ఉంటుంది? రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు, తర్వాతా ఏం జరిగిందో ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుంది? అయినా విజయలక్ష్మి చెబుతున్న దాంట్లో వాస్తవం లేనట్టుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? అవి అక్రమ ఆస్తులా? సక్రమ ఆస్తులా? అన్న అంశాలు మరుగున పడిపోయాయి. అన్న, చెల్లెలు ఏ ఆస్తుల కోసం గొడవ పడుతున్నారో ఆ ఆస్తులన్నీ అక్రమ సంపాదన అంటూ సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసి జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా చార్జిషీట్లు కూడా దాఖలు చేశాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే క్విడ్ ప్రో కో అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్‌రెడ్డి అంతులేని సంపదను పోగేసుకున్నారని, పలు కంపెనీలు ఏర్పాటు చేశారని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇందులో నిజం ఉందా? లేదా? అన్నది న్యాయస్థానంలో తేలాల్సి ఉంది. వ్యవస్థలను, వ్యక్తులను ప్రభావితం చేస్తుండటం వల్ల సదరు కేసులు విచారణకు నోచుకోకుండా మూలుగుతున్నాయి. జగన్‌రెడ్డి నిజంగానే అనితర సాధ్యమైన తెలివితేటలతో సదరు ఆస్తులను సమకూర్చుకొని ఉంటే విచారణలో జాప్యం జరగకుండా సహకరించి తాను నిర్దోషినని రుజువు చేసుకుంటే ఏ గొడవా ఉండదు. అలా జరగడం లేదంటేనే అనుమానాలు బలపడుతున్నాయి. వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో కూడా ఇదే జరుగుతోంది. ఈ కేసు విచారణ జరిగే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదని హైకోర్టు న్యాయమూర్తి స్వయంగా వ్యాఖ్యానించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అక్రమాస్తులో, సక్రమాస్తులో నిర్ధారణ కాని ఆస్తుల పంపకాలపై అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు రాజుకున్నాయి. ఆస్తి పంపకాలలో కూతురికి అన్యాయం జరగడాన్ని జీర్ణించుకోలేని విజయలక్ష్మి నోరు విప్పారు.

అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా..

ఇప్పుడు విజయలక్ష్మి లేఖలోని అంశాల విషయానికి వద్దాం. ఆస్తులు ఎలా పంచుకోవాలో రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారని విజయలక్ష్మి చెబుతున్నందున అలా ఎలా? అని అడిగే అర్హత ఇతరులకు, ముఖ్యంగా జగన్ మద్దతుదారులకు ఉండదు. షర్మిల వాదనలో పస లేదని రాజశేఖర రెడ్డి తోడల్లుడైన వైవీ సుబ్బారెడ్డి, అప్పటి ఆడిటర్, అవినీతి కేసుల్లో ఏ–2గా ఉన్న విజయసాయి రెడ్డితో జగన్‌రెడ్డి చెప్పించడంతో విజయలక్ష్మి రంగప్రవేశం చేశారు. ఇదీ నిజం అంటూ బహిరంగ లేఖ రాశారు. అయినా సోషల్ మీడియాలో జగన్ మద్దతుదారులు విజయలక్ష్మిపై కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారి పిల్లలు ఎవరూ కూడా ఇలా ఆస్తుల కోసం కొట్టుకోలేదన్న విషయాన్ని జగన్ మద్దతుదారులు విస్మరిస్తున్నారు. విజయలక్ష్మి లేఖ తర్వాత ఆస్తుల్లో షర్మిలకు సమాన హక్కు ఉన్న పక్షంలో ఎంఓయూ రాసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని వైసీపీ నాయకులు కూడా ప్రశ్నిస్తున్నారు. మామూలుగా అయితే ఇందులో లాజిక్ ఉంది. ఎంఓయూ అవసరం ఏమిటో తెలియాలంటే రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఏమనుకున్నారో, ఏం జరిగిందో తెలుసుకోవాలి. ముందుగా విజయలక్ష్మి తన లేఖలో పేర్కొన్న విషయాలు నిజం కాని పక్షంలో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి వాటిని ఎందుకు ఖండించలేదో చెప్పాలి. ఎందుకంటే విజయలక్ష్మి చెప్పినవన్నీ అక్షర సత్యాలని ఆ ఇద్దరికీ తెలుసు. అందుకే వారు అబద్ధాలు చెప్పారని విజయలక్ష్మి అన్నప్పటికీ నోరు మెదపడంలేదు. షర్మిలకు వ్యతిరేకంగా, జగన్‌కు అనుకూలంగా వైవీ సుబ్బారెడ్డి విలేఖరుల సమావేశం పెట్టిన తర్వాత.. ఆయన కుమారుడు విజయలక్ష్మి వద్దకు వెళ్లి 'మా నాన్నను అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా. జగన్ వద్ద మేం జీతగాళ్లం మాత్రమే. మమ్మల్ని అర్థం చేసుకోండి' అని చెప్పుకొన్నారు. ఇది నిజమో కాదో జగన్ మద్దతుదారులు తెలుసుకోవాలి. దీన్నిబట్టి ఎవరు చెబుతున్నది నిజమో? ఎవరి పక్షాన ధర్మం ఉందో? ఎవరు న్యాయం చేయాలనుకుంటున్నారో? ఎవరు అన్యాయం చేస్తున్నారో స్పష్టమవుతుంది.

సాయీ.. బిడ్డకు అన్యాయం జరగొద్దు!

రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం ఎందుకు జరగలేదన్నది ఇప్పుడు కీలకం. వాస్తవానికి 2004కు ముందు రాజశేఖర రెడ్డికి ఉన్న ఆస్తులను జగన్, షర్మిల మధ్య పంచారు. తంటా అంతా 2004లో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సమకూరిన ఆస్తుల విషయంలోనే. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నెలకొల్పిన కంపెనీలు, సమకూర్చుకున్న ఆస్తులు జగన్‌రెడ్డి పేరు మీదనే ఎందుకున్నాయో ఆడిటర్‌గా ఉన్న విజయసాయి రెడ్డికి తెలుసు. ఒక దశలో విజయసాయి రెడ్డిని రాజశేఖర రెడ్డి పిలిపించుకొని 'సాయీ.. ఆస్తులు, కంపెనీలు అన్నీ జగన్‌రెడ్డి పేరు మీదనే ఎందుకు ఏర్పాటు చేస్తున్నావు? మా షర్మిల పరిస్థితి ఏమిటి? ఆమెకు కూడా సమానంగా వాటా ఉండాలి. నా భార్య విజయలక్ష్మి పేరిట ఆస్తులు ఏమీ వద్దు' అని ఆయన స్పష్టంచేశారు. దీనికి విజయసాయి రెడ్డి బదులిస్తూ 'ఇప్పుడు ఆస్తులు, కంపెనీలు షర్మిల పేరు మీదకు బదిలీ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. మొత్తం ఆస్తులు జగన్ పేరిట ఉన్నప్పటికీ అన్న జగన్ తన చెల్లి షర్మిలకు గిఫ్ట్‌గా ఎప్పుడైనా ఇవ్వవచ్చు' అని చెప్పడంతో 'అదేదో జాగ్రత్తగా చూడు. నా బిడ్డకు అన్యాయం జరగకూడదు' అని రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారు. ఇది నిజమో కాదో విజయసాయి రెడ్డి, జగన్‌రెడ్డి చెప్పాలి. ఈ నేపథ్యంలోనే ఆస్తుల్లో పిల్లలు ఇద్దరికీ సమాన హక్కు ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆజ్ఞ అని విజయలక్ష్మి తన లేఖలో స్పష్టంచేశారు. మనవళ్లు, మనవరాళ్లకు కూడా ఆస్తుల్లో సమాన హక్కు ఉండాలని రాజశేఖర రెడ్డి భావించేవారు. 2019లో అధికారంలోకి వచ్చే వరకు తల్లీ చెల్లితో జగన్‌రెడ్డి సఖ్యతగానే ఉన్నారు. ఆస్తుల పంపకాల ప్రస్తావన తేలేదు. ముఖ్యమంత్రి కాగానే ఆస్తులు పంచుకుందాం అన్న ప్రతిపాదన జగన్‌రెడ్డి తెర మీదకు తెచ్చారు. సదరు ఆస్తుల్లో షర్మిలకు వాటా లేని పక్షంలో పంపకాల ప్రస్తావనను జగన్ ఎందుకు తెచ్చారో, ఎంఓయూ ఎందుకు రాశారో చెప్పాలి కదా! రాజశేఖర రెడ్డి ఆజ్ఞ మేరకు షర్మిలకు సమాన హక్కు ఉన్నప్పటికీ ఆస్తుల్లో 40 శాతం మాత్రమే ఇస్తానని జగన్ ఎందుకు అడ్డం తిరిగారు? ఆస్తులను 55:45 శాతం నిష్పత్తిలోనైనా పంచమని విజయలక్ష్మి ప్రతిపాదించినా జగన్‌రెడ్డి అంగీకరించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 40 శాతం వాటాకే షర్మిల అంగీకరించాల్సి వచ్చింది. అప్పట్లో ఆ కుటుంబంలో ఏం జరిగిందో తెలుసుకొనే ప్రయత్నం చేయకుండానే పేటీయం బ్యాచ్‌తో పాటు జగన్‌రెడ్డి మద్దతుదారులుగా ఉంటున్న ఉన్మాద మూక విజయలక్ష్మి, షర్మిలను సోషల్ మీడియాలో బండ బూతులు తిడుతున్నారు. జగన్‌రెడ్డి అతి మంచితనం వల్ల ఈ సమస్య వచ్చిందని విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వారు చెప్పడం వినడానికి కూడా రోతగా ఉంది.

ఆ రెంటిపైనే ప్రేమ!

జగన్‌రెడ్డికి నిజంగానే అంత వ్యాపార దక్షత ఉండి ఉంటే 2004కు ముందు కొత్త కంపెనీలు ఎందుకు ప్రారంభించలేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి కదా! ఇబ్బడిముబ్బడిగా కంపెనీలు ఏర్పాటు కావడం, వాటిల్లోకి ఎవరెవరో పెట్టుబడులు పెట్టడం వెనుక చిదంబర రహస్యం చిత్రగుప్తుడు విజయసాయి రెడ్డికి తెలియదా? ఆస్తుల్లో వాటా ఉండి ఉంటే షర్మిలపై కేసులు ఎందుకు లేవో చెప్పాలి? అని ప్రశ్నిస్తున్న వారికి విజయసాయి రెడ్డే సమాధానం చెప్పగలరు. రాజశేఖర రెడ్డి కోరుకున్నట్టు సగం ఆస్తులను షర్మిల పేరిట విజయసాయి రెడ్డి ఏర్పాటు చేసి ఉంటే ఆమెపై కూడా కేసులు పెట్టి ఉండేవారు. జగన్‌రెడ్డి నిజంగా అంత మంచివాడైతే తుచ్ఛమైన ఆస్తుల కోసం రక్తం పంచుకుపుట్టిన చెల్లితో గొడవలకు దిగుతారా? సొంత తల్లి పైనే కోర్టుకు ఎక్కుతారా? కనీస వాస్తవాలు తెలుసుకోకుండా జగన్‌రెడ్డికి మద్దతుగా మాట్లాడిన వారు ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారు? సొంత తల్లి, చెల్లికి వ్యతిరేకంగా రోత మీడియాలో అడ్డమైన రాతలు రాయిస్తున్న జగన్‌రెడ్డి మంచివాడా? తన భార్యను కూడా బజారుకు ఈడుస్తారని తెలిస్తే రాజశేఖర రెడ్డి రోత మీడియా ఏర్పాటుకు అంగీకరించి ఉండేవారు కారు. జగన్‌రెడ్డికి రెండు విషయాల మీదనే ప్రేమ ఉంటోంది. ఒకటి అధికారం, రెండవది సంపద. ఇప్పుడు భార్య భారతి మీద కూడా అపరిమితమైన అనురాగం ఏర్పడింది. తల్లీ చెల్లి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న జగన్‌రెడ్డిలో అతి మంచితనం ఉందంటే నమ్మేవారు ఉంటారా? ఉంటారులెండి.. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒక వర్గం ప్రజలను విచక్షణతో ఆలోచించలేని స్థితికి తీసుకువెళ్లిన ఘనత జగన్‌రెడ్డి సొంతం. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయనకు కుడి భుజంగా మెలిగిన వారందరూ ఇప్పుడు జగన్‌రెడ్డితో ఎందుకు లేరు? అని ఆలోచించగలిగే శక్తి వారికి లేకుండా చేశారు. జగన్మాయతో రాష్ట్రంలో కొత్తగా ఉన్మాద మూక పుట్టుకొచ్చింది. పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నప్పుడల్లా తండ్రి రాజశేఖర రెడ్డి అవసరాన్ని జగన్‌రెడ్డి గుర్తిస్తారు. అందుకే తాజా ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజశేఖర రెడ్డి బొమ్మను వాడుతున్నారు. తన బిడ్డ జగన్‌ను ఆశీర్వదించమంటూ గతంలో విజయలక్ష్మి విడుదల చేసిన వీడియోలను తాజాగా సోషల్ మీడియాలో వదులుతున్నారు. రాజకీయంగా ఉపయోగపడినంత వరకే తల్లీ, తండ్రీ, చెల్లీ ఎవరైనా జగన్‌కు గుర్తుకువస్తారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిన తర్వాత కూడా జగన్‌రెడ్డి వైఖరిలో మార్పు రాకపోవడం పట్ల కొందరు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

> సంపద కోసం రక్తసంబంధాలను తెగదెంపులు చేసుకోవడానికి కూడా వెనుకాడని జగన్‌రెడ్డి ప్రజా జీవితంలో కొనసాగడానికి అర్హుడా? తల్లీ చెల్లిని కూడా ఆస్తుల కోసం వదులుకున్న జగన్‌కు ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఉంటుందా?



> 2019లో అధికారంలోకి వచ్చే వరకు తల్లీ చెల్లితో జగన్‌రెడ్డి సఖ్యతగానే ఉన్నారు. ఆస్తుల పంపకాల ప్రస్తావన తేలేదు. ముఖ్యమంత్రి కాగానే ఆస్తులు పంచుకుందాం అన్న ప్రతిపాదన జగన్‌రెడ్డి తెర మీదకు తెచ్చారు. సదరు ఆస్తుల్లో షర్మిలకు వాటా లేని పక్షంలో పంపకాల ప్రస్తావనను జగన్ ఎందుకు తెచ్చారో, ఎంఓయూ ఎందుకు రాశారో చెప్పాలి కదా! రాజశేఖర రెడ్డి ఆజ్ఞ మేరకు షర్మిలకు సమాన హక్కు ఉన్నప్పటికీ ఆస్తుల్లో 40 శాతం మాత్రమే ఇస్తానని జగన్ ఎందుకు అడ్డం తిరిగారు? ఆస్తులను 55:45 శాతం నిష్పత్తిలోనైనా పంచమని విజయలక్ష్మి ప్రతిపాదించినా జగన్‌రెడ్డి అంగీకరించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 40 శాతం వాటాకే షర్మిల అంగీకరించాల్సి వచ్చింది. అప్పట్లో ఆ కుటుంబంలో ఏం జరిగిందో తెలుసుకొనే ప్రయత్నం చేయకుండానే పేటీయం బ్యాచ్‌తో పాటు జగన్‌రెడ్డి మద్దతుదారులుగా ఉంటున్న ఉన్మాద మూక విజయలక్ష్మి, షర్మిలను సోషల్ మీడియాలో బండ బూతులు తిడుతున్నారు. జగన్‌రెడ్డి అతి మంచితనం వల్ల ఈ సమస్య వచ్చిందని విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వారు చెప్పడం వినడానికి కూడా రోతగా ఉంది.

అదీ వైఎస్ స్థాయి.. మరి జగనెక్కడ?

జగన్ మనస్తత్వాన్ని విశ్లేషిస్తే ఆయన ఎలాంటి వారో తెలుస్తుంది. అలాంటి లక్షణాలు ఉన్న వారెవరూ మారరు. ఈ కారణంగానే కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కూడా గడవక ముందే ఉన్మాద మూకను ఉసిగొల్పారు. తుచ్ఛమైన ఆస్తుల కోసం తల్లీ చెల్లీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న జగన్‌రెడ్డి, ఆయన మద్దతుదారుల విషయంలో ప్రజలే అప్రమత్తంగా ఉండాలి. రాజశేఖర రెడ్డి మీద అభిమానంతో ఇంకా ఎవరైనా జగన్‌రెడ్డిని అభిమానిస్తుంటే వారికంటే అమాయకులు ఎవరూ ఉండరు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటనను ఇక్కడ గుర్తుచేసుకుందాం. రాజకీయంగా అండగా ఉన్న మరో పార్టీకి చెందిన నాయకుడికి ఇంత డబ్బు పంపు అని రాజశేఖర రెడ్డి తన ఆత్మబంధువు కేవీపీకి సూచించారు. ఆ మొత్తం ఎంతో విని కేవీపీ రామచంద్రరావు అంతెందుకు అని ప్రశ్నించగా 'మనమేమైనా మట్టి పని చేసి సంపాదించామా? అధికారంలో ఉన్నందుకు డబ్బు వచ్చి పడుతోంది. చెప్పినట్టు చెయ్యి' అని స్పష్టంచేశారు. మరో సందర్భంలో ఒకాయన తన కుమార్తె వివాహ పత్రికను అందించడానికి రాజశేఖర రెడ్డిని కలిశారు. శుభలేఖ అందించి బయటకు వచ్చిన కొద్దిసేపటికి ఆయనను కేవీపీ కలిసి 'మీ అమ్మాయి అయినా మా అమ్మాయి అయినా ఒకటే. పెళ్లి ఘనంగా జరిపించడానికి ఎంత కావాలో చెప్పండి' అని రాజశేఖర రెడ్డి తరఫున అడిగారు. దీనికి ఆయన ఉబ్బితబ్బిబ్బైనప్పటికీ మృదువుగా తిరస్కరించారు. అలాంటి రాజశేఖర రెడ్డి ఎక్కడ? ఆస్తుల కోసం తల్లీ చెల్లీ అని కూడా చూడకుండా వారిని బూతులు తిట్టిస్తున్న జగన్‌రెడ్డి ఎక్కడ? తమాషా ఏమిటంటే తమ కుటుంబంలో ఆస్తుల వివాదం ఏర్పడటానికి చంద్రబాబు కారణమని జగన్ అండ్ కో తాజాగా ప్రచారం చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి మరణానికి కారణమైన చంద్రబాబుతో తల్లీ చెల్లీ చేతులు కలిపారని బురద చల్లిస్తున్నారు. చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు చేస్తారని విమర్శించేవారు ఉన్నారు కానీ హత్యా రాజకీయాలు చేస్తారని ఆయన ప్రత్యర్థులు కూడా చెప్పలేరు.

రాజశేఖర రెడ్డి మరణానికి సోనియాగాంధీ కారణమని కొంతకాలం, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కారణం అని మరికొంత కాలం ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధి పొందిన జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబును ఎంచుకున్నారు. చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని నిందించడానికి కూడా జగన్‌రెడ్డి వెనుకాడటం లేదు. రాజశేఖర రెడ్డి కుటుంబంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు దివంగత నేత ఆత్మబంధువులు, ఆయన అంటే పడి చచ్చేవారు తీవ్రంగా కలత చెందుతున్నారు. జగన్‌రెడ్డి నైజం తెలుసు కనుకే వారెప్పుడూ జగన్ అధికారంలో ఉండగా దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడలేదు. జగన్‌రెడ్డి ఎలాంటి వాడో తెలుసు కనుకే రాజశేఖర రెడ్డి కుటుంబంలో ఏర్పడిన విభేదాలలో మధ్యవర్తిత్వం నెరపడానికి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. అన్నం ఉడికిందో లేదో తెలియడానికి ఒక మెతుకు పట్టుకుని చూస్తే చాలు అని అంటారు. అలాంటిది జగన్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పే సంఘటనలు ఇన్ని జరిగినా, జరుగుతున్నా మేధావులుగా, విశ్లేషకులుగా ప్రచారం చేసుకుంటున్న కొందరు ఇప్పటికీ అతనికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వింతగానే ఉంది. ఇలాంటి వారి వల్ల చంద్రబాబుకు ఎలాంటి నష్టం జరుగుతుందో తెలియదు గానీ, రాష్ట్రానికి మాత్రం కచ్చితంగా ఎంతో కొంత నష్టం జరిగి తీరుతుంది. ప్రజా జీవితంలో ఉండే అర్హత లేని వ్యక్తులకు బాసటగా నిలవడం చరిత్రాత్మక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వంటి వారు ప్రజా జీవితంలో ఉండటానికి అర్హులా? అన్న విషయమై ఇప్పుడు చర్చ జరగాలి. విజయలక్ష్మి తన లేఖలో పేర్కొన్నట్టు అన్నా చెల్లెళ్ల మధ్య వివాదాలు సమసిపోయి సామరస్యం నెలకొనవచ్చు. అయితే ప్రస్తుతానికి రాజశేఖర రెడ్డి కుటుంబం పరువు బజారున పడింది. జగన్‌రెడ్డి ఎలాంటివారో తెలుసుకొనే అవకాశం ప్రజలకు మరో మారు వచ్చింది. అప్పనంగా వచ్చిపడిన ఆస్తుల కోసం జగన్‌రెడ్డి ఇంత దిగజారాలా? కుటుంబ సభ్యుల మధ్య ఇంత రాద్ధాంతం అవసరమా? అన్న అభిప్రాయం ప్రజల్లో బలపడకుండా ఉంటుందా? తన బెయిల్ రద్దు కావడం కోసం చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని దిక్కుమాలిన ప్రచారం చేసే బదులు తల్లి సమక్షంలో అంగీకరించి సంతకాలు చేసిన 40 శాతం ఆస్తులను సక్రమంగా పంపిణీ చేస్తే ఏ గొడవా ఉండదు కదా? బెంగళూరులోని యలహంక ఆస్తిని చెల్లికి ఇస్తున్నట్టు ఎంఓయూలో అంగీకరించిన జగన్‌రెడ్డి అక్కడ నిర్మితమైన ప్యాలెస్‌లో ఎందుకు ఉంటున్నారో చెప్పాలి. ఇదంతా నా కష్టార్జితం అని జగన్‌రెడ్డి భావిస్తే అది సక్రమమా? అక్రమమా? అన్నది ఇవాళ కాకపోయినా రేపైనా న్యాయస్థానాలు నిర్ణయించకపోవు. నిజానికి జగన్ అనుభవిస్తున్న ఆస్తులు ఆయన స్వార్జితం కావు. అవి ప్రజల సొత్తు. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఈ ఆస్తుల వివాదం చినికి చినికి గాలివానగా మారి అసలుకే మోసం తేవొచ్చు. అందుకే జగన్‌రెడ్డి ఇప్పటికైనా దురాశకు పోకుండా చెల్లి షర్మిలకు న్యాయం చేస్తే మంచిది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే రాజశేఖర రెడ్డి ఆత్మ కచ్చితంగా ఘోషిస్తుంది. ఆయన ఆత్మకు శాంతి కూడా లభించదు. జయంతి, వర్ధంతికి సమాధిని ఘనంగా అలంకరించి నివాళులు అర్పించడం కాదు.. రాజశేఖర రెడ్డి పరువు తీస్తున్నానన్న స్పృహతో జగన్‌రెడ్డి వ్యవహరించడం కుమారుడిగా ఆయన బాధ్యత. భౌతిక సంపదను పోయేటప్పుడు ఎవరూ తమతో తీసుకెళ్లరు. కొడుకు ప్రవర్తన చూసి రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మి తాను ఎందుకు జీవించి ఉన్నానా? అని చింతించే పరిస్థితి ఏర్పడకూడదని ఆశిద్దాం. అయితే తోటకూర దొంగిలించిన నాడే దండించి ఉంటే జగన్‌రెడ్డి ఇప్పుడు ఇలా తయారై ఉండేవారు కాదు. సంపద కోసం రక్తసంబంధాలను తెగదెంపులు చేసుకోవడానికి కూడా వెనుకాడని జగన్‌రెడ్డి ప్రజా జీవితంలో కొనసాగడానికి అర్హుడా? తల్లీ చెల్లిని కూడా ఆస్తుల కోసం వదులుకున్న జగన్‌కు ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఉంటుందా? ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ కఠోర సత్యాన్ని మరచిపోరని ఆశిద్దాం!

> రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. అయితే ఆమె చెప్పిన విషయాలతో జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న వారు విభేదిస్తున్నారు. ఆస్తుల్లో వాటా ఉన్న మాట నిజమైతే షర్మిలపై కేసులు ఎందుకు లేవు? ఉమ్మడి ఆస్తులైతే ఎంఓయూ అవసరం ఏమిటి? వంటి ప్రశ్నలను లేవనెత్తడంతో పాటు షర్మిలను విలన్‌గా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు, తర్వాతా ఏం జరిగిందో ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుంది? అయినా విజయలక్ష్మి చెబుతున్న దాంట్లో వాస్తవం లేనట్టుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? అవి అక్రమ ఆస్తులా? సక్రమ ఆస్తులా? అన్న అంశాలు మరుగున పడిపోయాయి.

అనంత తీరాలకు అపురూప కపోతం

> వర్షాకాలం 4 నెలలు మినహాయిస్తే ఏడాదికి ఎనిమిది నెలలు కంభంపాటి సీత, శ్రీనివాసరావు దంపతులు పిట్టల్ని వెతుకుతూ ప్రపంచమంతా తిరుగుతుంటారు. కవి వరవరరావు అన్నట్టు వీళ్లు జంట కపోతాలు. ఈ జంటలో ఒక కపోతం నాలుగు రోజుల క్రితం ఎగిరిపోయింది. ఎగిరిపోయిన కపోతం సీత. లెక్చరర్లుగా ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బులతో, ఆస్తులు కూడపెట్టాలన్న తాపత్రయం లేకుండా వీరు ప్రయాణాలు చేసారు. అబ్బురపరిచే జీవితం, అసూయ కలిగించే జీవితం ఈ జంట జీవించింది.

కంభంపాటి సీత అనే సీతగారి గురించి మాట్లాడకుండా శ్రీనివాసరావు గారి గురించి ఎట్లా మాట్లాడలేమో, శ్రీనివాసరావు గురించి మాట్లాడకుండా సీత గురించి కూడా అట్లాగే మాట్లాడలేము. ఈ జంటలో ఒకరి వయసు 84 మరొకరి వయసు 74. ఒకరు బోటనీ లెక్చరర్‌గా ఇంకొకరు జువాలజీ లెక్చరర్‌గా రిటైర్ అయ్యారు. ఇటువంటి రిటైర్ అయిన జంటలు కొన్ని ఇళ్లలో అయినా ఉంటూనే ఉన్నాయి. కానీ మనకు చాలా ఇళ్లలో కనిపించే జంటలకు ఈ జంటకు చాలా తేడా ఉంది. ఏ ఇతర పెద్దవాళ్లని కలిసినా వినిపించే మాటలేవీ వీళ్లు మాట్లాడరు. అసలు మాట్లాడటానికి వీళ్లు దొరకరు కూడా. వర్షాకాలం 4 నెలలు మినహాయిస్తే ఏడాదికి ఎనిమిది నెలలు వాళ్లు పిట్టల్ని వెతుకుతూ ప్రపంచమంతా తిరుగుతుంటారు. వరవరరావు గారు అన్నట్టు వీళ్లు జంట కపోతాలు. ఈ జంటలో ఒక కపోతం నాలుగు రోజుల క్రితం ఎగిరిపోయింది. ఎగిరిపోయిన కపోతం సీత గారు.

ఈ మధ్యలో కొంత మంది రిటైరయిన జంటలు పిల్లలు బాగా సెటిల్ అయి వాళ్లు ఏర్పాటు చేస్తే ఏడాదికి రెండో మూడో ఇలా ప్రయాణాలు చేస్తున్న వాళ్లని చూస్తున్నాం. కానీ వీళ్లు అలా కాదు. గత నలభై ఏళ్లుగా వాళ్లు ఇలా ప్రయాణాలు చేస్తున్నారు. ఆ ప్రయాణాలు తీర్థయాత్రలు కావు. ఆ ప్రయాణాల్లో వాళ్లు ఇప్పుడు కూడా చేసే పనులు చాలామంది 40ల్లో 50ల్లో ఉన్నవాళ్లు కూడా చెయ్యటానికి వెనకాడుతూ ఉంటారు. చెరో ఏడెనిమిది కిలోల బరువున్న కెమెరాలు వేసుకుని బ్యాక్ పాక్‌లో బిస్కట్ పాకెట్లు, మంచినీళ్లు వేసుకుని ఏ మంచు పర్వత సానువుల్లోనో, దట్టమైన కీకారణ్యాల్లోనో పెద్దగా టూరిస్టులు తిరగని ప్రాంతాల్లో గంటల తరబడి ఓపిగ్గా తిరుగుతూ అరుదైన పక్షుల ఫోటోలు తీస్తూ ఉంటారు. కావాలనుకున్న పిట్ట ఫోటో దొరికే దాకా ఒకే స్థలానికి ఎన్నిసార్లైనా వెళ్తూనే ఉంటారు.

ఒక్కసారైనా హిమాలయాలకు, సాహసికులైతే లేహ్ లడక్‌కు, భక్తులైతే వైష్ణోదేవి ఆలయానికి వెళ్లాలని అనుకుంటారు. అలాటి హిమాలయాలకు వాళ్లు కనీసం ముప్పైసార్లు వెళ్లారు. టూరిస్టులు వెళ్లని తోవలకు, ఆక్సిజన్ అందని మంచు కొండల మీదకు వాళ్లు ఎడతెగని ప్రయాణాలు చేసారు. ఒక గంట సేపు మామూలు కొండ ఎక్కటమే చాలామందికి కష్టం అందులోనూ సరైన దారి లేని చోట ట్రెక్కింగ్ అంటే ఇంకా కష్టం. కానీ వీళ్లు సరిగా ఆక్సిజన్ అందని మంచుకొండల్లో కూడా తమ డెబ్భై ఎనభైల్లో కూడా ఆరేసి, ఎనిమిదేసి గంటలు ట్రెక్కింగ్ చేస్తూ పోతుంటారు. ఎందుకలా అంటే మొదటిసారి వెళ్లివచ్చినప్పుడు అక్కడేదో పోగొట్టుకున్న ఫీలింగ్ వచ్చింది. అప్పటినుంచి అదేంటో తెలియకున్నా దాన్ని వెతుక్కుంటూ పోతున్నాం అంటారు సీత గల గలా నవ్వుతూ.

మంచు కొండల గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి అక్కడ సీత చేసిన ఒళ్లు గగుర్పొడిచే సాహసాల గురించి చెప్పాలి. ఒక ఉదయం లేచి హిమాలయాల్లో ఆరుగంటల ట్రెక్ చేసి వాళ్లు అనుకున్న ప్రదేశానికి చేరుకోగానే మంచు తుఫాన్ వచ్చింది. వాళ్లను నిలబెట్టి కొట్టిన తుఫాను వెలిసేసరికి చీకటయింది. వెళ్లే దారి కనపడని స్థితి. అప్పుడు వాళ్లకు దూరంగా కొండ కింద ఒక దీపం కనిపించింది. ఆ దీపం గుర్తుగా కొండల మీద నుంచి జారుతూ జారుతూ అక్కడికి చేరుకున్నారట. అది ఒక గొర్రెల కాపరి వేసుకున్న టెంట్. ఆ రాత్రి అక్కడ ఉండి ఉదయం బయలుదేరి తమ బస వైపు నడుస్తుంటే, మంచు తుఫాన్‌లో చిక్కుకుని కనపడకుండా పోయిన వ్యక్తుల శరీరాలను వెతికే బాడీ సెర్చ్ టీమ్‌తో బస యజమాని ఎదురుపడి వీళ్లను చూసి ఆశ్చర్యపోయారట. అప్పుడు వాళ్ల వయసు ఒకరికి 67 ఇంకొకరిది 77. ఇదే ఒక సాహసం అనుకుంటే అంతకు మించిన సాహసం సీతది.

కొండల్లోంచి జారటం వల్ల శరీరానికి తగిలిన దెబ్బలు నుంచి తేరుకోటానికి మిగిలిన ప్రోగ్రాం రద్దు చేసుకుని హోటల్లో కూర్చుని రికవర్ అవుతుండగా సీతని ఎదురుగా ఉన్న తీర్థన్ నది పిలవటం మొదలు పెట్టింది. సీత 65 ఏళ్ల వయసులో ఈత నేర్చుకున్నారు. నీళ్లు చూస్తే ఈత కొట్టెయ్యాలన్న ఉత్సాహం ఉండేదనుకుంటాను. తీర్థన్ నది ఈదితే ఎలా ఉంటుంది అంటే అక్కడ అందరూ ఆమెను వారించారు. అది మంచు కరిగి ప్రవహించే నది, నీళ్లు అతి చల్లన. నదిలో విపరీతంగా బండరాళ్లు. ఈ రెండు కారణాల వాళ్ల స్థానికులు కూడా నది ఈదే సాహసం చెయ్యరు. కానీ ఈవిడ వినకుండా ఇటునుంచి అటు మాత్రమే కాదు అటు నుంచి ఇటు కూడా ఈదారట. ఈ సాహసం గురించి విన్న ఆ ఊరివాళ్లు మాత్రమే కాదు, అక్కడికి వచ్చిన టూరిస్టులు కూడా నదికి రెండు వైపులా నిలబడి ఈ చోద్యం చూశారు. 65 ఏళ్ల వయసులో ఈత నేర్చుకున్న సీత అప్పటి నించి ఈత పోటీలకు వెళ్లటం మాత్రమే కాదు ఇప్పటికీ పాతికో ముప్పయ్యో పథకాలు కూడా గెలుచుకున్నారు. ఒక్కోసారి నాలుగో ఐదో గెలుచుకుని వాటిని మెడలో వేసుకుని చిన్న పిల్లలా సంతోషపడుతుంటారు.



ఇవన్నీ విని వాళ్లను చూస్తే ఈ పనులు చేస్తుంది వీళ్లేనా అనిపించకమానదు. ముఖ్యంగా సీత. మంచి నూలు చీరలు కట్టుకుని మొహం మీద చెరగని చిరునవ్వుతో చాలా హాయిగా, మెత్తగా ఉంటారు. మామూలుగా ట్రావెలర్స్ అని మనం అనుకుని ఊహించుకునే దానికి పూర్తి భిన్నంగా ఉంటారు ఇద్దరూ కూడా.

ఇవన్నీ ఎవరికి తెలియకుండా పోయే ఒక అపాయం తప్పింది సీత ట్రావెలాగ్‌ల వల్ల. వందల్లో ప్రయాణాలు చేసినా అప్పుడప్పుడూ వాటిలో కొన్ని మాత్రం సీత ట్రావెలాగ్‌లా రాసేవారు. వాటిని పుస్తకంగా వెయ్యాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఆ పనిలో భాగంగా వాళ్ల పరిచయం అయింది. ఆవిడ రాసిన ట్రావెలాగ్‌లు చదివి, అందులో రాయని అనేక విషయాలు విని నిర్ఘాంతపోయాను. చాలామంది ఊహించటానికి కూడా సాహసించని ఒక కలని వాళ్లు జీవించారు. ఆ ట్రావెలాగ్‌కు విశ్వ విహారం అని వారి చిరకాల కుటుంబ మిత్రులు వరవరరావు పేరుపెట్టారు. కానీ ఆ కథలు చదివితే అది ఉత్త విహారం కాదు సాహస విహారం అనిపించక మానదు. దానికి వాడుకలో ఉన్న అర్థంలో కాదు. ఆ వయసులో వాళ్లు చేసిన సాహసాల వల్ల.

దాంతో పాటుగా వాళ్లు తీసిన అరుదైన పక్షుల ఫోటోలతో వేసిన బర్డ్స్ బ్యూటిఫుల్ అనే పుస్తకం ప్రెస్ వర్క్ జరుగుతున్నప్పుడు చూసిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డి కూడా అలాగే నిర్ఘాంతపోయారు. ఇలాంటి ఫోటోలు తీసిన వీళ్లు ఇంతకాలం అజ్ఞాతంగా ఉండిపోయారా అని. ఆయన పూనుకుని అప్లై చేసిస్తే ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫిక్ కౌన్సిల్ గుర్తింపు వచ్చింది. ది రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ గుర్తింపు ఇంకా రావాల్సి ఉంది. ఆరు నెలల కింద 'సంచార సహచరులు' పేరుతో ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక కవర్ మీద ఎక్కారు. కెన్యా, టాంజానియాల మధ్య ప్రతి ఏడు జరిగే లక్షలాది జంతువుల గ్రేట్ మైగ్రేషన్ చూడటం కోసం, ఫోటోలు తియ్యటం కోసం మూడుసార్లు వెళ్లి వచ్చిన అనుభవాలు, ఫోటోలతో కాల్ ఆఫ్ ది వైల్డ్ పేరుతో ఒక పుస్తం వేశారు. ఈ మూడు పుస్తకాల వల్ల ఈ ఏడాదిగా కొందరికైనా వాళ్ల గురించి తెలుసుకునే అవకాశం దొరికింది.

చేతినిండా పుష్కలంగా డబ్బులు ఉండి వాళ్లు హాబీగా ఈ పని చెయ్యలేదు, లెక్చరర్లుగా ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బులతో, ఆస్తులు కూడపెట్టాలన్న తాపత్రయం లేకుండా ఈ ప్రయాణాలు చేసారు. అబ్బురపరిచే జీవితం, నాలాంటి కొంతమందికి అసూయ కూడా కలిగించే జీవితం ఈ జంట జీవించింది.

■ సి. వనజ

అదే ఆకాశం.. అదే ఆనందం.. లేలేత కిరణాల సుకుమారం.. సరికొత్త పచ్చదనాల సోయగం.. అనారోగ్య తిమిరాన్ని తరిమే ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణం.. ఇంతటి చక్కటి ప్లేస్‌లో సేదతీరడానికి ఎవరూ మనకు భూపాల రాగంతో వేకప్ కాల్ ఇవ్వనక్కర్లేదు. గుడ్‌మార్నింగ్ చెబుతూనే రంగురంగుల సీతాకోకచిలుకల అందాలను ఆస్వాదిస్తూ.. ఆ ప్రపంచంలో పొద్దునే జర్నీ స్టార్ట్ చేస్తే చాలు.. ఆ మజానే వేరు. చెవిలో ఈయర్ ఫోన్స్ పెట్టుకుని రిథమిక్‌గా పాటలు వింటూ.. పచ్చటి లాన్‌లో నడుస్తూ.. పుట్టగొడుగుల్లో సేదతీరుతూ.. రండి.. జీవన మకరందాన్నంతా ఇప్పుడే ఆస్వాదిద్దాం. ఎంతలా అంటే.. ప్రతిపొద్దూ కొత్తగా అనేంతలా.. అంటూ ఆహ్వానిస్తోంది మూలపాడులోని బటర్ ఫ్లై పార్క్. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాశనమైన ఈ పార్కు.. కూటమి ప్రభుత్వం రాకతో సరికొత్తగా ముస్తాబవుతోంది. అసలే కార్తీకమాసం.. వనసమారాధనల సమయం.. పార్కును మరింత అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశముంది.




కొత్తగా రెక్కలొచ్చెనా..

మూలపాడు బటర్ ఫ్లై పార్కుకు సరికొత్త సొబగులు

- ఆర్చిల నిర్మాణ పనులు ప్రారంభం
- బ్యాంబూ మేజ్ పార్క్‌కు సన్నాహాలు
- రెండు వారాల్లో సీతాకోకచిలుకల ఆగమనం
- ట్రెక్కర్లు, వాకర్లతో సందడి
- కార్తీకమాసాన మరింత అభివృద్ధి చేస్తే ప్రయోజనం

8



సండే స్పెషల్





నేడే గాజుల అలంకరణ

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణార్థం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి గాజుల అలంకరణ చేయనున్నారు. దీంతో ఆలయ పరిసరాలను అన్ని రకాల మట్టి గాజులతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కేఎస్ రామారావు తగు భద్రతా ఏర్పాట్లు చేయించారు. ఆదివారం భక్తుల రద్దీ, గాజుల అలంకరణ దృష్ట్యా వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



గుంతలరహితంగా తీర్చిదిద్దుతాం

ఆటోనగర్‌లో రోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె, ఇన్‌చార్జి కలెక్టర్ మీనా

8లో

కొండంత దోపిడీ

ప్రభుత్వం మారినా గ్రావెల్ దోపిడీ ఆగలేదు. మైలవరం మండలం వెదురుబీడెం, చంద్రాల గ్రామాల నుంచి నిత్యం 200కుపైగా లారీల గ్రావెల్ తరలిపోతోంది. 2 ఎకరాల్లో తవ్వకాలకు అనుమతి తీసుకుని సుమారు 5 ఎకరాల్లో 10 నుంచి 15 అడుగుల లోతున తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ దోపిడీలో సూత్రధారులంతా గత వైసీపీ ప్రభుత్వంలో దందా సాగించినవారే కావడం గమనార్హం.



వెదురుబీడెంలో గ్రావెల్ తవ్వకాలు

వెదురుబీడెం, చంద్రాలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు

- ఐప్యాక్ మాజీ ఉద్యోగికి రెండు ఎకరాలకు అనుమతి
- ఐదెకరాలకు మించి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు
- జత కలిసిన ఇద్దరు వైసీపీ నాయకులు
- లారీలన్నీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడివే..
- నిత్యం 200 లారీల తరలింపు.. రూ.కోట్లలో ఆర్జన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం వెదురుబీడెం, చంద్రాల గ్రామాల పరిధిలో 2 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ అనుమతి పొందిన వ్యక్తి వైసీపీకి చెందినవాడు. ఆ ప్రభుత్వంలో హవా నడిపించిన ఐప్యాక్ ఉద్యోగి. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తనకు గ్రావెల్ తవ్వకాలకు ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన సదరు వ్యక్తి ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యాడు. ఓ మైనారిటీ నాయకుడిని, వైసీపీ హయాంలో ఎమ్మెల్యే పీఏగా చక్రం తిప్పిన వ్యక్తిని కలుపుకొని గ్రావెల్ తవ్వకాలకు మార్గం సుగమం చేసుకున్నాడు. నిత్యం 200 లారీల గ్రావెల్‌ను తవ్వి నూజివీడు, విజయవాడ, గుంటూరుకు తరలిస్తున్నాడు. ఈ తరలింపులోని వారంతా వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పినవారేనని స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రావెల్‌ను దోచుకున్నది చాలక ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారంటూ టీడీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. తమకూ గ్రావెల్ తోలుకునేందుకు అనుమతులు ఉన్నాయని, కానీ వైసీపీ నుంచి వచ్చిన వారికే గ్రీన్ కార్పెట్ పరుస్తూ, తమ లారీలను అడ్డుకోవడం ఏమిటని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై కొద్దిరోజుల క్రితం మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగులకుపైగా గ్రావెల్ తవ్వేస్తున్నా మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లలో దోపిడీ

గత ఐదేళ్లలో మైలవరం నియోజకవర్గంలో రూ.వందల కోట్లలో గ్రావెల్ దోపిడీ జరిగింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని అప్పట్లో టీడీపీ నాయకుడు దేవినేని ఉమా పలుమార్లు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైలవరం గ్రావెల్ దోపిడీపై సమగ్ర మిగతా 8లో..

లారీలు వంశీ అనుచరుడివి..

గ్రావెల్ తరలించే లారీలన్నీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడివని మైలవరం టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని వారు కొద్దిరోజుల క్రితం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఫోన్‌చేసి వంశీ అనుచరుడి లారీలను గ్రావెల్ తోలేందుకు అనుమతించవద్దని కోరినట్లు సమాచారం. అయినా నేటికీ అదే వ్యక్తి లారీల్లో గ్రావెల్ తరలిపోతూనే ఉంది.

ఫేక్‌బుక్

ఎఫ్‌బీ అకౌంట్ ఒకరిది.. వాడకం మరొకరిది..

- చనిపోయిన వారి అకౌంట్లతో ఈ-నేరాలు
- మ్యాట్రిమోనిలో యువతులకు ఎర
- రూ.లక్షలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు
- నగరంలో వెలుగుచూస్తున్న ఘటనలు

● నగరానికి చెందిన ఓ యువతి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిణి. తల్లిదండ్రులు చూసిన యువకుడిని వివాహం చేసుకుంది. తర్వాత ఆ బంధం బ్రేకప్ అయింది. మరో వివాహం చేసుకోవడానికి ఆ యువతి తన ప్రొఫైల్‌ను మ్యాట్రిమోనిలో అప్‌లోడ్ చేసింది. ఓ వ్యక్తి ఆమెకు టచ్‌లోకి వెళ్లాడు. కొద్దిరోజుల పరిచయంలో అతడు చాలా మంచివాడన్న అభిప్రాయానికి వచ్చింది. పెళ్లి చేసుకున్నాక అమెరికా వెళ్లి స్థిరపడాలనుకుంది. వీసా, పాస్‌పోర్టు కోసం అతడి అకౌంట్‌లో రూ.1.70 లక్షలు జమ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు గుర్తించి ఆ యువతిని అప్రమత్తం చేసినా ఆమె నమ్మలేదు. తర్వాత విజయవాడ సైబర్ క్రైం పోలీసులు అతడిని గోవాలో అరెస్టు చేశారు. ఫేస్‌బుక్ ద్వారా ఈ యువతిని పరిచయం చేసుకున్నట్టు గుర్తించారు. ఇంతకీ ఆ ఫేస్‌బుక్ అకౌంట్ కలిగిన వ్యక్తి చనిపోయాడు. ఆ ఎఫ్‌బీ అకౌంట్‌ను అతడు ఉపయోగించి యువతులకు ఎరవేసి డబ్బు లాగేశాడు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దోచుకోవడమే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు ఎత్తులు వేస్తున్నారు. మారుపేర్లతో సిమ్‌కార్డులు తీసుకోవడం, ఇతరుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేయించుకోవడం ఒక ఎత్తయితే, చనిపోయిన వారి ఫేస్‌బుక్ అకౌంట్లతో యువతులకు మిగతా 8లో..

అమరావతి ఐఆర్‌ఆర్‌లో మరో ముందడుగు

భూ సేకరణకు అత్యున్నత విధానాన్ని అనుసరించాలని సీఆర్‌డీఏ నిర్ణయం

- కన్సల్టెన్సీని నియమించుకునేందుకు టెండర్లు ఆహ్వానం
- భూ యజమానులకు మేలుచేసే అవకాశాలు పరిశీలన
- ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల్లో 41 గ్రామాల మీదుగా రింగ్‌రోడ్డు
- మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మాణం



ఇన్నర్ రింగ్‌రోడ్డు శాటిలైట్ మ్యాప్

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్‌ఆర్) నిర్మాణంలో సీఆర్‌డీఏ స్పీడ్ పెంచింది. ఇన్నర్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూముల సేకరణకు అత్యుత్తమ పద్ధతిని సూచించేందుకు కన్సల్టెన్సీని నియమించాలని నిర్ణయించింది. దీనికోసం శనివారం టెండర్లు పిలిచింది. ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ఇటీవల అదానీ సంస్థ ముందుకొచ్చిన నేపథ్యంలో సీఆర్‌డీఏ మరో ముందడుగు వేసింది. ఐఆర్‌ఆర్ ఫైనల్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఈ ప్రాజెక్టు కోసం తీసుకోవాల్సి ఉంటుంది. భూములను సేకరించటానికి ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై కన్సల్టెన్సీ తగిన ప్రతిపాదనలు సూచించాల్సి ఉంటుంది. భూములను తీసుకోవటానికి భూ సేకరణ విధానం ఉన్నప్పటికీ.. ఇంకా అత్యుత్తమ ప్రతిపాదన ఏమైనా ఉంటే.. అది ఆమోదయోగ్యంగా అనిపిస్తే దానిని అమలు చేసే అవకాశముంది. భూములిచ్చిన వారికి కూడా ప్రయోజనకరంగా ఉండాలన్నది సీఆర్‌డీఏ భావన. ఈ ప్రాజెక్టుకు సహకరించిన భూ యజమానులకు కూడా మేలు జరిగే అవకాశాలను పరిశీలిస్తోంది. అందుకే భిన్న విధానాలతో కూడిన సలహాలు, సూచనలు, ప్రత్యామ్నాయాల కోసం కన్సల్టెన్సీ సంస్థను నియమించాలనుకుంటోంది. ఈనెల 18వ తేదీ లోపు బిడ్లను సమర్పించాలని సీఆర్‌డీఏ అధికారులు టెండరులో పేర్కొన్నారు. బిడ్ దక్కించుకున్నాక నెల రోజుల్లో నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. కన్సల్టెన్సీ నివేదిక వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని..

అమరావతిని రాజధానిగా ప్రకటించాక రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇన్నర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. రాజధానికి ప్రాంతీయ రోడ్లు అనుసంధానమయ్యేలా ఐఆర్‌ఆర్ నిర్మించడం మొదటి అంశం కాగా, విజయవాడ నగరానికి ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం రెండో అంశం. రాజధాని ప్రాంత పరిధిలోని మేజర్ రోడ్లన్నింటినీ అనుసంధానం చేయటం మూడో అంశం. అమరావతి, విజయవాడ చుట్టుపక్కల అర్బన్ ప్రాంతాల అనుసంధానం నాల్గోది. మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున 75 మీటర్ల వెడల్పుతో ఈ ఐఆర్‌ఆర్ సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించటం జరిగింది. అప్పట్లో ఐఆర్‌ఆర్‌ను ఫేజ్-1లో 67.57 కిలోమీటర్లు, ఫేజ్-2లో 26.68 కిలోమీటర్లు పనులు చేపట్టాలని భావించారు. ఫేజ్-1లో కేతనకొండ దగ్గర ఎన్‌హెచ్-65కు, నున్న దగ్గర విజయవాడ పశ్చిమ బైపాస్‌కు ఐఆర్‌ఆర్ అనుసంధానం అవుతుంది. ఫేజ్-2లో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా 9 కిలోమీటర్ల మేర టన్నెల్‌ను నిర్మించాల్సి ఉంటుంది. అలాగే, పోలవరం కాల్వను కొత్తూరు మిగతా 8లో..

మూడు రోజులే..

ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు గడువు ఈ నెల 6

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు కోసం ఇంకా మూడు రోజులే సమయముంది. అర్హులైన పట్టభద్రులంతా నవంబరు 6 వరకు మాత్రమే తమ ఓటుహక్కును నమోదు చేసుకునే వీలుంటుంది. ఫారం-18ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో అందించాల్సి ఉంటుంది. గతంలో ఓటుహక్కు ఉన్నప్పటికీ కొత్తగా ఓటుహక్కును నమోదు చేసుకోవాల్సిందే. ఫారం-18ను పూర్తి చేయటంతో పాటు డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై గజిటెడ్ అధికారితో సంతకం చేయించి జత పరచాలి. అలాగే, ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలను కూడా జతపరచాలి. ఈ మొత్తం సెట్‌ను తహసీల్దార్ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో అప్పగించాల్సి ఉంటుంది. కాగా, నగరంలోని ఏపీఎన్‌జీజీవో భవన్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే గజిటెడ్ అధికారి అందుబాటులో ఉంటారు. ఇక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు దరఖాస్తు చేస్తారు. లేదంటే యూటీఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా ఓటరు నమోదు ఫెసిలిటేషన్ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. పట్టభద్రులు ఈ కేంద్రాలను ఉపయోగించుకోవచ్చు.

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై కేసు నమోదు

అత్యాచార బాధితుల పేర్లు ప్రకటించారని వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు

- మాధవ్, జగన్ మీడియాపై చర్యలకు డిమాండ్
- కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు

6లో

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై కేసు నమోదు

- అత్యాచార బాధితుల పేర్లు ప్రకటించారని ఫిర్యాదులో పేర్కొన్న వాసిరెడ్డి పద్మ
- మాధవ్, జగన్ మీడియాపై పోక్సో చట్టం ప్రకారం చర్యలకు డిమాండ్

-కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును శనివారం ఆమె కలిశారు. అనంతరం కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. గోరంట్ల మాధవ్‌తో పాటు సాక్షి మీడియాపై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాధవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో అత్యాచార బాధితుల పేర్లను సూపర్ 1, 2, 3 అని వ్యాఖ్యానించారని వివరించారు. అత్యాచార బాధితుల పేర్లను గోప్యంగా ఉంచాలనే విజ్ఞత మాజీ ఎంపీకి లేకపోతే, సాక్షి మీడియాకు లేదా అని ప్రశ్నించారు. బాధితుల పేర్లు చెప్పి వారిని నడిరోడ్డుపై నిలబెట్టారన్నారు. అత్యాచార బాధితులకు ముద్రవేసి బయటకు లాక్కొస్తే వారి భవిష్యత్తు ఏవి ుటని ప్రశ్నించారు. అత్యాచార ఘటనల్లో బాధితులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాలే బాధితులను ఇన్‌కెమెరాలో విచారిస్తుంటే, మాజీ ఎంపీ, సాక్షి మీడియా మాత్రం వారిని ఊరేగిస్తున్నారని మండిపడ్డారు. కాగా, వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబరు 101/2024తో పోక్సో చట్టంలోని సెక్షన్ 24 కింద పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

బాధ్యత గల పార్టీలో చేరతా

తన రాజకీయ అడుగులు ఏ పార్టీ వైపు ఉంటాయన్న విషయాన్ని త్వరలో చెబుతానని వాసిరెడ్డి పద్మ వెల్లడించారు. రాజకీయాల్లో ఉండే నేతలు బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో బాధ్యతగా ఉండే పార్టీలో చేరతానని, అటువంటి పార్టీలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.

వంశీ అనుచరుడు కోట్లుపై కేసు నమోదు

ఆటోనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు, గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కొమ్మా కోట్లుపై శనివారం పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సర్నాల విజయదుర్గ 2021 ప్రసాదంపాడు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకుంటే రూ.35 లక్షలతో పాటు కుమార్తెకు మెడికల్ సీటు ఇప్పిస్తానని కొమ్మా కోట్లు మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం తన కుమార్తెకు మెడికల్ సీటు కోసమని విజయదుర్గ వెళ్లితే కోట్లు అసభ్యకరంగా దూషించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు 506 సెక్షన్ కింద పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజేఏసీ కృష్ణాజిల్లా చైర్మన్‌గా శ్యామ్‌గౌడ్



శ్యామ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మచిలీపట్నం టౌన్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీజేఏసీ అమరావతి కృష్ణాజిల్లా నూతన అధ్యక్షుడిగా ఎం.వి.శ్యామ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడ జరిగిన ఎన్నికల్లో మహిళా విభాగం చైర్మన్‌గా ఆర్.కనకదుర్గ, అసోసియేట్ చైర్మన్‌గా టి.స్వర్ణలత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన నాయకులను రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు అభినందించారు.

ముగ్గురు అన్నదమ్ములు అదృశ్యం

- ఇంటి నుంచి అంగన్‌వాడీ, పాఠశాలకు వెళ్లిన చిన్నారులు
- మచిలీపట్నంలో సంచలనం కలిగించిన ఘటన





తుమ్మా నాగేశ్వరరావు, దుర్గారావు



శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశా లకు వెళ్లిన ముగ్గురు అన్నదమ్ములైన చిన్నారులు అదృశ్యం కావడం మచిలీపట్నంలో శనివారం సంచలనం రేపింది. కాలేఖాన్‌పేట నాగులేటి ఒడ్డున నివసిస్తున్న యానాది కుటుంబానికి చెందిన తుమ్మా ప్రసాద్ దంపతులకు తుమ్మా నాగేశ్వరరావు (3), తుమ్మా దుర్గారావు(6), తుమ్మా శ్రీనివాసరావు(8) కుమారులు ఉన్నారు. వీరు అంగన్‌వాడీ కేంద్రం, కాలేఖాన్‌పేటలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఈ ముగ్గురు తిరిగి రాలేదు. తల్లి అనారోగ్యంతో చనిపోయింది. తండ్రి వ్యవసాయ కూలి కావడంతో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చూస్తే బిడ్డలు కనిపించలేదు. వారి కోసం చుట్టు పక్కల వెతికినా ఫలితంలేకపోవడంతో ఇనగుదురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఈ అంశంపై అన్ని పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేశారు.

టెన్నిస్‌లో గాలి జోషితకు ద్వితీయస్థానం



పతకాలతో జోషిత

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడలోని డీఎస్ఏ స్టేడియంలో గత నెల్లో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నీలో యువ టెన్నిస్ క్రీడాకారిణి గాలి జోషిత అండర్-17లో ద్వితీయ స్థానంలో నిలిచింది. గొల్లపూడిలోని జైన్ కాలనీలో కేపీ టెన్నిస్ అకాడమీలో కోచ్ ఎస్కే నగర్ వలిచే వద్ద శిక్షణ పొందిన జోషిత సత్తా చాటింది. అండర్-14, అండర్-12 విభాగాల్లో గతంలో పలు పతకాలను జోషిత వశం చేసుకుంది.

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి ఏపీ జట్టు



ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు కృష్ణచైతన్య, జాషువా

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అనంతపురంలోని ఆర్‌డీటీ గ్రౌండ్స్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు ఆతిథ్యం ఇచ్చే జాతీయ స్థాయి సీనియర్ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేసినట్టు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం డేనియల్ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ జిలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబర్ తదితర జట్లు బరిలో దిగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి కృష్ణచైతన్య, జాషువాలు చోటు దక్కించుకోవడం విశేషం.

ఆంధ్రప్రదేశ్ జట్టు ఇదే....

బి.మూర్తి, బి.వీర సాయి హర్షవర్ధన్(అనంతపురం), చక్రి(చిత్తూరు), జి.చందు(తూర్పు గోదావరి), వై.సూర్య తేజ(ఏలూరు), సౌరవ్(గుంటూరు), ఎస్.ప్రేమనాథ్(కాకినాడ), ఎం.మహేష్ టి.వంశీ వివేకానంద(కర్నూల్), పి.జాషువా, ఎస్.కృష్ణ చైతన్య(ఎన్టీఆర్), సూర్య సుధాకర్(నెల్లూరు), ఎస్కే ఇర్ఫాన్(పల్నాడు), పి.ఆర్.శివప్రసాద్, బి.మణికంఠ, ఎస్.ప్రవీణ్(సత్యసాయి), కె.జాకబ్ హెరాల్డ్(తిరుపతి), జి.రాజ్‌కుమార్, టి.ప్రదీప్(విశాఖపట్నం), పరమేష్, సునీల్(వైఎస్ఆర్ కడప), స్టాండ్ బైలుగా గణేష్(విజయనగరం), ఎ.అచ్యుత్(తిరుపతి).

ప్రతిబంధకాలు

- సీసీఐ నిబంధనలపై రైతుల ఆగ్రహం
- త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- నిబంధనల సడలింపుతోనే రైతుకు మేలు



సీసీఐ విధించిన నిబంధనలు పత్తి రైతులకు మేలు చేయకపోగా ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత విధించడంతో పాటు తూకం తగ్గించడం వంటి వాటితో ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారు. ఆదుకోవాల్సిన సీసీఐ ఒక వ్యాపార సంస్థగా తయారైందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల): జిల్లాలో పత్తి తీతలు ప్రారంభమయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా లేవు. బయటి మార్కెట్లో గిట్టుబాటు ధర లభించటం లేదు. క్వింటాకు రూ. 6 వేలకు మించి ధర రావటం లేదు. దీనికి తోడు పత్తి తీతకు ఎక్కువ ఖర్చు అవుతుంది. దీంతో పత్తి రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకునేందుకు భారత పత్తి సంస్థ (సీసీఐ) ఈ నెల మొదటి వారంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనుంది.

అడ్డంకిగా నిబంధనలు

సీసీఐ నిబంధనల వల్ల పత్తి అమ్ముకునే రైతులకు మేలు జరగకపోగా నష్టం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీసీఐ, సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోలు చేయనుంది. ఇప్పటికే ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు, రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకువెళ్లి తమ పేర్లు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. యాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వద్ద మాత్రమే సీసీఐ పత్తి కొంటుంది. లేని పక్షంలో కొనుగోలు చేయదు. నాణ్యత లేని, రంగు మారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ తీసుకోదు. నాణ్యత కల్గిన పత్తిని మాత్రమే కొంటుంది.

తేమ శాతం ఎనిమిది లోపు ఉండాలి

2024-25 సీజన్‌కు సంబంధించి పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521. నిబంధనలకు అనుగుణంగా ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ మద్దతు ధర ఇస్తుంది. ముఖ్యంగా పింజ పొడవు 29.50 నుంచి 30.50 మిల్లీమీటర్లు ఉండాలి. పొడవు 29.50 మిల్లీమీటర్ల కన్న తక్కువగా ఉన్నట్లయితే మద్దతు ధర కూడా తగ్గుంది. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం లోపు ఉండాలి. అంతకు మించి ఉన్నట్లయితే పత్తి కొనదు. ఎనిమిది శాతం లోపు ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ మద్దతు ధర ఇస్తుంది. ఎనిమిది శాతం మించి 12 శాతం వరకు ఒక్కొక్క శాతానికి మద్దతు ధరలో ఒక శాతం (రూ.75.21) వంతున కోత వి ధిస్తుంది. తొమ్మిది శాతానికి రూ.7,445.79, 10 శాతానికి రూ. 7,370.58, 11 శాతానికి రూ.7,295.37, 12 శాతానికి రూ.7,220. 16 ధర మాత్రమే ఇస్తుంది.



సీసీఐ నిబంధనలతో ఏర్పాటు చేసిన బ్యానర్

నిబంధనలు సడలించాలి

సీసీఐ నిబంధనల వల్ల పత్తి రైతులకు మద్దతు ధర అందని ద్రాక్షగా తయారైంది. మద్దతు ధరలో కోత వి ధించటమే కాకుండ ఒక్కోసారి తేమ శాతం అధికంగా ఉందంటూ రెండు నుంచి ఆరు కిలోల వరకు తూకం కూడా తగ్గిస్తున్నారు. అడ్డంకిగా ఉన్న నిబంధనల వల్ల పలువురు రైతులు, బయటి మార్కెట్లో ధర తక్కువగా ఉన్నప్పటికీ సీసీఐకి అమ్మేందుకు ముందుకు రావటం లేదు. సీసీఐ నిబంధనలు సడలించాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదు. దీంతో సీసీఐ వల్ల రైతులకు ఆశించిన ప్రయోజనం కలగటం లేదు.

సీసీఐ వ్యాపార సంస్థగా తయారైంది



రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ ఒక వ్యాపార సంస్థగా తయారైంది. లాభ నష్టాలను బేరీజు వేసుకుని సీసీఐ పత్తి కొంటుంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనపుడు, మద్దతు ధరకు కొనాల్సిన సీసీఐ సవాలక్ష ఆంక్షలతో పత్తి రైతులను దూరం పెడుతుంది. ఇప్పటికైనా సీసీఐ విధానాన్ని మార్చుకోవాలి.

-మూరకొండ ఏడుకొండలు, తెలుగు రైతు నాయకుడు, గనిఆత్కూరు

నిబంధనలు విధించటం సరికాదు



పత్తిని కొనేందుకు సీసీఐ నిబంధనలు వి ధించటం సరికాదు. నాణ్యతా ప్రమాణాలతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి. నాణ్యత లేదంటూ, తేమ శాతం ఎక్కువంటూ సీసీఐ కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయటం మంచి పద్ధతి కాదు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని నిబంధనలను సడలించాలి లేదా పూర్తిగా ఎత్తివేయాలి.

-తల్లపనేని నాగేశ్వరరావు, రైతు, గొట్టుముక్కల

చిల్లకల్లు సంతలో అనధికార వసూళ్లు

- పార్కింగ్ ఫీజు అంటూ దబాయింపు
- పోలీసులకు ఫిర్యాదు.. అదుపులో నిందితుడు

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిల్లకల్లు సంత వద్ద అనధికారిక వసూళ్లు జోరుగా సాగుతున్నాయి. శనివారం సంతకు వచ్చిన సబ్ డివిజనల్ అధికారి కుటుంబ సభ్యులు తమకు కావాల్సిన జీవాలను కొనుగోలు చేసి యార్డుకు కట్టాల్సిన ఆశీలు కట్టి వాహనంతో రోడ్డెక్కుతుండగా పార్కింగ్ ఫీజు కట్టాలని ఓ వ్యక్తి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న జెడ్పీ స్థలంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డు పర్యవేక్షణలో ప్రతి శనివారం జీవాల సంత నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రయ, విక్రయదారులు వ్యాపార లావాదేవీలు ముగించుకుని బయటకు వస్తున్న వాహనాల వద్ద కొంత మంది పార్కింగ్ పేరుతో బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు. రైతులు ఎందుకు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి నరసింహారావును వివరణ కోరగా నిబంధనల మేరకు ఆశీలు మాత్రమే వసూలు చేస్తున్నామని తెలిపారు. పార్కింగ్ వసూళ్ల గురించి తనకు తెలియదన్నారు. చిల్లకల్లు పంచాయతీలో వి చారించగా, సంతకు సంబంధించి వసూళ్లకు పాటలు నిర్వహించలేదని చెప్పారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ, పోలీస్, మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించి అక్రమ వసూళ్లను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.



అనధికారికంగా ఏర్పాటు చేసిన బిల్లు పుస్తకం

శాస్త్రోక్తంగా దుర్గమ్మకు ఆర్జిత సేవలు



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు



దీపం వెలిగిస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దుర్గగుడిలో శనివారం శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు నిర్వహిం చారు. వేద పండితులు, అర్చకస్వాములు ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సహస్రలింగార్చన, ఊంజల్ సేవ, ఇతర ఆర్జిత సేవల్లో ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో భక్తులతో కలిసి దీపాలు వెలిగించారు. కార్తీకమాసం మొదటిరోజు కావటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

చికిత్స పొందుతూ విజయనగరం జిల్లా వాసి మృతి

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి విజయవాడ వచ్చి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విజయనగరం జిల్లాకు చెందిన లోకారపు గాంధీ (39) విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా మధురవాడ మండలం, కొమ్మాడికి చెందిన లోకారపు గాంధీ కుటుంబ సభ్యులతో అక్కడే ఉంటున్నాడు. ఇటీవల తాగుడికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో గాంధీ అక్టోబరు 28వ తేదీన భార్యతో గొడవపడి విజయవాడ వచ్చాడు. ఈనెల 1వ తేదీన రాజీవ్‌గాంధీ పార్క్ సమీపంలో ఉన్న లోబ్రిడ్జి వద్ద నుంచి బంధువులకు ఫోన్ చేసి తాను ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. కొద్దిసేపటి తరువాత ఎలుకల మందు తాగి స్పృహ తప్పి కింద పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం అతని బంధువులకు సమాచారం తెలియపరిచారు. బాధితుడు గాంధీ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువు జక్కు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కృష్ణానదిలో హైదరాబాద్ వాసి ఆత్మహత్య

కృష్ణానది ఇసుక ప్రదేశంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. కృష్ణానది ఇసుక ప్రదేశంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్నాడని సమాచారం పోలీసులకు తెలిసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి పక్కన పురుగుల మందు డబ్బా, అతని జేబులో ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు ఉన్నాయి. మృతుడు హైదరాబాద్ తిరుమలగిరి, రాజు కాలనీ ప్రాంతానికి చెందిన విగేశ్న వెంకట నారాయణరాజు, తండ్రి సుబ్బరాజుగా పోలీసులు గుర్తించారు. కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.

ప్రమాదాలకు నిలయం!

- గోతులమయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి
- లైట్లు లేక చీకటి పడితే ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- లైటింగ్ ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్థులు

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) ప్రమాదాలకు నిలయంగా మా రింది. వంతెన గుంతలమ యంగా మారడంతో తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయి. లైటింగ్ కూడా లేకపోవడంతో చీకటి పడితే గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. వంతెనపై ప్రమాదాలను అరి కట్టడానికి 2013లో అప్పటి సర్పంచ్ కాకాని అరు ణ హయాంలో ఫ్లైవోవర్‌పై పంచాయతీ పరిధిలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కొంతకాలం వెలిగిం చారు. ఆ తరువాత వచ్చిన పాలక వర్గం లైట్లు నిర్వహణ భారంగా మారడంతో పట్టించ ుకోలేదు. దీంతో వంతెనపై ప్రమాదాలు మరింత ఎక్కువ అయ్యాయి. గత నెలలో వంతెనపై ఏర్పడ్డ గుంతలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మర మ్మతులు జరిపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ ఆ గుంతలు యథాస్థితికి చేరు కున్నాయి. తరుచూ పడుతున్న గుంతలకు పరి ష్కార మా ర్గాన్ని చూపాలని, కనీసం అక్కడ ఉన్న స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుడా నివారించాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గుంతలు



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ సీవీఎస్ భాస్కరరావు, రీజనల్ హెడ్ శ్రీధర్, డిప్యూటీ జోనల్ హెడ్ శారదామూర్తి పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి- విజయవాడ

9న వలంటీర్ల ఆవేదన సదస్సు

ధర్నాచౌక్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షల 60 వేల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని వారి గోడును చంద్రన్నకు వినిపించాలని ఈ నెల 9న వలం టీర్ల ఆవేదన సదస్సును విజయవాడలో నిర్వహి స్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసి యేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వ రయ్య, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. స్థానిక హనుమాన్‌పేటలోని దాసరిభవన్‌లో శని వారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. వలంటీర్లకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సీఎం చంద్ర బాబు తన నిబద్ధత చాటుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవిందరాజులు పాల్గొ న్నారు.

రైల్వేస్థలంలో ఆక్రమణల తొలగింపు

- పెడనలో భారీగా మోహరించిన పోలీసులు
- కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడినా చివరికి ప్రశాంతం





జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు, మోహరించిన పోలీసులు

పెడన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భా రీ పోలీసు బందోబస్తు నడుమ రైల్వేశా ఖకు చెందిన స్థలంలో ఉన్న ఆక్రమణలను శనివా రం తొలగించారు. కొందరు రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రైల్వే స్థలాన్ని ఆక్రమిం చుకుని అందులో రేకుల ఇళ్లు, తాటాకు ఇళ్ల వంటివి వేసుకుని ఏళ్ల తరబడి నివాసముం టున్నారు. ఇళ్లు స్వ చ్ఛందంగా తొలగించుకో వాలని సూచిస్తూ రైల్వే అధికారులు 8 నెలల క్రితం ఫారం ఏ, 6 నెలల క్రితం ఫారం బీ జారీ చేశారు. స్పందన లేకపోవ డంతో 3 రోజుల క్రితం వీరికి రైల్వే అధికా రులు ఇళ్ల తొలగింపునకు నోటీసులిచ్చారు. అ యినా స్పందన లేకపోవడంతో శనివారం ఉద యం రైల్వే అధికారులు ఇళ్ల తొలగింపు నకు స మాయత్తమయ్యారు.

ఇళ్ల తొలగింపునకు రెవె న్యూ, పోలీసు, మునిసిపల్ అధికారులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు, జీఆర్‌పీఎఫ్, లోకల్ పోలీసులు శనివారం ఉదయం రైల్వేస్థలం వద్ద మోహ రించారు. వీరి సహకారంతో ఆక్రమణలు తొలగించారు. స్థానిక ఇందిరా కాలనీలోని రైల్వేస్థలంలో ఉన్న ఇళ్ల తొలగింపు ప్రక్రి యను ప్రారంభించారు. ఇందిరా కాలనీ నుంచి ప్రారంభమైన ఈ తొలగింపు గూడూరు రోడ్డులోని రైల్వేగేటు వరకు కొన సాగింది. ఇందిరా కాలనీ నుంచి గూ డూరు రైల్వేగేటు వరకు రైల్వేట్రాక్ పక్కనున్న రైల్వే స్థలంలో ఉన్న 35 ఆక్రమణలను తొలగిం చారు. వీటి విస్తీర్ణం 1.48 ఎకరాలు. మొత్తం 35మంది ఆక్రమణదారులకు గాను వారిలో 33 మందికి ప్రభుత్వం ఇళ్లపట్టాలు కేటా యించగా ఇద్దరికి సొంత స్థలాలున్నట్టు అధికారులు గు ర్తించారు. కాగా పెడన - బందరు రోడ్డులోని రై ల్వేగేటు సమీపంలోని ఒక భవనాన్ని తొలగించే సమయంలో కొద్ది పాటి ఉద్రిక్తత నెలకొంది. రైల్వే అధికారులు తగిన ఆధారాలు చూపించడంతో ఉద్రిక్తత సడలింది. ఎలాంటి ప్రతిఘటనలు ఎదురు కాకుండా ఆక్రమణల తొలగింపు ప్రశాం తంగా ముగిసింది. రైల్వేశాఖ బీమవరం ఏడీఎం శంకర రామాంజనేయులు, విజయ వాడ ఏడీఎన్ జి.నాగేంద్రప్రసాద్, కమిషనర్ ఎం.గోపాలరావు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్, టీపీవో సృజనకుమారి, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, 200 మంది పోలీ సులు ఈ ఆక్రమణల తొలగింపులో పాల్గొ న్నారు.

మాలధారులకు నిత్యాన్నదానం



పటమట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పలకు, భవానీలకు అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో 12వ డివిజన్ శాంతినగర్‌లో శనివారం అన్నదానాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు, గురుస్వామి శాయన సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం 45 రోజులు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తబృందం సభ్యులు డోకిపర్తి ఉమామహేశ్వర రావు, డోకిపర్తి యుగంధర్, లక్ష్మీనారాయణ, వెలగపూడి రమేష్, సీహెచ్ నరసింహారావులు పాల్గొన్నారు.



గుణదల దంతవైద్యశాల సెంటర్ వద్ద రోడ్డు మీద డంపర్‌బిన్



ఈఎస్ఐ ఆస్పత్రి సెంటర్‌లో



లయోలా కళాశాల రోడ్డో..



వరలక్ష్మీనగర్ సమీపంలో..

రోడ్డుపైనే డంపర్‌బిన్లు

● ట్రాఫిక్‌కు ఇబ్బందికరం ● రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న డంపర్ బిన్లు వాహదారులకు ప్రమాదకరంగా మారాయి. మూడు, నాలుగు డివిజన్లలోని పలు ప్రధాన ప్రాంతాలైన ఈఎస్ఐ హాస్పిటల్ సెంటర్, దంతవైద్యశాల సెంటర్, లయోలా కళాశాల రోడ్డు, వరలక్ష్మీ నగర్ కాలనీల సమీపంలో ఐదవ నెంబరు రోడ్డులో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లు రోడ్డుపై పెట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. చెత్తను లారీలో ఎక్కించేందుకు అనువుగా ఉంటుందని వీఎంసీ సిబ్బంది డంపర్లను ఇలా రోడ్డుపై పెడుతున్నారు. దీంతో రాత్రి సమయంలో ఈ డంపర్ల వలన పలు ఇబ్బందులు పడుతున్నట్లు ద్విచక్రవాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాగులచవితికి వీర నాగేంద్రస్వామి ఆలయం ముస్తాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ లీగల్)

సిటీ సివిల్ కోర్టుల సమీపంలో ప్రసిద్ధిగాంచిన వీర నాగేంద్రస్వామి ఆలయం మంగళవారం జరిగే నాగుల చవితికి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఏటా ఈ ఆలయానికి భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా నాగేంద్రుడి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుంటారు. భక్తులు చలివిడి, వడపప్పు, పసుపు, కుంకుమ, ఆవుపాలు,



ముస్తాబైన సిటీ సివిల్ కోర్టుల సమీపంలోని వీర నాగేంద్రస్వామి ఆలయం

కోడిగ్రుడ్లు, తేనె తదితర పదార్థాలతో స్వామివారిని పూజిస్తుంటారు. కొందరు భక్తులు పాలపొంగళ్లు పెట్టి తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. పిల్లలకు చెవులు కుట్టడం, అన్నప్రాసన వంటి కార్యక్రమాలు కూడా ఇక్కడ చేస్తుంటారు. ఈ సందర్భంగా క్యూలైన్ల వద్ద ఎటువంటి తొక్కిసలాట జరగకుండా వుండేందుకు పోలీసులు బందోబస్తు కూడా నిర్వహిస్తుంటారు.


ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, మేనేజింగ్ ట్రస్టీ సందక దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు, ఉచితంగా మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నలందలో టెక్‌మన్‌థన్ 2కే24

లబ్బీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో టెక్‌మన్‌థన్ 2కే24 నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇటువంటి పోటీల్లో పాల్గొనటం ద్వారా తమ



ప్రతిభను నిరూపించుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్ పెంపొందించుకుంటే సాఫ్ట్‌వేర్, టెక్నికల్ రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్ క్విజ్, డంబ్ యాక్ట్, మిస్టర్ అండ్ మిస్, డాన్స్, గేమ్ జోన్ అండ్ యాప్ బిల్డింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ పి. దుర్గాభవాని, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయవాడ కతోలిక బిషప్ తెలగతోటి రాజారావు



సమాధులను అలంకరిస్తున్న క్రైస్తవులు

ఆత్మల శాంతిని కోరుతూ క్రైస్తవుల ప్రార్థన

గుణదల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం పక్కన ఉన్న బరియల్ గ్రౌండ్‌లో శనివారం సమాధుల పండుగ నిర్వహించారు. కతోలిక శ్మశానవాటిక గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద ఉండటంతో సమాధుల పండుగను పురస్కరించుకుని నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమాధుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిషప్ తెలగతోటి రాజారావు విచ్చేశారు. ముందుగా ఆయన సమాధుల వద్దకు వెళ్లి ఆయా గురువుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ ప్రార్థన చేశారు. అనంతరం ఆయన చనిపోయిన వారి ఆత్మల శాంతిని కోరుతూ సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ కతోలిక పీఠం బిషప్ ఫాదర్ తెలగతోటి రాజారావు మాట్లాడుతూ నగరంలోని పలు చర్చిల్లో ఫాదర్లుగా పనిచేసిన వారి సమాధులు ఇక్కడ ఉన్నాయని, అలాంటి వారి ఆత్మ శాంతించాలంటే వారు కోరుకున్న సమాజ స్థాపనకోసం మనం కృషి చేస్తేనే సాధ్యపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, పలువురు సిస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు తర్వాత రోడ్లపై గుంతలు కనపడితే చర్యలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో అమరావతి రాజధాని అభివృద్ధి చేస్తూ, నగరాన్ని కూడా వేగంగా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని నాగార్జున నగర్ కాలనీలోని 4, 6 అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు నెల తర్వాత రోడ్లపై గుంతలు కనబడితే అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మూడో డివిజన్‌లోని నాగార్జున నగర్‌కాలనీ, శ్రీరామచంద్రనగర్ కాలనీలోని పలు అంతర్గత రోడ్లకు కోటీ పది లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామన్నారు. అనంతరం శ్రీరామచంద్రనగర్ కాలనీప్రధాన రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే గద్దె గుంతల్లో కంకర వేసి పూడ్చారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్,



గుంతల్లో కంకర వేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

తాడిబాబూరావు, గద్దె రమేష్, యలమంచిలి పండు, వీరమాచినేని పూర్ణచంద్రరావు, రేణు జితేంద్ర, దాడి సుబ్బారావు, అట్లూరి విశ్వేశ్వరావు, డివిజన్ నాయకులు, కాలనీ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా పని చేయాలి


● మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి నిత్యం ఫిర్యాదులు వస్తేనే పనిచేసేలా కాకుండా, ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా ఉండేలా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 286 సచివాలయాల ప్రణాళిక, శానిటరీ, ఎమినిటీస్, సెక్రటరీలతో సంయుక్త పర్యవేక్షణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన గత రెండు వారాలుగా చేస్తున్న సంయుక్త పర్యవేక్షణలో సెక్రటరీలు గుర్తించిన సమస్యలు ఏంటి? తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాన్ లేనిదే ఇళ్లు నిర్మించరాదని, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయరాదని, తడి చెత్తను, పొడి చెత్తను ఇంటివద్దే వేరు చేసే విధంగా సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సచివాలయం సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలరని తెలిపారు.

సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ బి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

లబ్బీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అవినీతిరహిత సమాజాన్ని నిర్మించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ వీరవెంకట సత్యనారాయణ అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం బిషప్ అజరయ్య గర్ల్స్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షణ, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతి అభివృద్ధిలో సమైకృత, సంస్కృతి అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో యు.వి.సుబ్బారావు, జి.మహేశ్వరరావు, ఆర్.విజయ రామారావు, కె.సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ సత్యనారాయణ, డీఈవో సుబ్బారావు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుణదల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందిన ఘటన గుణదల స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మధురానగర్ వెంకటేశ్వర నగర్లో ఉంటున్న అనుమోలు బాలకృష్ణారావు(36), షేక్ షరీఫా(33) దంపతులకు పాప ఉంది. బాలకృష్ణారావు కొండపల్లి ఖిల్లాలో సెక్యూ రిటీ గార్డు. గత నెల 29న భర్త ఫోన్లో బ్యాలెన్స్ లేదేంటి అని భార్యను అడగ్గా ఆమె తాను వాడానని తెలిపింది. ఇచ్చిన డబ్బు లు కాకుండా ఇంకా అదనంగా వాడేస్తే ఎలా, ఎన్నిసార్లు చెప్పినా వినవా అంటూ వాగ్వాదానికి దిగాడు. రూ.300లు వాడినందుకే ఇంతగొడవ చేస్తావెందుకని ఆమె గట్టిగా అడిగింది. కోపంతో భర్త బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నేను చస్తేగాని నీవు మారవంటూ తలుపులు వేసుకుని ఉరేసుకున్నాడు. ఇది గమనించిన భార్య అతనిని చుట్టపక్కల వారి సాయంతో దింపి ఆసుపత్రికి తరలించింది. రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గత నెల 29న ఈ విష యమై ఆత్మహత్యాయత్నంగా కేసు నమోదు చేసిన గుణదల పోలీ సులు అనుమానాస్పద మృతిగా శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడండి

చిట్టినగర్: నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు కలగకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది, ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రోడ్లపై నిలపటం వలన ఆయా ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తగా రెక్కలొచ్చేనా..?



బ్యాంబూ మేజ్

● చురుగ్గా సాగుతున్న పనులు ● ఆర్చిల నిర్మాణ పనులు ప్రారంభం ● బ్యాంబూ మేజ్ పార్క్‌కు సన్నాహాలు
● మొదలైన కార్తీక సందడి ● మరో రెండు వారాల్లో సీతాకోకచిలుకల ఆగమనం ● పెరిగిన ట్రెక్కర్లు, వాకర్లు, సందర్శకుల రాక

గత ప్రభుత్వ పాలనలో పడకేసిన మూలపాడులోని బటర్ ఫ్లై పార్కును అద్భుతంగా రూపొందించే దిశగా పనులు జరుగుతున్నాయి. గతంలో ధ్వంసమైన గ్రాండ్ ఎంట్రీ స్థానంలో సరికొత్త ప్రవేశ మార్గాన్ని అభివృద్ధి చేశారు. రెండు వైపులా రాతి రాళ్లతో కోటను తలపించే నిర్మాణశైలిలో ప్రధాన ఆర్చి నిర్మాణ పనులు చేపట్టారు. వీటిపై రంగురంగుల సీతాకోక చిలుకలు రెక్కలు ఆడిస్తున్నట్టుగా కనిపించేలా ఆకృతులను తీర్చిదిద్దారు. ఈ ప్రధాన ద్వారం పక్కనే రాతిపై కృత్రిమ జలపాతాన్ని సృష్టించారు. ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్లిన తర్వాత మరో ఆర్చి నిర్మాణాన్ని కొత్తగా చేపట్టారు. వెదురుబొంగులతో ఏర్పాటు చేసినట్టుగా అనిపించేలా దీన్ని ఏర్పాటు చేశారు. పక్షుల సంరక్షణ కేంద్రాన్ని కూడా ముస్తాబు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రాంగణంలో చిల్డ్రన్స్ పార్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. వెదురుమొక్కలతో కూడిన బ్యాంబూ మేజ్ పార్క్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వెదురు చెట్లను మేజ్ గార్డెన్‌గా ఉపయోగించాలని నిర్ణయించారు. మేజ్ గార్డెన్‌లోకి ప్రవేశించేలా అవసరమైన చోట్ల వెదురు చెట్లను తొలగించి మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎటు నుంచి ఎటు వెళుతున్నారో తెలియని విధంగా సందర్శకులు ఆశ్చర్యపోయేలా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఆ పనులు కూడా ఇప్పుడే మొదలయ్యాయి. గతంలో అనేక సెల్ఫీ పాయింట్లు, సీతాకోకచిలుకల కళాఖండాలను ఏర్పాటు చేశారు. ఇవి ధ్వంసం కావటంతో వీటి పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది రోజుల్లో వీటిని చేపట్టనున్నారు. ఈ ప్రాంతం ట్రెక్కర్లకు ఎంతో ఇష్టమైనది కావటంతో ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తూనే ఉన్నారు. సమీప ప్రాంతాలలోని సందర్శకులు భారీగానే వస్తున్నారు. ముఖ్యంగా వాకర్లు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఐదేళ్ల తర్వాత తిరిగి అభివృద్ధి పనులు జరుగుతుండటంతో వీటిని చూడటానికి కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వర్షాకాలం నుంచి శీతాకాలంలోకి ప్రవేశించే సమయంలో మూలపాడులోని బటర్‌ఫ్లై పార్క్ కొత్తందాలను సంతరించుకుంటోంది. ఈ ప్రాంతంలో నెమళ్లు కూడా కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సెలయేళ్లు కూడా కనువిందు చేస్తున్నాయి. అత్యద్భుతమైన అందాలను ఆవిష్కృతం చేస్తున్నాయి.

మూలపాడు బటర్ ఫ్లై పార్క్ అందంగా ముస్తాబవుతోంది! ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చటి ప్రకృతి కనువిందు చేస్తోంది. చల్లటి సెలయేళ్లు మనసును దూదిపింజల్ని చేస్తోంది. ఇప్పటికే కార్తీకమాసం ప్రారంభమైంది. వనభోజనాలు ఏర్పాటు చేసుకునేందుకు సందర్శకులు ఎదురుచూస్తున్నారు. శీతాకాలం ప్రారంభం కావటంతో మరి కొద్ది రోజుల్లో సీతాకోకచిలుకలు ఈ ప్రాంతానికి ఆగమనం చేయనున్న నేపథ్యంలో ప్రత్యేక ఆకర్షణలను ఇక్కడ తీర్చిదిద్దుతున్నారు. అయితే ఈ వేగం మాత్రం సరిపోదని, శరవేగంగా పనులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

మూలపాడు బటర్ ఫ్లై పార్కుకు సరికొత్త సొబగులు







← ప్రవేశ మార్గాలు →



పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు

పార్కులోపల వాకింగ్ ట్రాక్

నెల రోజుల్లో 249 మందికి డీడీ జరిమానా

విజయవాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో నెల రోజుల వ్యవధిలో 249 మంది మందుబాబులకు న్యాయస్థానం జరిమానా విధించింది. నిత్యం ట్రాఫిక్ పోలీసులు నగరంలో ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రంకెన్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అక్టోబరు 2 నుంచి శనివారం వరకు రైల్వే కోర్టు మొత్తం 249 మందికి జరిమానాలు విధించింది. వారిలో 40 మందికి రూ.15వేలు, మిగిలిన 209 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించింది. నగరంలోని వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారు సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆదేశించారు.

రేటింగ్ చెస్‌లో నాగ షణ్ముక్ ముందంజ



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కేయూ తొలి ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో ఫస్ట్‌క్లాస్ చదువుతున్న ఆరేళ్ల తాళ్ల నాగ షణ్ముక్ ఫిడే రేటింగ్‌లో 1410 పాయింట్లతో ముందంజ వేశాడు. అతి చిన్న వయస్సులో ఏపీలో అరుదైన రేటింగ్ నమోదు చేసిన షణ్ముక్ అందరి ప్రశంసలు పొందాడు. స్పార్క్ చెస్ నిర్వాహకుడు నరేష్ శిక్షణలో షణ్ముక్ ఇటీవల పలు పోటీల్లో సత్తా చాటాడు. షణ్ముక్‌ను స్ప్రింగ్ బోర్డు ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ చైర్మన్ కే రాజేంద్రరావు అభినందించారు.

కర్ణాటక ఆలయ పర్యటనకు భారత్ గౌరవ్ రైలుయాత్ర

రైల్వేస్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వేస్ భారత్ గౌరవ్ రైలు పథకంలో భాగంగా మొట్టమొదటిసారిగా కర్ణాటక ఆలయ పర్యటనకు ప్రత్యేక రైలును నడపనుంది. వీటికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కర్ణాటకలో 9 రోజుల పాటు ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. డిసెంబరు 5న పర్యటన ప్రారంభమవుతుందని, కర్ణాటకలోని ప్రముఖ దేవాలయాలు నవబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హోరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రహ్మణ్యం, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శిస్తారన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల కోసం గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లో రైలు ఎక్కేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ప్యాకేజీ థర్డ్ ఏసీకి రూ.33వేలు, థర్డ్ ఏసీ ప్రీమియంకు రూ.37వేలు, సెకండ్ ఏసీకి రూ.40వేలుగా ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 93550 21516 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ట్రైన్‌టూ.ఇన్‌లను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుంతల రహితంగా తీర్చిదిద్దుతాం

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



కేసరపల్లిలో గుంతల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతల రహిత జిల్లాగా రహదారుల అభివృద్ధే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ (మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ)లో భాగంగా శనివారం గన్నవరం మండలం కేసరపల్లిలో మరమ్మతు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు కేసరపల్లి నుంచి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మొదటి ప్రాధాన్యతగా 45 పనులకు రూ.14.76 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. వీటికి అదనంగా మిగిలిన పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు నాణ్యతతో కూడిన పనులు చేపట్టి వచ్చే సంక్రాంతిలోపు గుంతల రహిత జిల్లా లక్ష్యంగా రహదారుల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని రాష్ట్ర రహదారి, ప్రధాన జిల్లా రహదారుల మరమ్మతుల నిమిత్తం మొత్తం రూ.3.83 కోట్లు తొలి విడతగా మంజూరయ్యాయని, మరో రూ.3.61 కోట్ల పనులకు ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసి పంపినట్టు వివరించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుల వడ్రానం హరిబాబు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో రోడ్ల పరిస్థితి అధ్వన్నంగా తయారయ్యాయన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, ఆర్ అండ్‌బీ ఈఈ లోకేష్, తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, టీడీపీ నేతలు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, జనసేవ, బీజేపీ నేతలు చలమలశెట్టి రమేష్‌బాబు, పవన్ కుమార్, బాలకృష్ణ, జూపల్లి సురేష్, ఎంవీఎల్ ప్రసాద్, జాస్తి విజయభూషణ్‌కుమార్, మండవ లక్ష్మీ, మేడేపల్లి రమా, దేవినేని సులోచన మూల్పూరి మాధవన్, జాస్తి వీరబాబు, ఆనంద్, లావు వంశీకృష్ణ పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మీనా, ఎమ్మెల్యే గద్దె



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే గద్దె

ఆటోనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గుంతల రహితంగా తీర్చిదిద్దాలనే మహా సంకల్పంతో సీఎం ప్రత్యేకంగా గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌ను ప్రారంభించారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆటోనగర్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద జిల్లా రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల అంచనాతో చేపట్టిన మిషన్ పాట్ హోల్ ఫ్రీ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1309 కిలోమీటర్ల పొడవైన రహదారులు ఉన్నాయన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా తొలిదశలో జిల్లాలో రూ.7.71 కోట్లతో 54 పనులు మంజూరు చేశామన్నారు. 352 కిలోమీటర్ల పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. మైలవరం 14, తిరువూరు 13, జగ్గయ్యపేట 8, నందిగామ 13, విజయవాడ తూర్పు 3, పశ్చిమ 2, మధ్య నియోజకవర్గంలో 2 చోట్ల పనులు చేపట్టినున్నట్టు వివరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో రహదారులనేవి కీలకమైనవన్నారు. గత ఐదేళ్లలో రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. రహదారుల సమస్యలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నట్టు వెల్లడించారు. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి చేసేందుకు పటిష్ట ప్రణాళికతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. దాదాపు లక్ష మంది కార్మికులు పనిచేసే ఆటోనగర్‌లో పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్డీవో కె.చైతన్య, ఆర్ అండ్ బీ ఎస్.ఈవ టి.సత్యనారాయణ, ఈఈ ఎన్.కృష్ణ నాయక్, డీఈఈ శశిభూషణ్, 4బీ గుత్తేదారు తుమ్మల జగదీష్, ఐలా మాజీ చైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, నేతలు గొల్లపూడి నాగేశ్వరరావు, కె. ఆంజనేయవాసు, జాస్తి సురేష్ పాల్గొన్నారు.



పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోండి

● ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో పశ్చిమ కృష్ణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కె.వి.శివారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటును నమోదు చేసుకునేందుకు గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మంచి అభ్యర్థిని ఎన్నుకునేందుకు డిగ్రీ ఉత్తీర్ణులైన ప్రతి ఉద్యోగి వారి కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘం కోశాధికారి కె.రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, జి.రామకృష్ణ, ఎం.నాగేంద్ర, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సి.వి.ఆర్. ప్రసాద్, షేక్ నజిరుద్దీన్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల్లో లోపాలు గుర్తిస్తే చర్యలు

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలకు సరైన కారణాలు లేకపోయినా, మరణాల్లో ఇలాంటి లోపాలను గుర్తిస్తే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని, ప్రభుత్వ వైద్యులు జవాబుదారీతనంతో సేవలందించాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో జిల్లాలో జరిగిన రెండు మాత నాలుగు శిశు మరణాలకు గల కారణాలపై శనివారం నిధి మీనా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలపై పూర్తిస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి మరణాలకు గల కారణాలపై వైద్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఎవరికి వారు తమ తప్పేమిలేదని అంటున్నారని, అలాంటప్పుడు మరణాలు ఎందుకు సంభవిస్తాయన్నారు. మహిళ గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించి లోపాలను నివారించాలన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో కలగరాదన్నారు. మాతా శిశు మరణాలు పునరావృతం కాకూడదన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ డీపీ జి.ఉమాదేవి, జీజీహెచ్ వైద్యులు డాక్టర్ ఆర్.సౌజన్య, డాక్టర్ సవిత, డాక్టర్ మదీన అహ్మద్, సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ ఎస్.సుమతి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అమృతద, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హిందుమతి, టీబీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ, ఎం.నాగమణి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

6న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నేతలు

బస్‌స్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పై ఈనెల 6న విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్, జి.వి.నరసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు జరిగే సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు 4 జోన్లు, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, 4 నాన్ ఆపరేషన్ రీజియన్లకు సంబంధించి రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు, 4 జోనల్ స్థాయి కోశాధికారులు హాజరవుతారన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు ప్రకటిస్తామని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన సూపరింటెండెంట్‌కు అభినందనలు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రి నూతన సూపరింటెండెంట్ ఏవీ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ని ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏపీ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబీశ్యామ్ కుమార్, డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ దుర్గాకుమారి, డాక్టర్ సరళ పాల్గొన్నారు.



ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నెట్టెం రఘురామ్, పలువురు నేతలు

ఎర్రన్నాయుడుకు ఘన నివాళులు

వన్‌టౌన్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ గురుమూర్తి ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నెట్టెం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎర్రన్నాయుడు చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఉన్నంత కాలం ఎర్రన్నాయుడు చేసిన సేవలను గుర్తుపెట్టుకుంటుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఎర్రన్నాయుడు కొన్ని వేల గ్రామాలకు మంచినీటి సరఫరా, రోడ్డు సౌకర్యాన్ని కల్పించారని గుర్తు చేశారు. మరోపక్క పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. వీవీ గురుమూర్తి మాట్లాడుతూ పార్టీ శ్రేణులందరూ ఎర్రన్నాయుడు అడుగుజాడల్లో పయనించాలన్నారు. పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నేతలు కోగంటి రామారావు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సుమన్ రాక

మధురానగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర బీసీ ఐక్య వేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సినీ నటుడు సుమన్ హాజరవుతున్నట్లు బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు పీవీఎల్ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనింటికి వెళ్లి ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానం పలికిన స్పందించి రావడానికి అంగీకరించారన్నారు. బీసీల సమస్యలు, వాటి పరిష్కా రం పట్ల సుమన్‌కు మంచి అవగాహన ఉందన్నారు.

మేడ్‌కు సహకారం అందిస్తా

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

విద్యాధరపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగుల సంక్షేమం కోసం సమస్యలపై పోరాటం చేస్తున్న మేడ్ (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్)కు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తెలిపారు. శనివారం విద్యాధరపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈనెల 9న గుంటూరు ఏసీ కాలేజీ ఆవరణలో జరిగే మేడ్ 7వ రాష్ట్ర మహాసభ కరపత్రాన్ని మేడ్ ప్రతినిధులతో కలిసి ఆయన విడుదల చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మేడ్ ద్వారా తన దృష్టికి వచ్చిన దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ ఈనెల 9న గుంటూరు మేడ్ 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పలువురు ముఖ్య అతిథులు హాజరు కానున్నట్లు వివరించారు. మేడ్ నేతలు కె.పున్నారావు, జి.బా బు, పి.రాజు, ఎన్.కిరణ్, కె.మన్మథరావు, శాంతి, పద్మ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వర్ల రామయ్య.

ఫేక్‌బుక్

(5వ పేజీ తరువాయి)

ఎర వేయడం తాజా ఎత్తు. ఫేస్‌బుక్ వాడుకలోకి వచ్చిన కొత్తలో చాలామంది రిజిస్టరయ్యారు. అకౌంట్లు తెరిచారు. వారిలో కొంత మంది పాస్‌వర్డ్‌లను టైపు చేయకుండానే లాగిన్ పెట్టుకున్నారు. ఉపయోగించాక లాగవుట్ చేసేవారు కాదు. ఇప్పుడు ఇలాంటి అకౌంట్లనే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకుంటున్నారు. ఫేస్‌బుక్ అకౌంట్‌ను తెరిచి, కొన్నాళ్లు ఉపయోగించాక చనిపోయిన వారి అకౌంట్లలోకి తేలిగ్గా లాగిన్ అవుతున్నారు. వాటిద్వారా యువతులకు ట్రాప్ వేస్తున్నారు.

దోపిడీ ఇలా..

ఫేస్‌బుక్‌లో అకౌంట్లను తెరిచిన వ్యక్తులు చాలా సులువైన పాస్‌వర్డ్‌లను పెట్టుకునేవారు. చాలామంది వరుస సంఖ్యలను కానీ, పుట్టిన తేదీని కానీ సెట్ చేసుకునేవారు. అకౌంట్ భద్రతారీత్యా పటిష్టమైన పాస్‌వర్డ్‌లను సెట్ చేసుకోవాలని అన్ని సామాజిక మాధ్యమాలు ప్రచారం చేశాయి. కొంతమంది మార్చుకున్నప్పటికీ కొందరు మాత్రం అలాగే వదిలేశారు. కొంతమంది లాగిన్ అయ్యాక లాగవుట్ చేయలేదు. ఇలాంటి వాటిలో సజీవంగా లేని వ్యక్తుల అకౌంట్లను సైబర్ నేరగాళ్లు ఎంచుకుంటున్నారు. వాటిద్వారా వలలు విసురుతున్నారు. ముఖ్యంగా మ్యాట్రిమోనిలో ప్రొఫైల్ పెట్టిన యువతులను టార్గెట్ చేస్తున్నారు. చాటింగ్ చేస్తున్నారు. ఫోన్లలో మాట్లాడిన కొద్దిరోజులకే యువతులు వారి మాయలో పడిపోతున్నారు. ముక్కుముఖం తెలియని వ్యక్తి ఎక్కడినుంచో ఫోన్లలో చెబుతున్న మాటలన్నీ వాస్తవాలే అని నమ్మేస్తున్నారు. అవతలి వ్యక్తులు అడిగినంత మొత్తాన్ని ఖాతాల్లో జమ చేస్తున్నారు. నిండా మునిగాక విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు.

పాస్‌వర్డ్ పటిష్టంగా ఉండాలి

ఫేస్‌బుక్ ఒక్కటే కాదు.. మనం ఉపయోగిస్తున్న సామాజిక మాధ్యమాల అకౌంట్లు అన్నింటికీ పటిష్టమైన పాస్‌వర్డ్‌లు సెట్ చేసుకోవాలి. పాస్‌వర్డ్ బలహీనంగా ఉందంటే ఆ అకౌంట్ కచ్చితంగా సైబర్ నేరగాళ్లకు చిక్కుతుంది. పటిష్టమైన పాస్‌వర్డ్‌ను సెట్ చేసుకున్నప్పుడు దాన్ని బ్రేక్ చేయడానికి నేరగాళ్లకు చాలా సమయం పడుతుంది. ఒక ఇంట్లో ఎవరైనా ఫేస్‌బుక్ ఉపయోగించాక చనిపోతే.. ఆ అకౌంట్ గురించి మాకు తెలియజేస్తే ఎఫ్‌బీకి లేఖ రాస్తాం.

- గుణరాము, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

కొండంత దోపిడీ

(5వ పేజీ తరువాయి)

విచారణ జరుపుతామన్నారు. జగనన్న కాలనీల మెరక పేరుతో జరిగిన దోపిడీపై అప్పట్లో వైసీపీ నేతలే నాటి సీఎం జగన్‌కు 4 పేజీల లేఖ రాశారు. మెరక పేరుతో ఇబ్రహీంపట్నం మండలంలోనే రూ.9.23 కోట్లు దోచేశారన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి, ఈలప్రోలు, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, జూపూడి, కాచవరం, కేతనకొండ గ్రామాల్లోని జగనన్న ఇళ్ల స్థలాలను మెరక చేసే పనిని ఉపాధి హామీ పథకం ద్వారా మైలవరం నియోజకవర్గ వైసీపీ నాయకులు దక్కించుకున్నారు.

అడ్డగోలు తీర్మానాలు

ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఆర్.దివాకర్ అధ్యక్షతన 2020, జనవరి 27న జరిగిన పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. ఇందులో 102వ ఐటమ్‌గా జగనన్న కాలనీల కోసం కొండపల్లి పంచాయతీ పరిధిలో సేకరించిన 30.34 ఎకరాలను ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి చేసేందుకు గ్రామసభ ఆమోదం తెలిపిందంటూ తీర్మానాన్ని ఆమోదించారు. 103వ ఐటమ్‌గా ఈ అభివృద్ధి పనులను వేగినేటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి ఇవ్వాలని తీర్మానించారు. ఈ సభ జనవరి 27 ఉదయం 11 గంటలకు జరిగినట్లు రికార్డుల్లో పేర్కొనగా, అదే సమయంలో పంచాయతీ సాధారణ సమావేశం కూడా జరిగినట్లు పేర్కొనడం గమనార్హం. ఆ తర్వాత జగనన్న కాలనీల మెరక పేరుతో ఎక్కడపడితే అక్కడ ఎడాపెడా గ్రావెల్ తవ్వకాలు జరిపారు. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో దేవదాయ భూములతో పాటు అటవీ భూముల్లోనూ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి ప్రభుత్వానికి చెందిన సహజ సంపదను దోచేశారు. పైగా అక్రమంగా తవ్విన మట్టిని తిరిగి ప్రభుత్వానికి విక్రయించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. సదరు వెంకటేశ్వరరావుకు తొలి విడత మొదటి నిధుల బదిలీ ఆదేశాల(ఎఫ్‌టీవో)ను 2020, మే 9న జారీ చేశారు. అప్పటి నుంచి విడతలవారీగా రూ.2.09 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత మరో రూ.7.14 కోట్లు చెల్లించారు. ఒక్క ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు రూ.9.23 కోట్లను మెరక పేరుతో కొల్లగొట్టేశారు. మైలవరం నియోజకవర్గం మొత్తం ఇదేస్థాయిలో దోపిడీ జరిగింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అమరావతి ఐఆర్ఆర్‌లో మరో ముందడుగు

(5వ పేజీ తరువాయి)

తాడేపల్లి, నున్న దగ్గర ఐఆర్ఆర్ టచ్ చేస్తుంది. ఐఆర్ఆర్ కోసం మొత్తంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని 41 గ్రామాల్లో భూములను సేకరించాల్సి ఉంది.

ఐఆర్ఆర్ వెళ్లే గ్రామాలు ఇవీ..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అమరావతి మండలంలో ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, దుగ్గిరాల మండలంలో తుమ్మపూడి, మంగళగిరి మండలంలో చినకాకాని, చినవడ్లపూడి, కాజా, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ మండలంలో కంతేరు, మోతడక, తాడికొండ, తుళ్లూరు మండలంలో అనంతవరం, హరిశ్చంద్రపురం, పెదపరిమి, వడ్లమాను గ్రామాలు ఉంటాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో జి.కొండూరు మండలం కవులూరు, వెలగలేరు, గన్నవరం మండలంలో రామచంద్రాపురం, సావారిగూడెం, వెదురుపావులూరు, ఇబ్రహీంపట్నం మండలంలో దాములూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కేతనకొండ, కొండపల్లి, కొటికలపూడి, న వీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, పెనమలూరు మండలంలో చోడవరం, గంగూరు, పెనమలూరు, పోరంకి, విజయవాడ రూరల్ మండలంలో దొనె ఆత్కూరు, నిడమానూరు, నున్న, పాతపాడు, కొత్తూరు తాడేపల్లి గ్రామాలున్నాయి.

రాజధాని అంతర్గత రోడ్లు ఐఆర్ఆర్‌కు అనుసంధానం

అమరావతి రాజధానిలో మొత్తం 27 అంతర్గత రోడ్లను 87.19 కిలోమీటర్ల మేర ఐఆర్ఆర్‌కు అనుసంధానించటానికి గతంలో సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై అప్పట్లోనే రాజధాని ప్రాంత గ్రామాల ప్రజలతో సమావేశాలు కూడా నిర్వహించారు. వారి సూచనలు, అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే డీపీఆర్ రూపకల్పన దిశగా అప్పటి ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రస్తుతం ఏ పద్ధతిలో భూములను తీసుకోవాలన్న దానిపై అత్యున్నత ప్రతిపాదనలను అందించేందుకు సీఆర్‌డీఏ కన్సల్టెన్సీని నియమిస్తోంది.



పెద్దనాన్న మాటతో నమ్మకం మరింత పెరిగింది


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'మట్కా'. మీనాక్షి చౌదరి హీరోయిన్. విజయేందర్ రెడ్డి తీగల, రజని తాళ్లూరి నిర్మాతలు. ఈనెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ' వాసు అనే వ్యక్తి ప్రయాణమే ఈ కథ. 1958లో చిన్నతనంలోనే శరణార్థిగా బర్మా నుంచి వైజాగ్ వస్తాడు. అక్కడి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ 'మట్కా' కింగ్‌లా ఎలా మారాడనేది కథ. వంద శాతం ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుంది. పెద్దనాన్న చిరంజీవికి వారం క్రితం ట్రైలర్ చూపించా. నచ్చింది, మాస్‌గా ఉందన్నారు. దాంతో నా నమ్మకం మరింత బలపడింది. సినిమాలో మీనాక్షి పాత్ర కీలకమైంది. వాసు దగ్గర ఏమీ లేనప్పుడు ఆమె అండగా నిలుస్తుంది. నటనకు ఆస్కారం ఉండే పాత్రలు చేయాలన్నదే నా కోరిక. 'గద్దలకొండ గణేశ్' తర్వాత అలాంటి ప్రాజెక్ట్ దొరకలేదు. గత మూడు చిత్రాలు సరిగ్గా ఆడలేదు. విభిన్నమైన సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో కరుణకుమార్ ఈ కథ చెప్పారు. నా గత చిత్రాలు విడుదల కాకముందే ఈ సినిమా ఓకే చేశా. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ'రతన్ ఖత్రీ అనే గ్యాంబ్లర్ స్టోరీని ఆధారంగా చేసుకొని 'మట్కా' అనే ఫిక్షనల్ కథను సిద్ధం చేశా. అలాంటి వ్యక్తి వైజాగ్‌లో పుడితే ఎలా ఉంటుంది? అనేదానికి కమర్షియల్ హంగులు జోడించి తీర్చిదిద్దాం' అని చెప్పారు. నిర్మాత విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఫస్ట్ డే కథ విన్నప్పుడు ఎంత థ్రిల్ ఫీలయ్యానో ఈ టీజర్ చూసి అంతకంటే గొప్ప అనుభూతి పొందాను. సినిమా బాగా వచ్చింది' అని ప్రశంసించారు.

ఇంట్లో అబ్బాయిలా అక్కున చేర్చుకున్నారు



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ మూవీ 'క'. తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్లు. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఘన విజయాన్ని అందించి ఈ దీపావళికి నాకు పెద్ద కానుక ఇచ్చారు. అందుకు అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. నన్ను గతంలో పక్కింటి కుర్రాడి ఇమేజ్‌తో ప్రేక్షకులు చూశారు. ఇప్పుడు మన ఇంటి అబ్బాయి అని భావిస్తున్నారు. ఈనెల 8న మలయాళంలో సినిమాను రిలీజ్ చేస్తున్నాం. తమిళనాట ఉన్న తెలుగు ప్రజలు తమకు షోస్ కావాలని అడుగుతున్నారు. ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ అయ్యాక తమిళనాట ఎందుకు రిలీజ్ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడులో షోస్ వేయాలని డిస్ట్రిబ్యూటర్ వంశీని అడుగుతున్నా. 'క' సినిమా విజయం నాకు గౌరవాన్ని తీసుకొచ్చింది. ఇది తమ విజయంగా భావిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఒక హీరోగా నాకు ఇంతకంటే ఏం కావాలి. సినిమాకు తప్పకుండా సీక్వెల్ చేస్తాం. అది కృష్ణగిరి ఊరి ప్రత్యేకతలతో ఉంటుంది' అని అన్నారు. 'ఫస్ట్ టైం డైరెక్టర్స్ అయిన మాకు 'క' వంటి బ్లాక్‌బస్టర్ తొలి చిత్రంతోనే దక్కడం చాలా సంతోషంగా ఉంది. 'క' ఒక కాంప్లికేటెడ్ సబ్జెక్ట్. ఇలాంటి స్క్రిప్ట్‌ను ప్రేక్షకులంతా ఆదరిస్తున్నారు' దర్శకులు సుజీత్, సందీప్ చెప్పారు. నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్ద సూపర్ హిట్ సినిమా తీసింది నేనేనా అని అనిపిస్తోంది. ఇంకా నమ్మకం కుదరడం లేదు. అందుకే సక్సెస్ కిక్ రావడం లేదు' అని అన్నారు.













సుధీర్ డబుల్

వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తెలుగు ఆటగాడు వాసంశెట్టి సుధీర్ కుమార్ రెండు పతకాలు సాధించాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో కాకినాడకు చెందిన సుధీర్ 75 కిలోల విభాగంలో డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్‌లో పతకాలు గెలిచాడు. తొలుత డెడ్‌లిఫ్ట్‌లో 120 కిలోల బరువెత్తి రజతం సొంతం చేసుకున్న సుధీర్, ఆ తర్వాత బెంచ్‌ప్రెస్‌లో 80 కిలోలతో పసిడి అందుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఫిబ్రవరి 25 నుంచి ఈజిప్టులో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌నకు సుధీర్ అర్హత సాధించాడు.

క్రిష వర్మకు స్వర్ణం

అండర్-19 వరల్డ్ బాక్సింగ్



కొలరాడో (యూఎస్): అండర్-19 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ క్రిష వర్మ స్వర్ణంతో మెరిసింది. మహిళల 75 కిలోల విభాగం ఫైనల్లో క్రిష 5-0తో సైమన్ లెరికా (జర్మనీ)పై గెలిచింది. కాగా, అంజలి (57 కిలోలు), విని (60 కి), ఆకాంక్ష (70 కి), చంచల్ చౌదరి (48 కి), రాహుల్ (పురుషుల 75 కి) ఫైనల్స్‌లో ఓడి రజతాలతో సరిపెట్టుకున్నారు.

ఒకే ఓవర్‌లో 37 పరుగులు

ఊతప్పను ఉతికారేసిన బొపార



హాంకాంగ్: భారత మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప బౌలింగ్‌ను ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ రవి బొపార ఉతికారేశాడు. ఒకే ఓవర్‌లో ఏకంగా 37 పరుగులతో చెలరేగాడు. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య శనివారం జరిగిన హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో ఈ పరుగుల పండుగ చోటుచేసుకుంది. ఊతప్ప వేసిన ఓవర్లో తొలి 5 బంతుల్లో బొపార 5 సిక్సర్లు బాదాడు. ఊతప్ప ఆరో బంతిని వైడ్‌గా వేయడంతో..అదనంగా మరో బంతి లభించింది. దానిని కూడా బొపార సిక్సర్‌గా మలచడంతో..ఓవర్‌లో 37 రన్స్ దక్కాయి. ఈక్రమంలో బొపార 14 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. దాంతో ఇంగ్లండ్ నిర్ణీత 6 ఓవర్లలో 120/1 స్కోరు చేసింది. ఛేదనలో ఊతప్ప కెప్టెన్సీలోని భారత్ 6 ఓవర్లలో 105/3కే పరిమితమై ఓటమిపాలైంది.

ఫైనల్లో మాళవిక

హైలో ఓపెన్



సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ హైలో ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సింగిల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. మాళవిక మహిళల సింగిల్స్‌లో ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో ఆరో సీడ్ మాళవిక 23-21, 21-18తో డెన్మార్క్ షట్లర్ జూలీ దావల్ జాకబ్‌సెన్‌పై విజయం సాధించింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో డెన్మార్క్‌కే చెందిన మియా బ్లిచ్‌ఫీల్డ్‌తో మాళవిక అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ ఆయుష్ శెట్టి పోరాటం సెమీఫైనల్‌కే పరిమితమైంది. అన్‌సీడెడ్ ఆయుష్ 17-21, 13-21తో 4వ సీడ్ క్రిస్టో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యాడు.



టైటాన్స్ అదుర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలుగు టైటాన్స్ ఈ సీజన్‌లో మూడో విజయాన్ని సాధించింది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 38-35తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. కెప్టెన్ పవన్ షెహ్రావత్ 14 పాయింట్లతో చెలరేగి టైటాన్స్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-37తో యూపీ యోధాస్‌పై నెగ్గి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది.

పొరపాటు పోస్ట్‌కు రవిశాస్త్రి సారీ!



ముంబై: టీమిండియా మాజీ కోచ్, వ్యాఖ్యాత రవిశాస్త్రి తాను చేసిన పొరపాటుకు బహిరంగ క్షమాపణ చెప్పాడు. అలనాటి భారత క్రికెటర్ నారీ కాంట్రాక్టర్ మరణించాడంటూ రవిశాస్త్రి ఎక్స్‌లో పోస్ట్ చేయడమే దీనికి కారణం. మూడో టెస్ట్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న శాస్త్రి శనివారం ఆట సమయంలో ఈ పొరపాటు ప్రకటన చేశాడు. దాంతో సోషల్‌మీడియాలో క్రికెట్ ఫ్యాన్స్ నుంచి కాంట్రాక్టర్ మృతికి సంతాపాలు వెల్లువెత్తాయి. అయితే తొలుత వచ్చిన వార్త నిజం కాదని, 90 ఏళ్ల కాంట్రాక్టర్ ఆరోగ్యంగానే ఉన్నారన్న వార్త వెలువడింది. వెంటనే తప్పు తెలుసుకున్న రవిశాస్త్రి ఆ పోస్ట్‌ను తొలగించాడు. 'ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. పొరపాటుగా పోస్ట్ చేసినందుకు క్షమించాలి' అని శాస్త్రి కోరాడు.

రెండు రోజుల్లోనే ఎన్ని మలుపులో.. శుక్రవారం ఆట ముగిసేసరికి భారత్‌కు మరో ఓటమి తప్పదా? అనిపించింది. కానీ మర్నాడే అన్ని విభాగాల్లో రాణించి ఏకంగా గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తోంది. పిచ్ ఎలాంటిదైనా డోంట్ కేర్ అనే తరహాలో రెచ్చిపోయిన రిషభ్ పంత్ జట్టు స్కోరును రాకెట్ వేగంతో పెంచగా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ క్లాసిక్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వీరి దెబ్బకు టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడం విశేషం. ఆ తర్వాత స్పిన్నర్ జడేజా మరోసారి ప్రతాపం చూపగా, అశ్విన్ సహకరించడంతో కివీస్ విలవిల్లాడింది. కేవలం 143 రన్స్ ఆధిక్యంలో ఉన్న ప్రత్యర్థి చేతిలో మరో వికెట్ మాత్రమే ఉంది. దీంతో మూడో టెస్టు కూడా మూడు రోజుల్లోనే ముగియడం ఖాయమనిపిస్తోంది.



గిల్ (90)
పంత్ (60)

భారత్ తొలి ఇన్నింగ్స్ 263

మ్యాచ్‌ను తిప్పేశారు

ఆదుకున్న గిల్, పంత్

కివీస్ రెండో ఇన్నింగ్స్ 171/9

జడేజాకు నాలుగు, అశ్విన్‌కు మూడు వికెట్లు


జడేజా (4/52)

ముంబై: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో మొదటిసారి భారత జట్టు ఆధిపత్యం కనబరచింది. తొలి రోజు చివర్లో బ్యాటర్లు తడబాటుకు గురైనా.. శనివారం మాత్రం సూపర్ బ్యాటింగ్, బౌలింగ్‌తో టెస్టును మనవైపు తిప్పేశారు. ముందుగా భారత్‌కు 28 పరుగుల స్వల్ప ఆధిక్యమైనా దక్కిందంటే శుభ్‌మన్ గిల్ (90), రిషభ్ పంత్ (59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 60)ల ఆటతీరే కారణం. వీరి కీలక ఆటతీరుతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. చివర్లో వాషింగ్టన్ సుందర్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) ఆకట్టుకున్నాడు. స్పిన్నర్ ఎజాజ్‌కు 5 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కివీస్‌ను స్పిన్నర్లు జడేజా (4/52), అశ్విన్ (3/63) దెబ్బతీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి పర్యాటక జట్టు 43.3 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులే చేయగలిగింది. విల్ యంగ్ (51) అర్ధసెంచరీ చేశాడు. క్రీజులో ఎజాజ్ (7) ఉన్నాడు. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ఆధిక్యంలో ఉంది. బంతి చక్కగా టర్న్ అవుతున్నందున కివీస్‌ను తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలి. లక్ష్యం 200లోపే ఉండడం భారత్‌కు శ్రేయస్కరం. ఓవరాల్‌గా శనివారం 15 వికెట్లు నేలకూలాయి.

అటు దూకుడు.. ఇటు నిలకడ: ఓవర్‌నైట్ స్కోరు 86/4తో పీకల్లోతు కష్టాల్లో పడిన భారత జట్టు.. భారమంతా గిల్, పంత్‌పై వేస్తూ రెండో రోజును ఆరంభించింది. మరో రెండు వికెట్లు కోల్పోతే మ్యాచ్ పూర్తిగా ప్రత్యర్థి చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉండేది. అయితే సీనియర్లకు బ్యాటింగ్ కష్టమైన టర్నింగ్ పిచ్‌పై గిల్, పంత్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా పంత్ చావోరేవో అన్నట్టుగా బ్యాట్ ఝుళిపించాడు. భారీషాట్లతో కివీస్ బౌలర్లను డిఫెన్స్‌లో పడేశాడు. రోహిత్, విరాట్ సైతం దూకుడుగా ఆడేందుకు ఇబ్బందిపడినా పంత్ మాత్రం సహజశైలిలో ఎదురుదాడికి దిగాడు. తొలి రెండు బంతులను బౌండరీలకు తరలించి తన ఉద్దేశాన్ని చాటాడు. బంతి టర్న్ కావడంతో పాటు ఒక్కోసారి అనూహ్యంగా బౌన్స్ అవుతున్నా తగ్గేదేలే.. అనే రీతిలో 8 ఫోర్లతో పాటు రెండు సిక్సర్లు బాదాడు. దీంతో పంత్ 36 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ సాధికారిక ఆటతీరు కూడా పంత్ వేగంగా ఆడేందుకు తోడ్పడింది. ఐదు వికెట్లతో దెబ్బతీసిన ఎజాజ్‌ను సైతం అతను వదల్లేదు. లంచ్‌కు కాస్త ముందు ఐదో వికెట్‌కు గిల్‌తో కలిసి 96 పరుగులు జోడించాక స్పిన్నర్ సోధి ఓవర్‌లో పంత్ వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. వరుస ఓవర్లలో జడేజా (14), సర్ఫరాజ్ (0) పెవిలియన్‌కు చేరగా.. సెంచరీకి చేరువలో గిల్ ఎనిమిదో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ స్థితిలో సుందర్ కివీస్ స్కోరును సమం చేయడంతో పాటు సోధి ఓవర్‌లో 4,6తో జట్టుకు ఆధిక్యాన్ని కూడా అందించాడు. అయితే 60వ ఓవర్‌లో ఆకాశ్‌దీప్ (0) రనౌట్ కావడంతో భారత్ 83 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది.

దెబ్బతీసిన స్పిన్ జోడీ: భారత స్పిన్నర్లు జడేజా, అశ్విన్ కలిసికట్టుగా కివీస్‌ను కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో చెలరేగిన జడేజా కివీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ మెరవగా, అశ్విన్ ఈసారి మూడు వికెట్లతో ఖాతా తెరిచాడు. మొత్తంగా ఈ ఇద్దరూ కలిసి ఏడు వికెట్లు తీశారు. మరోవైపు తొలి ఓవర్‌లోనే పేసర్ ఆకాశ్ అద్భుత ఇన్‌స్వింగర్‌తో ఓపెనర్ లాథమ్ (1)ను బౌల్డ్ చేశాడు. కాన్వే (22) కుదురుకున్నట్టు కనిపించినా సుందర్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే రచిన్ రవీంద్ర (4)ను అశ్విన్ అవుట్ చేసి ఈ టెస్టులో తొలి వికెట్ సాధించాడు. ఈ దశలో కివీస్‌ను యంగ్, మిచెల్ (21) కాసేపు ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించాక మిచెల్‌ను అవుట్ చేసిన జడేజా తిరిగి తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. బ్లండెల్ (4), సోధి (8), హెన్రీ (10)లను అవుట్ చేసి కివీస్‌ను వణికించాడు. అటు కీలక ఇన్నింగ్స్ ఆడిన యంగ్ ఎనిమిదో వికెట్‌గా అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఉన్న కాసేపు ఫిలిప్స్ (14 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 26) వేగంగా ఆడాడు.

3 తాజా డబ్ల్యూటీసీలో ఎక్కువ వికెట్లు (50) తీసిన మూడో బౌలర్‌గా జడేజా. ఓవరాల్‌గా అశ్విన్ (62), హాజెల్‌వుడ్ (51) టాప్-2లో ఉన్నారు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఎజాజ్ 30; రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18; గిల్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 90; సిరాజ్ (ఎల్బీ) ఎజాజ్ 0; విరాట్ (రనౌట్) 4; పంత్ (ఎల్బీ) సోధీ 60; జడేజా (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 14; సర్ఫరాజ్ (సి) బ్లండెల్ (బి) ఎజాజ్ 0; సుందర్ (నాటౌట్) 38; అశ్విన్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 6; ఆకాశ్ దీప్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 59.4 ఓవర్లలో 263 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-25, 2-78, 3-78, 4-84, 5-180, 6-203, 7-204, 8-227, 9-247, 10-263. **బౌలింగ్:** హెన్రీ 8-1-26-1; ఓరోర్క్ 2-1-5-0; ఎజాజ్ 21.4-3-103-5; ఫిలిప్స్ 20-0-84-1; రచిన్ 1-0-8-0; సోధీ 7-0-36-1.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బి) ఆకాశ్ 1; కాన్వే (సి) గిల్ (బి) సుందర్ 22; యంగ్ (సి అండ్ బి) అశ్విన్ 51; రచిన్ (స్టంప్) పంత్ (బి) అశ్విన్ 4; మిచెల్ (సి) అశ్విన్ (బి) జడేజా 21; బ్లండెల్ (బి) జడేజా 4; ఫిలిప్స్ (బి) అశ్విన్ 26; సోధి (సి) కోహ్లీ (బి) జడేజా 8; హెన్రీ (బి) జడేజా 10; ఎజాజ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 43.3 ఓవర్లలో 171/9; వికెట్ల పతనం:** 1-2, 2-39, 3-44, 4-94, 5-100, 6-131, 7-148, 8-150, 9-171; **బౌలింగ్:** ఆకాశ్ 5-0-10-1; సుందర్ 10-0-30-1; అశ్విన్ 16-0-63-3; జడేజా 12.3-2-52-4.

8వ నెంబర్‌లో ఎందుకు?


సర్ఫరాజ్

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దించడం చర్చనీయాంశమైంది. అద్భుత ఫామ్‌లో ఉన్న అతడిపై టీమ్ మేనేజ్‌మెంట్ సరైన నిర్ణయం తీసుకోలేదని వ్యాఖ్యాత మంజ్రేకర్ తప్పుపట్టాడు. 'కెరీర్ తొలి మూడు టెస్టుల్లోనూ అర్ధసెంచరీలు సాధించడంతో పాటు బెంగళూరు టెస్టులో 150 రన్స్ సాధించాడు. స్పిన్‌నూ మెరుగ్గా ఆడగలడు. కేవలం కుడి-ఎడమ కాంబినేషన్ కోసం సర్ఫరాజ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందించడంలో అర్థముందా?' అని ఎక్స్‌లో ప్రశ్నించాడు. ఈస్థానంలో సర్ఫరాజ్ నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్‌గా వెనుదిరిగాడు. వాంఖడేలో ఆడిన చివరి ఆరు దేశవాళీ ఇన్నింగ్స్‌లో ఈ ముంబైకర్ ఓ ట్రిపుల్ శతకం సహా 601 రన్స్ చేయడం విశేషం.



వావ్.. అశ్విన్

కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లతో రాణించిన స్పిన్నర్ అశ్విన్ ఫీల్డింగ్‌లోనూ మెరిశాడు. మిచెల్, యంగ్ భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో అతడి అద్భుత క్యాచ్ కివీస్‌ను దెబ్బతీసేలా చేసింది. జడేజా ఓవర్‌లో మిచెల్ ఆడిన భారీ షాట్ గాల్లోకి లేవగా.. మిడాన్ నుంచి వెనక్కి పరిగెడుతూ 38 ఏళ్ల అశ్విన్ పట్టిన ఆ డైవింగ్ క్యాచ్ అదుర్స్ అనిపించింది. మరోవైపు దీన్ని అతడి కెరీర్‌లోనే గ్రేటెస్ట్ క్యాచ్‌గా నెటిజన్లు కొనియాడారు.

2 వాంఖడేలో ఎక్కువ వికెట్లు (19) తీసిన రెండో పర్యాటక జట్టు బౌలర్ ఎజాజ్ పటేల్. ఇయాన్ బోథమ్ (22) ముందున్నాడు.



కొత్త సంవత్‌లోనూ గోల్డ్ జిగేల్!

ఇన్వెస్టర్లకు మళ్లీ రెండంకెల్లో రిటర్నులు!! ● 2025లో ఔన్సు 3,000 డాలర్లకు...

సంవత్ 2081పై విశ్లేషకుల అంచనా

న్యూఢిల్లీ: శుక్రవారంతో ప్రారంభమైన హిందూ సంప్రదాయ సంవత్సరం 'సంవత్ 2081'లోనూ బంగారం ఇదే ర్యాలీని కొనసాగిస్తుందా...అన్న ప్రశ్నకు అవుననే అంటున్నారు బులియన్ మార్కెట్ విశ్లేషకులు. ఈ సంవత్‌లోనూ బంగారం పెట్టుబడులు ఇన్వెస్టర్లకు రెండంకెల్లో రాబడులు అందించవచ్చునని కేడియా క్యాపిటల్ డైరెక్టర్ అజయ్ కేడియా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం 2,750 డాలర్ల స్థాయిలో ట్రేడవుతున్న ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 2025లో 3,000 డాలర్ల స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేశారు. 'సవంత్ 2080' సంవత్సరంలో ఇన్వెస్టర్లకు బంగారం 32 శాతం, వెండి 39 శాతం రాబడులు అందించాయి. గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో (ఈటీఎఫ్) ఇన్వెస్ట్ చేసిన వారికి కూడా 30 శాతం వరకు రాబడి వచ్చింది. ఈ జూలైలో కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకం 9 శాతం తగ్గించడంతో మార్కెట్లో ధరలు 9 శాతం తగ్గినప్పటికీ, ఏడాది కాలంలో లోహం విలువ మూడో వంతు మేర పెరగడం గమనార్హం. సంవత్ 2067 (2011 తర్వాత) పసిడి ఇన్వెస్టర్లకిదే అత్యధిక రిటర్న్. కాగా, గత సంవత్‌లో సెన్సెక్స్ 25 శాతం, నిఫ్టీ 27 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేయగలిగాయి.

ఆ రెండు పరిణామాలతోనే బూస్ట్

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం బంగారం ర్యాలీకి ఆజ్యం పోశాయి. ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో సద్దుమణిగేలా కన్పించడం లేదు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కూడా ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు మున్ముందు పరపతి సమీక్షల్లో ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశాలున్నాయి. ఈ రెండు కారణాలతో పసిడి, వెండి ధరలు మరింత జోరుగా పరుగులు తీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎలాంటి అనిశ్చితి లేదా సంక్షోభ సమయంలో అయినా భద్రమైన పెట్టుబడి సాధనంగా బంగారం నిలవడమే ఇందుకు దోహదపడుతున్న అంశం. పైగా, పసిడి-వడ్డీ రేట్లది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిరాదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి. కాగా, చైనా ఆర్థిక, పారిశ్రామిక మందగనం నుంచి బయటపడేందుకు భారీగా ఉద్దీపనలు ప్రకటించింది. దాంతో ఆ దేశ పారిశ్రామికోత్పత్తి అవసరాలకు వెండి వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని, ఫలితంగా రేటు కూడా పుంజుకోవచ్చన్న అంచనాలున్నాయి.

బిజినెస్

నాలుగేళ్లలో రూ.6,100 కోట్ల పెట్టుబడి

11 ప్రాంతాల్లో అపోలో ఆస్పత్రులు

ముంబై: అపోలో హాస్పిటల్స్ ముంబైలోని వోర్లి, చెన్నైలోని పాత మహాబలిపురం రోడ్డు ప్రాంతాల్లో రెండు భారీ ఆస్పత్రులు ఏర్పాటు చేయనుంది. ముంబై ఆస్పత్రి 575 పడకలు, చెన్నై ఆస్పత్రి 600 పడకలు కలిగి ఉంటాయి. రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో దేశంలోని 11 ప్రాంతాల్లో రూ.6,100 కోట్ల పెట్టుబడితో ఆస్పత్రులు ఏర్పాటు చేయడం ద్వారా నూతనంగా 3,512 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు సంస్థ ప్రకటించింది. వోర్లిలో ఆస్పత్రి ఏర్పాటుకు శనివారం కంపెనీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇవి కాక వారణాసి (400 పడకలు), లక్నో (200), పూణెలోని రాయల్ ముధోల్ (400), కోల్కతాలోని సోనార్‌పూర్ (270), హైదరాబాద్‌లోని గచ్చిబౌలి (375), ఎన్‌సీఆర్‌లోని గురుగ్రామ్ (510), మైసూర్‌లోని మల్లేశ్వరం (140), ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ (42) ప్రాంతాల్లో అపోలో ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయి. ముంబై ఆస్పత్రిని నాలుగు సంవత్సరాల్లో ప్రారంభించాలని భావిస్తున్నామని సంస్థ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

ఏసీఐ కొత్త ప్రెసిడెంట్‌గా కిశోర్

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, ఎస్‌జీకే కిశోర్ ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) ఆసియా పసిఫిక్, పశ్చిమాసియా విభాగం ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన ఆయన పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన ఆ పదవిలో రెండు సంవత్సరాల కాలం కొనసాగుతారు. విమానయాన పరిశ్రమ తదుపరి వృద్ధి పథంలోకి అడుగు పెడుతున్న ఈ వాతావరణంలో విమానాశ్రయాల ఆర్థిక, పర్యావరణ సుస్థిరతకు, ఇన్నోవేషన్‌కు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా కిశోర్ చెప్పారు. కిశోర్‌ను ప్రస్తుత ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయెల్ మెనాంటూ అభినందించారు. 47 సభ్యదేశాలకు చెందిన 600 విమానాశ్రయాలు ఏసీఐ ఏపీఏసీ అండ్ ఎంఐడీ పరిధిలోకి వస్తాయి. 2042 నాటికి ఈ ప్రాంతాల నుంచి విమాన ప్రయాణికుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 340 కోట్ల నుంచి 970 కోట్లకు చేరుతుందని అంచనా.

రూ.1.14 లక్షల కోట్లు వెనక్కి

- అక్టోబరులో ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణ
- మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకిదే అత్యధికం..



ముంబై: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత నెలలో స్టాక్ మార్కెట్ నుంచి 1,350 కోట్ల డాలర్ల (రూ.1,13,859 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇప్పటివరకు ఒక నెల రోజుల వ్యవధిలో సెకండరీ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న అత్యధిక నిధుల రికార్డు ఇదే. అయితే, ఈ అక్టోబరులో ఎఫ్‌పీఐలు ప్రైమరీ మార్కెట్లో మాత్రం రూ.19,842 కోట్ల పెట్టుబడులు పెట్టారు. దీన్ని మినహాయిస్తే, దేశీయ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐల నికర పెట్టుబడుల ఉపసంహరణ రూ.94,017 కోట్లుగా నమోదైంది. కొవిడ్ సంక్షోభ కాలంలో (2020 మార్చి) వెనక్కి తీసుకున్న రూ.61,973 కోట్ల నికర పెట్టుబడుల కన్నా కూడా ఇది అధికం. ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల కారణంగా గతనెలలో ఈక్విటీ సూచీలు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయిల నుంచి 8 శాతం మేర క్షీణించాయి.

- అక్టోబరులో ఎఫ్‌పీఐ నిధుల ఉపసంహరణ లోటును దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) భర్తీ చేశారు. క్యాష్ మార్కెట్లో డీఐఐలు రూ.98,400 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు.
- అక్టోబరు 31తో ముగిసిన 'సంవత్ 2080"లో డీఐఐలు క్యాష్ మార్కెట్లో ఏకంగా రూ.4.64 లక్షల కోట్ల పెట్టుబడులు గుమ్మరించారు. ఈ జనవరి, ఏప్రిల్, మే, అక్టోబరులో ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల కారణంగా ఏర్పడిన నష్టాలను డీఐఐల పెట్టుబడులు పూడ్చగలిగాయి.
- ఈ జనవరి-సెప్టెంబరు మధ్యకాలానికి నికర పెట్టుబడులు రూ.లక్ష కోట్ల స్థాయిలో ఉన్నాయి. అక్టోబరులో ఏకంగా రూ.1.14 లక్షల కోట్లు వెనక్కి తీసుకోవడంతో గడిచిన 10 నెలల కాలానికి వారి నికర పెట్టుబడులు గణనీయంగా తగ్గి రూ.6,593 కోట్లకు పరిమితమయ్యాయి.

అధిక రాబడులపై ఆశతోనే...

ఎఫ్‌పీఐలు తాము వెనక్కి తీసుకున్న పెట్టుబడులను అమెరికన్ బాండ్ మార్కెట్లోకి, చైనా స్టాక్ మార్కెట్లోకి తరలించారు. అమెరికా డాలర్ విలువతో పాటు బాండ్ల రిటర్నుల రేటు గణనీయంగా పెరగడం, చైనా ఈక్విటీలు ఆకర్షణీయ ధరకు లభిస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. దేశీయ మార్కెట్ సూచీలతో పాటు అనేక కంపెనీల షేర్లు ఆల్‌టైం గరిష్ఠాల వద్ద ట్రేడవుతుండటం, రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశాజనకంగా ఉండడంతో ఎఫ్‌పీఐలు పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారని విశ్లేషకులు పేర్కొన్నారు.

తాత్కాలిక పరిణామమే.. : ఎఫ్‌పీఐల పెట్టుబడుల ఉపసంహరణ తాత్కాలికమేనని మార్కెట్ నిపుణులన్నారు. భారత ఈక్విటీల్లో ఎఫ్‌పీఐలు మొత్తం 80,000 కోట్ల డాలర్ల (రూ.67.20 లక్షల కోట్లు) పెట్టుబడులను కలిగి ఉన్నారని.. గతనెలలో వెనక్కి తీసుకున్నది కేవలం 1.7 శాతమేనని వారు చెప్పారు. కాబట్టి, ఈ విషయంపై చిన్న ఇన్వెస్టర్లు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతేకాదు, స్టాక్ మార్కెట్ మొత్తం సంపదలో కేవలం 0.1 లేదా 0.2 శాతమేనని వారన్నారు. చాలా వరకు దేశీయ కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్న నేపథ్యంలో మార్కెట్ సూచీలు భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే, ప్రస్తుతం ఈ మాత్రం దిద్దుబాటు ఆవశ్యకమేనని వారు అభిప్రాయపడ్డారు. కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నేపథ్యంలో ఎఫ్‌పీఐల అమ్మకాలు మరికొంత కాలం కొనసాగవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అన్నారు. అయితే, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెరుగైతే మన మార్కెట్లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడులు మళ్లీ పుంజుకోవచ్చని అబాకస్ అసెట్ మేనేజ్‌మెంట్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకులు సునీల్ సింఘానియా ఆశాభావం వ్యక్తం చేశారు.

వచ్చే బుధవారం స్విగ్గీ ఐపీఓ



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ఇటీవల కాలంలో తీవ్ర ఆటుపోట్లు, భారీ నష్టాల్లో ట్రేడవుతున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగుతోంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 127 పబ్లిక్ ఇష్యూలు జారీ కావడమే ఇందుకు తార్కాణం. వచ్చే వారంలోనూ అదే జోరు కొనసాగనుంది. సోమవారం ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్ ఎక్స్ఛేంజిల్లో తమ షేర్లను లిస్టింగ్ చేయనుంది. కాగా ఫుడ్ డెలివరీ విభాగంలోని స్విగ్గీ, సెజిలిటీ ఇండియా, ఆక్మే సోలార్ పబ్లిక్ ఇష్యూలతో మార్కెట్ తలుపులు తట్టనున్నాయి. వీటితో పాటు గా ఎస్ఎంఈ విభాగంలో నీలం లినెన్స్ అండ్ గార్మెంట్స్ కంపెనీ వచ్చే శుక్రవారం పబ్లిక్ ఇష్యూ జారీ చేయనుంది.

స్విగ్గీ: ఆన్‌లైన్‌లో ఆహార ఆర్డర్ల ఆధారంగా రెస్టారెంట్ల నుంచి కస్టమర్లకు రుచికరమైన ఆహారాన్ని వారింటికే చేరవేసే స్విగ్గీ రూ.11,327.43 కోట్ల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందులో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో రూ.1 ముఖవిలువ గల 17,50,87,863 ఈక్విటీ షేర్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం 11,53,58,974 తాజా ఈక్విటీ షేర్లను ప్రైమరీ మార్కెట్లో విడుదల చేస్తోంది. ధరల శ్రేణి రూ.371-390 కాగా ఒక్కో లాట్‌లో 38 షేర్లుంటాయి. అంటే కనీస పెట్టుబడి రూ.14,820 అవుతుంది. రిటైల్ ఇన్వెస్టర్లకు ఇష్యూ బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది. వచ్చే సోమవారం నాటికి షేర్ల కేటాయింపు పూర్తి చేసి నవంబరు 13వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేసే ఆస్కారం ఉంది.

సెజిలిటీ ఇండియా: పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఇష్యూకి వస్తున్న ఈ కంపెనీ రూ.2,106.60 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఒక్కోటి రూ.10 ముఖవిలువ గల 70,21,99,262 ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఇన్వెస్టర్లు కనీసం 500 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్ చేయడానికి కనీస మొత్తం రూ.15,000. రూ.28-30 ధరల శ్రేణిలో ఒక్కో లాట్ 157 షేర్లుంటాయి. ఇష్యూ మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది. శుక్రవారం నాటికి షేర్ల కేటాయింపు పూర్తి చేస్తారు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో ఈ షేర్లను 12వతేదీన లిస్టింగ్ చేస్తారు.

ఆక్మే సోలార్ హోల్డింగ్స్ : రూ.2,900 కోట్ల విలువ గల ఈ ఇష్యూ బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.275-289గా నిర్ణయించారు. ఒక్కో లాట్‌లో 51 షేర్లుంటాయి. అంటే కనీస పెట్టుబడి రూ.14,739. షేర్ల కేటాయింపు 11వ తేదీ నాటికి పూర్తి చేసి 13న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేయనున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	123
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	109	అనంతపురం	115
గోదావరి	123		

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మీట్ మీ నెక్ట్స్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 06
అవుటర్ బ్యాంక్స్ 4	వెబ్‌సిరీస్ 2	నవంబర్ 07
మిస్టర్ ప్లాంక్టన్	కొరియన్ సిరీస్	నవంబర్ 08
ది బకింగ్‌హమ్ మర్డర్స్	హిందీ చిత్రం	నవంబర్ 08
ఉమ్జోలో	హాలీవుడ్ మూవీ	నవంబర్ 08
వేట్టయాన్	తెలుగు డబ్బింగ్	నవంబర్ 08
విజయ్ 69	హిందీ చిత్రం	నవంబర్ 08
ఆర్కేన్ 2	యానిమేషన్ సిరీస్	నవంబర్ 09
ఇట్ ఎండ్స్ విత్ అజ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 09
అమెజాన్ ప్రైమ్		
సిటాడెల్: హనీ బన్నీ	హిందీ సిరీస్	నవంబర్ 07
కౌంట్‌డౌన్: పాల్ వర్సెస్ టైసన్	వెబ్‌సిరీస్	నవంబర్ 07
ఇన్వెస్టిగేషన్ ఏలియన్	వెబ్‌సిరీస్	నవంబర్ 08
జియో సినిమా		
డెస్పికబుల్ మీ 4	తెలుగు డబ్బింగ్	నవంబర్ 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఎక్స్‌ప్లోరర్: ఎండ్యూరెన్స్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 03
అజయంతే రండం మోషనమ్	మలయాళ చిత్రం	నవంబర్ 08
ఆహా...		
జనక అయితే గనక	తెలుగు చిత్రం	నవంబర్ 08
బుక్ మై షో		
ట్రాన్స్‌ఫార్మర్స్ ఒన్	యానిమేషన్ మూవీ	నవంబర్ 06

సిటాడెల్ కోసం సీక్రెట్ ఏజెంట్స్



వరుణ్ ధావన్, సమంత లీడ్‌రోల్స్‌లో నటించిన హిందీ సిరీస్ 'సిటాడెల్: హనీబన్నీ'. 'ది ఫ్యామిలీ మాన్, ఫర్జీ లాంటి పాపులర్ వెబ్‌సిరీస్‌లను తెరకెక్కించిన రాజ్ అండ్ డీకే ద్వయం దర్శకత్వం వహించారు. హాలీవుడ్ వెబ్‌సిరీస్ 'సిటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. ఈ నెల 07 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. భారీ బడ్జెట్‌తో సైబీరియాలో తెరకెక్కిన ఈ సిరీస్ కోసం సమంత ప్రత్యేకంగా యుద్ధవిద్యల్లో తర్ఫీదు అయ్యారు. వరుణ్, సమంత ఇందులో సీక్రెట్ ఏజెంట్స్‌గా కనిపించనున్నారు. ఓ మిషన్ కోసం ఈ జోడీ చేసే యాక్షన్, రొమాన్స్, సెంటిమెంట్ అంశాలు ప్రేక్షకుల్ని అలరించనున్నాయి.



మరోసారి జంటగా... కథ కలిపింది కనువిందుగా

ఎప్పుడో ఇరవై, ముప్పై ఏళ్ల క్రితం వెండితెరపై జంటగా మెప్పించిన హీరోలు, హీరోయిన్లు వాళ్లంతా. చక్కని ప్రేమకథా చిత్రాలతో ఒకప్పుడు హిట్ ఫెయిర్‌గా బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించిన కాంబినేషన్ వారిది. ఇప్పుడు మళ్లీ దశాబ్దాల తర్వాత మళ్లీ జంటగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వయసుకు తగ్గ పాత్రలతో అలరించేందుకు మంచి కథ కుదిరింది, ఇక కనువిందే మిగిలింది అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మరోసారి జంటగా నటిస్తున్నారు అంటే ఆ హీరో హీరోయిన్ల కాంబినేషన్‌మీద ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఒకప్పుడు మెరిసిన సీనియర్ జంటలు సైతం ఇప్పుడు బాలీవుడ్ తెరపై సందడి చేస్తున్నాయి. సీనియర్ హీరోలకు జోడీగా సీనియర్ భామలు ఆడిపాడుతున్నారు.

బాలీవుడ్‌లో మరో సీనియర్ సంజయ్‌దత్‌తో రవీనాటాండన్ జంటగా నటించిన పలు చిత్రాలు బాక్సాఫీసు దగ్గర సందడి చేశాయి. 'జంగ్, ఆతిష్, విజేత, జీనా మర్నా తేరే సంగ్, క్షత్రియ' తదితర చిత్రాల్లో కలసి నటించగా కొన్ని చిత్రాలు



మంచి విజయాన్ని అందుకున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరూ కలసి నటించిన చిత్రం 'ఘుడ్‌చడీ'. 90ల నాటి ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ ఏడాది ఆగస్టులో ప్రముఖ ఓటీటీలో విడుదలవ్వగా సంజయ్, రవీనా జంట ప్రేక్షకులను మెప్పించింది.



రెండు తరాల ప్రేమకథలో ఈ మధ్యన వరుస అపజయాలతో అక్షయ్‌కుమార్ జోరు కొంచెం తగ్గింది. కానీ ఆయన చేతిలో మాత్రం ఎప్పుడూ నాలుగైదు సినిమాలు ఉంటున్నాయి. అలాగే అందం అభినయంతో బాలీవుడ్‌లో కథానాయికగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు రవీనా టాండన్. వీరిద్దరి జంట బాలీవుడ్‌లో హిట్ ఫెయిర్‌గా పేరు తెచ్చుకుంది. తొలిసారి వీరిద్దరూ జంటగా 'మొహ్రా' చిత్రంలో నటించారు. ఆ తర్వాత 'ఖిలాడియోంకా ఖిలాడి, కీమత్, దావా, బరూద్, పోలీస్ ఫోర్స్' చిత్రాల్లో కలసి కనిపించారు. తెరపైనే కాదు నిజజీవితంలోనూ ప్రేమలో పడ్డ ఈ జంట నిశ్చితార్థం చేసుకున్నాక విడిపోయింది. ఆ తర్వాత వీరిద్దరూ కలసి సినిమాలు చేయలేదు. ఇప్పుడు ఇరవై ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలసి నటించిన 'వెల్‌కమ్ టూది జంగిల్' చిత్రం ఈ ఏడాది క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ చిత్రంలో రవీనా, అక్షయ్ జంట మరోసారి అభిమానులను అలరించనుంది. అలాగే అక్షయ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'జాలీ ఎల్ఎల్‌బీ'లోనూ రవీనా కనిపించనున్నారు. అయితే ఈ చిత్రంలో ఆమె సునీల్‌శెట్టి భార్య పాత్రలో కనిపించనున్నారు.

గదర్ మేజిక్

2003లో వచ్చిన 'ది హీరో' చిత్రంతో తొలిసారి జంటగా కనిపించారు సన్నీడియోల్, ప్రీతీ జింటా. ఈ మధ్యలో వీరిద్దరి కలయికలో 'హీరోస్, భయ్యాజీ సూపర్‌హిట్' చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబినేషన్ కుదిరింది.



'లాహోర్ 1947' చిత్రంలో సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింటాతో కలసి సందడి చేయనున్నారు సన్నీడియోల్. అమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేశ విభజన నేపథ్యంలో సాగే కథ ఇది. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంచలన వసూళ్లతో బాలీవుడ్ చరిత్రలో నిలిచిపోయిన చిత్రం 'గదర్'. సన్నీడియోల్, అమీషా పటేల్ జంటగా నటించారు. ఆ చిత్రానికి కొనసాగింపుగా రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన 'గదర్ 2' చిత్రంలోనూ సన్నీడియోల్, అమిషా పటేల్ జంట కనువిందు చేసింది. తొలిభాగానికి లభించిన స్థాయిలోనే రెండో భాగానికి సైతం వసూళ్లు దక్కడం విశేషం.

సింగం శ్రీమతిగా

అజయ్‌దేవ్‌గణ్, కరీనా కపూర్ తొలిసారి 2006లో వచ్చిన 'ఓంకార' చిత్రంలో జంటగా నటించారు. ఆ తర్వాత వారి కాంబినేషన్‌లో 'యువ, గోల్‌మాల్ రిటర్న్స్, గోల్‌మాల్ 3, సత్యాగ్రహ' చిత్రాలు వచ్చాయి. ఆ అవన్నీ దాదాపు బాక్సాఫీసు దగ్గర మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు 'సింగం ఎగైన్' చిత్రంతో దీపావళికి ఈ జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 2014లో వచ్చిన 'సింగం రిటర్న్స్' చిత్రంలో అజయ్ భార్య పాత్రలో కరీనా కనిపించగా ఇప్పుడు 'సింగం ఎగైన్'లోనూ ఆమె అదే పాత్రను పోషించారు.

'తలాష్, త్రీ ఇడియట్స్' చిత్రాల్లో జంటగా కనిపించారు ఆమిర్‌ఖాన్, కరీనాకపూర్. ఆ తర్వాత 'బాంబే టాకీస్' చిత్రంలో ఓ పాటలో వీరిద్దరూ అతిథి పాత్రల్లో కనిపించారు. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత వీరిద్దరూ కలసి నటించిన 'లాల్‌సింగ్ చద్దా' 2022లో విడుదలైంది. బాక్సాఫీసు దగ్గర నిరాశపరిచినా కానీ ఈ జంటకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి.





ఇక టబు, అజయ్ దేవ్‌గణ్ జంట గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. వారిది బాలీవుడ్‌లో హిట్ ఫెయిర్. వారిద్దరి కలయికలో తొమ్మిది సినిమాలు రాగా వాటిలో విజయాల శాతం ఎక్కువే. 'దృశ్యం, గోల్‌మాల్ అగైన్, విజయ్‌పథ్, హకీకత్, దేదే ప్యార్‌దే' తదితర చిత్రాల్లో నటించారు. వీరిద్దరి కలయికలో తెరకెక్కిన 'ఆరోమే కహాన్ దమ్ థా' చిత్రం ఇటీవలే విడుదలైంది.

ముఖంపై ముడతలు నివారించండిలా

వయసు పెరిగేకొద్దీ చర్మంపై ముడతలు సహజం. కానీ ప్రస్తుతం చిన్నవయసువారిని కూడా ఈ సమస్య వేధిస్తోంది. చర్మంలో కొల్లాజెన్ అనే ప్రోటీన్ ఉంటుంది. పోషకాహార లోపం, ఒత్తిడి, కాలుష్యం కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గి ముఖంపై ముడతలు ఏర్పడతాయి. మంచి పోషకాహారం తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. అవేంటో చూద్దాం!

తేనె: చర్మ కణాలను రక్షించడంలో తేనెదే ప్రథమ స్థానం. ఇది చర్మంపై తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. స్వచ్ఛమైన తేనెను ముఖమంతా రాసి బాగా ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చర్మంపై ముడతలు తగ్గి ఆరోగ్యంగా ఉంటుంది.

కలబంద: కలబంద గుజ్జులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. ఈ గుజ్జును ముఖమంతా పట్టించి ఇరవై నిమిషాల తరవాత మంచినీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే చర్మంలో హైడ్రేషన్ స్థాయి పెరిగి ముఖం మీద గీతలు, ముడతలు తగ్గుతాయి.

కొబ్బరినూనె: కొబ్బరినూనెలోని ఫాటీ యాసిడ్స్ చర్మానికి పోషణనిస్తాయి. ఒక బౌల్‌లో అయిదు చెంచాల కొబ్బరి నూనె వేసి కొద్దిగా వేడి చేయండి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెను ముఖమంతా రాస్తూ ఒకే దిశలో మర్దన చేయండి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ప్రయోజనం ఉంటుంది.



ఆలివ్ ఆయిల్: ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్రీ రాడికల్స్, ఆరోగ్యకరమైన క్రొవ్వులు ఉంటాయి. ఆలివ్ ఆయిల్‌తో ముఖం మీద మసాజ్ చేసినపుడు ఇవి చర్మకణాల్లో ఒత్తిడిని తగ్గిస్తాయి. ముఖమంతా రక్తప్రసరణ జరుగుతుంది. దీనివల్ల నుదుటి మీద గీతలు, కంటి చుట్టూ ఉండే ముడతలు పోతాయి.

పెరుగు: పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మ సంరక్షణకు, మృతకణాలను తొలగించేందుకు సహాయం చేస్తుంది. కొంచెం పెరుగును ముఖమంతా పట్టించి ఇరవై నిమిషాల తరవాత నీళ్లతో కడగాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే చర్మం ముడతలు లేకుండా కాంతివంతంగా ఉంటుంది.

గ్రీన్ టీ: ఇది మంచి టోనర్‌గా ఉపయోగపడుతుంది. గ్రీన్ టీని తయారుచేసిన తరవాత ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తరచూ ముఖం మీద స్ప్రే చేసుకుంటూ ఉంటే ముడతలు, గీతలు, నల్లని మచ్చలు మాయమవుతాయి.

అరటిపండు: ఒక బౌల్‌లో అరటిపండును గుజ్జులా చేసి దానికి ఒక చెంచా తేనె, రెండు చెంచాల పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా పట్టించాలి. బాగా ఆరిన తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ముఖం తాజాగా ఉంటుంది.

రోజ్‌వాటర్: ఒక గిన్నెలో రెండు చెంచాల రోజ్‌వాటర్, రెండు చెంచాల గ్లిజరిన్, ఒక చెంచా నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేయాలి. పదిహేను నిమిషాల తరవాత నీళ్లతో కడిగేస్తే ముఖం మీద పేరుకున్న మురికి తొలగిపోతుంది. చర్మం స్టిఫ్‌గా మారుతుంది.

కోడిగ్రుడ్డు: గ్రుడ్డులోని తెల్ల సొనని తీసుకుని ముఖం మీద పొరలా పరచాలి. బాగా ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేసినా మంచి ఫలితముంటుంది.

నిద్ర: మంచి నిద్ర శరీరానికి స్వాంతన కలిగిస్తుంది. దీనివల్ల హార్మోన్ల పనితీరు సజావుగా ఉంటుంది. రోజుకి కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకుంటే ఒత్తిడి, అలసట తగ్గి వార్ధక్య ఛాయలు దగ్గరికి రాకుండా ఉంటాయి.

ఐరన్ కావాలా... ఇవి తినండి

మహిళల్లో ఐరన్ లోపం అనేది సర్వసాధారణంగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం పోషకాహారం తీసుకోకపోవడమే. ఐరన్ లోపంవల్ల రక్తహీనత, నీరసం, రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు వస్తాయి. వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలుసుకుందాం!



పప్పు ధాన్యాలు: కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వేరుశనగ వంటి పప్పుల్లో ఐరన్ మినరల్ ఎక్కువగా ఉంటుంది. వీటిని ఉడికించి సూప్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. రోజుకొక పప్పు రకాన్ని సైడ్ డిష్‌గా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి కావాల్సిన ఐరన్‌ను అందించడమే కాకుండా జీర్ణక్రియ సజావుగా ఉండేలా చేస్తాయి.

పాలకూర: వంద గ్రాముల ఉడికించిన పాలకూరలో 2.7 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. పాలకూరను సలాడ్స్‌లో, స్మూతీల్లో, ఇతర వంటకాల్లో బాగంగా చేర్చుకుని తరచూ తింటే శరీరానికి అవసరమైన న్యూట్రియెంట్స్ ఆగ్జలేట్లు పూర్తిగా అందుతాయి. వీటితోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా లభిస్తాయి.

రెడ్ మీట్: ఇందులో శరీరం త్వరగా గ్రహించే హేమే ఐరన్ ఉంటుంది. రెడ్‌మీట్‌ను మితంగా రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి ప్రోటీన్లు, బి విటమిన్ కూడా అందుతాయి.

గుమ్మడి గింజలు: వంద గ్రాముల గుమ్మడి గింజల్లో 3.3 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. వీటిలో న్యూట్రియెంట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అవసరమైన హెల్దీ ఫ్యాట్స్‌ను అందిస్తాయి. గుమ్మడి గింజలను పచ్చిగా, వేయించుకొని తినవచ్చు. సలాడ్స్‌లో కలుపుకోవచ్చు.

క్వినోవా: ఇందులో ఐరన్‌తోపాటు మెగ్నీషియం, మాంగనీస్, ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది గ్లూటెన్ లేని ధాన్యం. దీనిని మెయిన్ డిష్ కింద వారానికి రెండు సార్లు తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

టోఫు: ఇది శాకాహారులకు అధిక పరిమాణంలో ఐరన్‌ను అందించే ఆహారం. దీనిని రకరకాల వంటకాల్లో, సూపుల్లో చేర్చుకోవచ్చు. ఇందులో అధిక పరిమాణంలో ప్రోటీన్లు ఉంటాయి. మీట్‌కు ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. టోఫుతో రకరకాల స్నాక్స్ కూడా తయారు చేస్తున్నారు.

స్టార్‌డమ్ దిశగా..!

నాజూకైన రూపు... గమ్మత్తయిన చూపు... వెండితెరపై మెరుపు తీగలా మైమరిపిస్తుంది దిశా పటాని. తెలుగు చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ భామ... ఇప్పుడు చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా మారింది. ప్రభాస్ 'కల్కి 2898ఏడీ'లో అలరించిన దిశ... తమిళ స్టార్ సూర్యా 'కంగువా'తో మరో భారీ హిట్ కోసం ఎదురుచూస్తోంది.

దాదాపు పదేళ్ల కిందట కెరీర్ ప్రారంభించిన దిశా పటాని... ఇప్పటికి పద్నాలుగు చిత్రాల్లో నటించింది. విశేషమేమంటే... వీటిల్లో అత్యధికం భారీ బడ్జెట్ సినిమాలే. అదీ సల్మాన్, టైగర్ షరాఫ్, ప్రభాస్, సూర్య, జాకీచాన్ లాంటి సూపర్‌స్టార్స్‌తో కలిసి పని చేసింది. 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చినా... ఆమెను వెండితెరకు పరిచయం చేసింది మాత్రం తెలుగు పరిశ్రమే.



పూరి జగన్నాథ్ 'లోఫర్'లో వరుణ్‌తేజ్‌కు జోడీగా ప్రధాన పాత్ర పోషించిన దిశ... ఆ మరుసటి ఏడాది 'ఎంఎస్ ధోనీ'లో అవకాశం దక్కించుకుంది. ఈ అపురూప విజయంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు దేశమంతా మారుమోగింది. భారత క్రికెట్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన చిత్రం కావడంతో... సినీ ప్రేమికులతో పాటు కోట్లాదిమంది క్రికెట్ అభిమానులకు కూడా దిశ సుపరిచితురాలైంది.

పైలెట్ కావాలనుకుని...

దిశ కుటుంబంలో సినీ పరిశ్రమ నేపథ్యం ఉన్నవారు ఎవరూ లేరు. ఆమె తండ్రి జగదీశ్‌సింగ్ పోలీస్ అధికారి. తల్లి హెల్త్ ఇన్‌స్పెక్టర్. అక్క కుష్బూ భారత సైన్యంలో లెఫ్టినెంట్. తమ్ముడు సూర్యాంశ్. బడికి వెళ్లే రోజుల్లో దిశ కూడా భిన్నంగా ఆలోచించింది. ఎయిర్‌ఫోర్స్ పైలెట్ అవుదామనుకుంది. ఎందుకంటే ఎప్పుడూ తనను తాను ప్రత్యేకంగా నిలుపుకోవడానికే ఆమె ప్రయత్నించింది.

'మా ఇంట్లో ఒకరి కెరీర్‌తో వేరొకరికి పొంతన ఉండదు. పోలీస్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఆర్మీ... ఇలా ఒక్కోరిదీ ఒక్కో రంగం. ఎవరికి నచ్చింది వారు ఎంచుకున్నారు. నేనూ అంతే. ఆ స్వేచ్ఛ మాకు ఇంట్లో ఎప్పుడూ ఉంది. చిన్నప్పటి నుంచి అమ్మానాన్న ప్రోత్సాహంతో మేం బాగా చదివేవాళ్లం. మొదట్లో ఎయిర్‌ఫోర్స్ పైలెట్ కావాలనుకున్నాను. కారణం ఏదైతేనేం... అది నెరవేరలేదు. నేను, అక్క క్రీడల్లో చురుగ్గా పాల్గొనేవాళ్లం. నేను బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. తనైతే... అన్ని ఆటలూ ఆడేసేది. చదువుతో పాటు ఆటలు కూడా విద్యార్థుల జీవితంలో భాగం కావాలి. దానివల్ల గెలిచినప్పుడు, అలాగే ఓటమి ఎదురైనప్పుడు సమానంగా స్వీకరించగలుగుతారు. ఒడుదొడుకులకు లోనుకాకుండా ముందుకు సాగిపోవడంతో పాటు విలువైన జీవిత పాఠాలు ఎన్నో నేర్చుకొంటారు. స్వతంత్రంగా ఆలోచించగలుగుతారు. మా నాన్న మమ్మల్ని అలానే పెంచారు. ఎంతటి క్లిష్టమైన పని అయినా సరే... శ్రమించి సాధించాలే కానీ, భయపడి వెనక్కి తగ్గకూడదనేది నేర్పించారు. వేరొకరిపై ఆధారపడకుండా మా పని మేమే చేసుకొనేలా ప్రోత్సహించారు. అందుకే ఇవాళ నేను ఎన్ని ఇబ్బందులు, సమస్యలు, ఒత్తిడులు ఎదురైనా ముంబయి మహానగరంలో నిలబడగలిగాను' అంటున్న దిశ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి.

ఒంటరిగా మహానగరానికి...

లఖనవూ అమిటీ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో ఆమెకు నటనపై మక్కువ కలిగింది. దాంతో రెండేళ్లు మిగిలి ఉండగానే ఇంజనీరింగ్ వదిలేసింది. పరిశ్రమలో అవకాశాలు వెతుక్కొనేందుకు ముంబయికి వెళ్లాలని నిర్ణయించుకుంది. "ముంబయికి వచ్చినప్పుడు నా వయసు పద్దెనిమిది. ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక్కదాన్నే ఉండేదాన్ని. ఆరంభంలో మోడలింగ్ చేశాను. ఎన్నో ఎత్తుపల్లాలు, అవమానాలు ఎదురయ్యాయి. అపజయాలు పంచుకోవడానికి కూడా ఎవరూ లేరు అప్పుడు. కానీ నేను పెరిగిన నేపథ్యం, అనుభవాలు వాటిని తట్టుకొని పోరాడగలిగే శక్తినిచ్చాయి. ఇల్లు శుభ్రం చేసుకోవడం, బట్టలు ఉతుక్కోవడం, వండుకోవడం... ఆడిషన్స్‌కు వెళుతూనే అన్నీ చేసుకొనేదాన్ని. ముఖ్యంగా కరోనా మహమ్మారి ఎన్నో జీవిత పాఠాలు నేర్పింది. వేరొకరి సాయం లేకుండా మన పని మనమే చేసుకోవడం అలవాటైంది. అంతేకాదు... భావోద్వేగాలను అదుపులో పెట్టుకొని, మనం మానసికంగా బలోపేతం కావడానికి దోహదపడింది" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది దిశ.

ఆరు కోట్లమంది...

ఏడాదికి ఒక చిత్రం చేస్తూ వచ్చిన దిశ.. ఈ ఏడాది మూడింటిలో నటించింది. ఎంత బిజీగా ఉన్నా... సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పుడూ అభిమానులను పలకరిస్తూనే ఉంటుంది. తన సినిమా విశేషాలతో పాటు, ఫిట్‌నెస్, ఆరోగ్య రహస్యాలను ఎప్పటికప్పుడు వారితో పంచుకొంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకున్న ఫాలోయింగ్ చూస్తే మతిపోతుంది. అక్షరాలా ఆరు కోట్ల పదిహేను లక్షలమంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రతి పోస్టుకూ వ్యూస్, లైక్స్ కూడా అదే స్థాయిలో ఉంటాయి.



చేతి నిండా పని...

సినిమా ప్రయత్నాల్లో భాగంగా దిశ మోడలింగ్‌తో పాటు అందాల పోటీల్లోనూ పాల్గొంది. పలు మ్యూజిక్ వీడియోల్లోనూ నటించింది. హీరో టైగర్ షరాఫ్‌తో కలిసి ఓ మ్యూజిక్ వీడియోలో కనిపించిన ఆమె... ఆ తరువాత అతనితో కలిసి 'భాగీ2', 'భాగీ3' చిత్రాలు చేసింది. జాకీచాన్ చైనీస్ సినిమా 'కుంగ్‌ఫూ యోగా'లో మెరిసింది. ప్రస్తుతం తమిళ హీరో సూర్య 'కంగువ', ఫిరోజ్ నడియడ్‌వాలా నిర్మాణంలో, అనీస్ బజ్మీ దర్శకత్వంవహిస్తున్న 'వెల్కమ్ టూ జంగిల్' ప్రాజెక్టులు ఆమె చేతిలో ఉన్నాయి. ఇది రెండూ భారీ బడ్జెట్ చిత్రాలు.

పోలవరంపై జగన్ బొంకులు

- గత ఐదేళ్లలో ప్రాజెక్టు సర్వనాశనం
- ఇదిగో పూర్తిచేస్తామంటూ డెడ్‌లైన్లు
- అసమర్థ విధానాలతో తీవ్ర జాప్యం
- దెబ్బ తిన్న డయాఫ్రమ్ వాల్
- ప్రాజెక్టు ఎత్తుపై తొలిదశ పేరిట 41.15 మీటర్లు అంటూ కొత్త భాష్యం
- ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు
- గతం మరచి 'పోస్టులు'... విస్తుపోతున్న జనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించినా మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు మారడం లేదు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చాక ఎన్నో అబద్ధాలు చెప్పారు. ఇప్పుడూ అవే అబద్ధాలు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన నిర్వాకం మరిచి, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారు. జగన్ అధికారంలో ఉన్న గత ఐదేళ్లూ పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. ఇదిగో పూర్తి చేస్తామంటూ పలుమార్లు డెడ్‌లైన్లు మార్చడం మినహా చేసిందేమీ లేదు. రివర్స్ టెండరింగ్ పేరిట నిర్మాణ పనులను ఆపి వేయించారు. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం చేశారు. అనాలోచిత నిర్ణయాల కారణంగా వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. పోలవరం ప్రాజెక్టుకు జగన్ చేసిన విధ్వంసాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదు. డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడం దగ్గర నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు మంజూరు చేయకపోవడం దాకా అంతా గుర్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రాజెక్టు నిర్మాణంలో మళ్లీ కదలిక వచ్చింది. అయితే జగన్ అవన్నీ మరిచి ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టుల మీద పోస్టులు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు, కాంట్రాక్టు తదితర విషయాలపై సుద్దులు చెబుతున్నారు. దీనిపై జల వనరుల నిపుణుల నుంచి సామాన్యుల దాకా విస్తుపోతున్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టుపై జగన్ చేసిన పోస్టులు, వాస్తవాలు ఇలా...



జగన్ ఆరోపణ

చంద్రబాబు గారూ.. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తారా? పోలవరం ప్రాజెక్టు ఎత్తును పరిమితం చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా మీరు ఎందుకు నోరు మెదపడం లేదు? సవరించిన అంచనాలను ఆ మేరకే పరిమితం చేయడం రాష్ట్రానికి తీరని అన్యాయం కాదా? దీని వల్ల ప్రాజెక్టు లక్ష్యాలనే దెబ్బతీస్తున్నారు కాదా? దేనికి లాలూచీ పడి మీరు ఈ పనికి ఒడిగట్టారు? ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కేంద్ర మంత్రివర్గంలో మీ పార్టీ ఎంపీలు ఉండి కూడా ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? ప్రజలు మీకు ఎప్పుడు అధికారం అప్పగించినా రాష్ట్ర ప్రజల భవిష్యత్తు తాకట్టు పెడతారని, మీ స్వార్థ, ఆర్థిక, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను నట్టేట ముంచేస్తారని మరోసారి నిరూపిస్తున్నారు కదా?

ఇదీ వాస్తవం

2019 ఫిబ్రవరి 18వ తేదీన జరిగిన కేంద్ర జల సంఘం 141వ సర్వ సభ్య సమావేశంలో భూసేకరణ వ్యయం పెరిగినందున పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరులో నిర్మించేందుకు వ్యయం రూ.39,538.48 కోట్లకు బదులుగా రూ.55,548.87 కోట్లకు పెంచినట్లుగా పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రానికి సమాచారం కూడా ఇచ్చింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నాటి సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేసే వీలు లేకుండా పోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రతి సమీక్షా సమావేశంలోనూ తొలిదశ పేరిట 41.15 మీటర్ల ఎత్తు అనే కొత్త భాష్యాన్ని తెరపైకి తీసుకువచ్చారు. కేంద్రంతోనూ, కేంద్ర జల సంఘంతోనూ, పోలవరం ప్రాజెక్టు అథారిటీతోనూ ఇదే ఎత్తుకు కట్టుబడుతూ ఉత్తర ప్రత్యుత్తరాలు నెరిపారు. పోలవరం ఎత్తు తగ్గించేస్తున్నారని, 41.15 మీటర్ల ఎత్తు అంటే ఒక మినీ రిజర్వాయరుతో సమానమంటూ అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. 45.72 మీటర్ల కాంటూరులో గరిష్ఠ స్థాయిలో నిర్మించడం వల్ల 194.6 టీఎంసీల నీటిని రెండు భాగాలుగా నిల్వ చేయవచ్చంటూ వివరంగా పేర్కొంది. కానీ అసెంబ్లీలో స్లయిడ్‌లను వేసి మరీ పోలవరం ఎత్తు ఒక్క ఇంచీ కూడా తగ్గదంటూ ప్రకటనలు చేస్తూనే.. తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తులో పోలవరాన్ని నిర్మిస్తామంటూ నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు.

జగన్ మళ్లీ పాతపాట

పోలవరం గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లు అయితే.. 41.15 మీటర్లకు మీరు ఎందుకు పరిమితం చేస్తున్నారు? తద్వారా 194.6 టీఎంసీలు ఉండాల్సిన నీటి నిల్వ 115 టీఎంసీలకు పడిపోతుందని తెలిసి కూడా ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదు? ఈ కారణంగా వరద వస్తే తప్ప కుడి, ఎడమ కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయలేని దుస్థితి నెలకొంటుంది. గోదావరి డెల్టాలో పంటలకు స్థిరంగా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది. సరిగా విద్యుత్తు ఉత్పత్తీ చేయలేం.

ఇదీ వాస్తవం

గత ప్రభుత్వంలో ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల స్థానంలో తొలిదశ పేరిట 41.15 మీటర్ల ప్రస్తావన తెచ్చిందే జగన్. నాడు ప్రధానికి రాసిన లేఖల్లోనూ 41.15 మీటర్ల కాంటూరు మేరకు నిధులు విడుదల చేయాలని జగన్ అభ్యర్థించారు. 41.15 మీటర్ల ఎత్తుకు పరిమితం చేయడం వల్ల 115 టీఎంసీల నీటి నిల్వకే ప్రాజెక్టు పరిమితం అవుతుందని ఆనాడే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది. అయినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. జల వనరుల శాఖ వంకర సమాధానం ఇచ్చింది. 41.15 మీటర్ల ఎత్తులో నీటి నిల్వ చేయడం వల్ల స్పిల్‌వే నుంచి నీరు పారదని గ్రహించడంతోనే రూ.900 కోట్లతో ప్రాజెక్టు క్షేత్రంలోనే ఎత్తిపోతల పథకానికి ప్రణాళిక వేసింది. దీనిపై విమర్శలు వచ్చినా జగన్ మొండిగా ముందుకెళ్లారు.

జగన్ ఆరోపణ

శరవేగంగా విస్తరిస్తున్న విశాఖపట్నం మహానగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలను తీర్చలేం. అన్నింటి కంటే సుజల స్రవంతి ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉత్తరాంధ్రకు అన్యాయమే జరుగుతోంది.

ఇదీ వాస్తవం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం చేపట్టిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను జగన్ ప్రభుత్వంలోనే ఆపేశారు.

జగన్ ఆరోపణ

పోలవరం ప్రాజెక్టు విషయంలో అప్పుడైనా, ఇప్పుడైనా మీరు చేసిన, చేస్తున్న దుర్మార్గాలకు అంతులేకుండా పోతోంది. మొదటి నుంచి మీరు స్వప్రయోజనాలే చూసుకున్నారు. మీ బంధువులు, మీ నాయకులకు కాంట్రాక్టులు ఇచ్చి డబ్బులు సంపాదించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ప్రాజెక్టును మీ చేతిలోకి తీసుకున్నారు. ప్యాకేజీ డ్రామాతో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు.

ఇదీ వాస్తవం

పోలవరం ప్రాజెక్టును కేంద్రం నిర్మించాలని ప్రతిపక్షంలో ఉండగా డిమాండ్ చేయడం జగన్‌కు ఆనవాయితీగా మారింది. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో ఏనాడూ పోలవరం ప్రాజెక్టు బాధ్యతను తీసుకోవాలంటూ కేంద్రాన్ని కోరుతూ లేఖ రాయలేదు. పైగా రివర్స్ టెండరింగ్ పేరిట ప్రాజెక్టును నాశనం చేశారు. నాడు ప్రజలు వైసీపీ తరఫున 22 మంది లోక్‌సభ ఎంపీలను గెలిపించినా జగన్ ప్రత్యేక హోదాను గాలికొదిలేశారు.

జగన్ ఆరోపణ: నామినేషన్ల పద్ధతిలో కాంట్రాక్టు కట్టబెట్టి పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని లూటీ చేశారు. చంద్రబాబుకు పోలవరం ప్రాజెక్టు ఏటీఎంగా మారి డబ్బులు గుంజుకునే యంత్రంలా మారిందని సాక్షాత్తూ ఆనాడు ప్రధానమంత్రి ప్రజల సాక్షిగా అన్న మాటలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ఇదీ వాస్తవం: వాస్తవానికి పోలవరం పనుల్లో నామినేషన్ల పద్ధతిలో కాంట్రాక్టులు కట్టబెడుతున్నారంటూ జగన్‌పైనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 2019లో రివర్స్ టెండర్ పిలిస్తే ఒకే సంస్థ బిడ్ దాఖలు చేసింది. రివర్స్ టెండరింగ్ విధానంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ బిడ్‌లు దాఖలు కావాలి. సింగిల్ బిడ్‌ను తిరస్కరించాలి. కానీ పోలవరం హెడ్‌వర్క్స్ పనుల్లో సింగిల్ బిడ్‌ను ఆమోదించడం అంటే.. నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టడమేనన్న విమర్శలు వచ్చాయి.

జగన్ ఆరోపణ: చంద్రబాబు గారూ... ఇప్పుడు మీరు చేయాల్సిందల్లా కొట్టుకుపోయిన డయాఫ్రమ్ వాల్ పూర్తి చేసి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను కట్టడంతోపాటు ఈలోగా మిగిలిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. ఇవన్నీ పూర్తి చేస్తామంటూ మీరు, మీ కూటమి పార్టీలు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు తెచ్చుకుని అధికారంలోకి వచ్చారు.

ఇదీ వాస్తవం: 2019లో జగన్ అధికారంలోకి వచ్చే నాటికి డయాఫ్రమ్ వాల్ పటిష్ఠంగా ఉంది. ఈ వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను నిర్మించి ఉంటే 2021 డిసెంబరు నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ రెండేళ్లపాటు పనులు చేపట్టకపోవడంతో వరదలకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం చేశారు.

విమర్శలు కాదు.. కలసిరండి!

విపక్షానికి మంత్రి నాదెండ్ల పిలుపు

తిరుపతి క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షంలో కూర్చుని మాటలు చెప్పడం, రోజూ ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు చేయడం కాదు. మహిళల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే కలిసిరండి. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేద్దాం' అని వైసీపీ నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శనివారం దీపం-2 పథకం కింద అర్హులైన మహిళలకు ఆయన ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కింద రైతులకు చెల్లించాల్సిన దాదాపు రూ.1674 కోట్లు చెల్లించకుండా వెళ్లిపోతే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మొత్తం డబ్బులు చెల్లించామన్నారు. రాష్ట్రంలో దాదాపు 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని వీరందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేసి తీరుతామని, ఈ విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మాల్సిన పని లేదని చెప్పారు. గత రెండు రోజుల్లో 12 లక్షల మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారని తెలిపారు.



ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అంబటీ.. నీ మానసిక స్థితి బానే ఉందా?: నిమ్మల



అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపణలు చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితిపై సందేహం వస్తోంది అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు కుదించేలా కేంద్రంతో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు' అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. దానిపై మంత్రి నిమ్మల ఎక్స్ వేదికగా శనివారం స్పందించారు. 'గత నెల 9న కేంద్రం ఇచ్చిన నిధులు రూ.2,348 కోట్లను మళ్లించేశామంటూ మరో తప్పుడు ఆరోపణను అంబటి చేశారు. ఈ ఆరోపణను నిరూపించగలరా? పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత సాంకేతిక ప్రమాణాల మేరకు నిర్మిస్తాం. మేం ప్రజలకు జవాబుదారిగా ఉంటాం. పోలవరం నిర్మాణాన్ని నూటికి 150 శాతం పూర్తి చేస్తాం' అని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

జనవరిలో కొత్త రేషన్‌కార్డులు!

- కొత్తగా పెళ్లైన జంటలకు, అర్హత ఉన్న పేదలకు తొలి ప్రాధాన్యం
- సర్కారుపై ఆర్థిక భారం పడకుండా పౌరసరఫరాలశాఖ కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించిన కూటమి ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరిలో నూతన సంవత్సర కానుకగా రాష్ట్రంలో అర్హత కలిగిన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయనుంది. కొత్తగా పెళ్లైన జంటలతో పాటు అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న కార్డులను రీ డిజైన్ చేసి.. పాత, కొత్త లబ్ధిదారులందరికీ సరికొత్త డిజైన్‌తో అందజేసేందుకు కసరత్తును ముమ్మరం చేసింది. రేషన్‌కార్డుల రూపకల్పన, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా అర్హులైన పేదలకు కొత్త కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాలశాఖ కసరత్తు చేస్తోంది. కొత్తకార్డులకు అధికారులు డిజైన్లు పరిశీలిస్తున్నారు. వాటిలో లేత పసుపు రంగు కార్డుపై రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని ముద్రించిన నమూనాను ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని గొప్పలు చెప్పింది. దరఖాస్తు చేసుకున్న వారికి ఐదు రోజుల్లోనే మంజూరు చేస్తామంటూ ఆర్భాటం చేసింది. దీంతో పెళ్లిళ్లు చేసుకుని కొత్త కాపురాలు పెట్టిన జంటలు, పేదరికంలో మగ్గిపోతున్నా రకరకాల కారణాలతో రేషన్‌కార్డు లేనివారు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వారందరికీ రేషన్‌కార్డులను మంజూరు చేస్తే అదనపు ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతో జగన్ సర్కారు నెమ్మదిగా కొత్త కార్డుల జారీ అంశాన్ని అటకెక్కించింది. దాంతో గత ప్రభుత్వంలో కొత్తకార్డుల కోసం వచ్చిన 30,611 దరఖాస్తులతోపాటు స్ప్లిట్ కార్డుల కోసం వచ్చినవి 46,918, ఉన్న కార్డుల్లో సభ్యుల చేర్పుల కోసం వచ్చినవి 2,13,007, తొలగింపు కోసం వచ్చినవి 36,588, అడ్రస్ మార్పు కోసం వచ్చిన 8,263, కార్డుల సరెండర్ కోసం వచ్చినవి 685 కలిపి మొత్తం 3,36,072 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండిపోయాయి. కొత్త దంపతులకు కొత్త కార్డులు ఇవ్వాలంటే అప్పటికే వారి కుటుంబాలకు ఉన్న రేషన్‌కార్డుల నుంచి వీరి పేర్లు తొలగించాల్సి ఉంది. దీనికి గత వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా వారికి ఐదేళ్లుగా రేషన్‌కార్డులు అందలేదు.

ఆర్థిక భారం పడకుండానే 1.5 లక్షల కార్డుల జారీ..

రాష్ట్రంలో ప్రస్తుతం 1.48కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 90 లక్షల కార్డులను జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద కేంద్రం గుర్తించింది. వాటికి మాత్రమే ఉచిత బియ్యం, కందిపప్పు, పంచదార తదితర సరుకులపై రాయితీ అందిస్తోంది. మిగిలిన కార్డులకు ఉచిత బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలు, రాగులు తదితర సరుకులపై ఇస్తున్న సబ్సిడీకి అయ్యే ఆర్థిక భారం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి వస్తోంది. పీహెచ్‌హెచ్(ప్రయారిటీ హౌస్‌హోల్డ్) రేషన్‌కార్డులను కూడా ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా కోరుతున్నా కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఆర్థికభారం పడకుండానే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మొత్తం రేషన్‌కార్డుల వినియోగంపై కాలానుగుణ సమీక్షలు చేస్తున్నారు. ఆ సార్టింగ్ డేటా ఆధారంగా ఇప్పటికే రాష్ట్రంలోని 17,941 అంత్యోదయ అన్న యోజన(ఏఏవై), మరో 1,36,420 పీహెచ్‌హెచ్ కార్డుదారులు గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని గుర్తించారు. ఆ కార్డులను తొలగిస్తే ఏడాదికి రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా వేశారు. వాటి స్థానంలో అర్హులైనవారికి కొత్త కార్డులు మంజూరు చేయవచ్చని పౌరసరఫరాలశాఖ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వంపై ఎలాంటి అదనపు భారమూ పడకుండానే 1.5 లక్షలకుపైగా పేద కుటుంబాలకు జనవరిలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. అయితే దీనికి ప్రభుత్వ ఆమోదం లభించాల్సి ఉంది.

వామ్మో స్టిరాయిడ్స్!

పల్లెలు, బస్తీల్లో ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఆర్ఎంపీలు.. కొంత మంది ఎంబీబీఎస్‌లదీ అదే దారి

(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

శరీరంలో వాపులను తగ్గించే స్టిరాయిడ్ ఔషధాల వాడకం విచ్చలవిడిగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వాటి అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులు.. నొప్పులంటూ తమ వద్దకు వస్తున్న పేదసాదలకు తక్షణ ఉపశమనం కలిగించేందుకు అడ్డగోలుగా స్టిరాయిడ్ ఇంజెక్షన్లు చేసేస్తున్నారు. పట్టణాల్లోని బస్తీల్లో కూడా అదే పరిస్థితి! స్టిరాయిడ్ల విచ్చలవిడి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలిసిన కొందరు ఎంబీబీఎస్ వైద్యులు కూడా.. వాటిని సిఫారసు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రోగులు కూడా.. నొప్పుల నుంచి తక్షణ ఉపశమనం కావాలనుకోవడం ఈ జాడ్యాన్ని మరింత పెంచుతోంది. స్టిరాయిడ్లను ఇష్టం వచ్చినట్టుగా వాడేవారు తీవ్ర దుష్ప్రభావాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రమంతా వైరల్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. చాలా మంది ఒకేసారి చికున్‌గున్యా, డెంగీ బారిన పడ్డారు. ఒళ్లంతా నొప్పులు, ముఖ్యంగా కీళ్లనొప్పుల బారిన పడ్డవారి సంఖ్య అధికం. కొందరిలో ఆ నొప్పులు కొన్నివారాల వ్యవధిలో తగ్గితే మరికొందరిలో నెలల తరబడి వాటి తీవ్రత కొనసాగుతూనే ఉంది. అలాంటివారిలో చాలామంది నొప్పుల బాధ భరించలేక స్టిరాయిడ్స్ వాడి కొత్త అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు.

ఏంటీ ఈ స్టిరాయిడ్స్...

మన శరీరంపై వైరస్‌లు, బ్యాక్టీరియా దాడి చేసినప్పుడు.. లేదా మనకు ఏదైనా దెబ్బ తగిలి గాయమైనప్పుడు.. మన రోగనిరోధక వ్యవస్థ స్పందించి ఇన్‌ఫ్లమేటరీ కణాలను, సైటోకైన్లను పంపిస్తుంది. ఆ కణాలు అక్కడికి చేరుకోగానే.. బ్యాక్టీరియా/వైరస్‌లను నిర్వీర్యం చేసే ప్రక్రియ చేపడతాయి. దీన్ని వైద్య పరిభాషలో 'ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్' అంటారు. ఈ ప్రక్రియలో నొప్పి, వాపు, ఆ ప్రాంతం ఎర్రగా కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలు కనిపించాయంటే రోగనిరోధక వ్యవస్థ సరిగ్గా పనిచేస్తోందనడానికి నిదర్శనం. అలాగే.. కొన్ని సందర్భాల్లో మన రోగ నిరోధక వ్యవస్థ అదుపు తప్పి శరీరభాగాలపైనే దాడి చేసి ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది. కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థ్రైటిస్), సోరియాసిస్ (చర్మ వ్యాధి), లూపస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఇందుకు ఉదాహరణ. అలాంటి వ్యాధుల బారినపడ్డవారికి సాధారణ నొప్పి నివారణ మందుల వల్ల అంతగా ఉపశమనం కలగదు. అలాంటి సందర్భాల్లో వారికి వైద్యుల సిఫారసు ప్రకారం స్టిరాయిడ్ ఔషధాలను ఇస్తే.. అవి రోగనిరోధక వ్యవస్థ స్పందనను మందగింపజేసి (ఇమ్యూన్ సప్రెషన్) ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను తగ్గిస్తాయి. తద్వారా వాపు తగ్గి, రోగికి ఉపశమనం కలుగుతుంది. అంతటి శక్తిమంతమైన మందులను వైరల్ జ్వరాల వల్ల వచ్చే వాపులు, నొప్పులు తగ్గడానికి.. అది కూడా జ్వరం వచ్చిన వెంటనే ఎక్కువ మోతాదులో వాడడం తీవ్ర దుష్ప్రభావాలకు దారితీస్తోంది. నిపుణులైన, అర్హులైన, అనుభవజ్ఞులైన వైద్యులెవ్వరూ స్టిరాయిడ్స్‌ను తప్పనిసరి అయితే తప్ప సిఫారసు చేయరు.

శరీరంలోనే స్టిరాయిడ్ల ఉత్పత్తి!

స్టిరాయిడ్‌ల మాట వినగానే చాలామంది భయపడతారు! నిజానికి మనం ట్యాబ్లెట్లు/ఇంజెక్షన్లు/ఆయింట్‌మెంట్‌లు/ఇన్‌హేలర్లు/స్ప్రేల రూపంలో తీసుకునేవన్నీ సింథటిక్ స్టిరాయిడ్‌లు. మన శరీరంలోనే ఉత్పత్తి అయ్యే.. హార్మోన్లుగా మనం చెప్పుకొనే.. టెస్టోస్టిరాన్, ప్రొజెస్టిరోన్, కార్టిసాల్ వంటివన్నీ సహజ స్టిరాయిడ్‌లు. వీటిలో పురుష హార్మోన్ అయిన టెస్టోస్టిరాన్ కండరాల నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సహజ స్టిరాయిడ్లను వాటిని అడ్రినల్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. కానీ.. మందుల రూపంలో స్టిరాయిడ్స్‌ను శరీరంలోకి పంపడం వల్ల కొంత కాలానికి అడ్రినల్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది.





పద్ధతిగా వాడాలి..

స్టిరాయిడ్ ఔషధాలను నిర్ణీత విధానం ప్రకారం వాడాల్సి ఉంటుంది. రోగి వయసు, ఎత్తు, బరువు ఆధారంగా వైద్యులు ఎంత మోతాదులో వాడాలో సిఫారసు చేస్తారు. కొంతకాలంపాటు ఆ డోసు వాడిన తర్వాత.. మళ్లీ వైద్యపరీక్షలు చేయించి, మోతాదు తగ్గిస్తారు. మరికొంతకాలం ఆ డోసు వాడాక ఇంకొంత తగ్గిస్తారు. ఇలా తగ్గించుకుంటూ వచ్చి చివరికి ఆపేసే విధానాన్ని 'టేపరింగ్' అంటారు. ఆ పద్ధతిలో కాకుండా.. నొప్పులు రాగానే వాడి, తగ్గగానే ఆపేయడం వల్ల శరీరంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అలాగే.. కొన్ని చర్మ సంబంధిత సమస్యలకు వైద్యులు స్టిరాయిడ్లు రాస్తారు. రోగులు.. మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లకుండా అవే ఆయింట్‌మెంట్/క్రీములను దీర్ఘకాలంపాటు వాడేస్తారు. కానీ.. అందులోని స్టిరాయిడ్ చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తుంది. దాన్ని ప్రాసెస్ చేయాల్సింది కాలేయమే. కాబట్టి పైపూతగా వాడే స్టిరాయిడ్‌ల వల్ల ప్రమాదం ఉంటుందనుకోకూడదు. వాటిని కూడా వైద్యులు చెప్పిన ప్రకారం ఎంతకాలం వాడాలో అంతకాలమే వాడి ఆపేయాలి. మళ్లీ సమస్య వస్తే మళ్లీ వైద్యులను సంప్రదించాలి తప్ప సొంతవైద్యం కూడదు.

దీర్ఘకాలం వాడితే..

స్టిరాయిడ్‌ల వాడకం వల్ల ఆకలి విపరీతంగా పెరుగుతుంది. దీంతో ఎక్కువగా తినేసి బరువు పెరుగుతారు. కోపం, చిరాకు, మూడ్ స్వింగ్స్ వంటివి కలుగుతాయి. ఎముకలు బలహీనపడతాయి. అందుకే వైద్యులు ఈ దుష్ప్రభావాలను తగ్గించే ఇతర ఔషధాలను కూడా సిఫారసు చేస్తారు. ఇక.. వైద్యుల పర్యవేక్షణ లేకుండా, ఇష్టం వచ్చిన డోసులో దీర్ఘకాలంపాటు స్టిరాయిడ్లు వాడితే అడ్రినల్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది. శరీరంలోని ఎముకలు గుల్లబారిపోతాయి. కంటి శుక్లాలు, మధుమేహం, చర్మం పల్చబారిపోవడం, అలర్జీలు, రక్తం గడ్డకట్టడం, హృద్రోగాల, మూత్రపిండ వ్యాధుల వంటి బారిన పడే ప్రమాదం ఉంటుందని.. గుండెపోటు ముప్పు అధికమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనవసరంగా వాడితే తీవ్ర అనర్థాలు



స్టిరాయిడ్స్ అంటే.. ప్రాణాలను కాపాడే ఔషధాలు. కానీ వీటిని అవసరంగా వాడితే తీవ్రమైన అనర్థాలుంటాయి. నొప్పులకు సంబంధించి సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయకుండానే గ్రామీణ ప్రాంతాల్లో పెయిన్ కిల్లర్స్‌గా వీటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇవి కేవలం నొప్పులను మాత్రమే తగ్గిస్తాయిగానీ.. జబ్బును కాదు. ఇష్టం వచ్చినట్టు వాడితే.. కాళ్లు, చేతులు సన్నబడి పొట్ట పెద్దగా అవుతుంది. అల్సర్స్ వస్తాయి. ఎముకలు బలహీనపడి ఆస్టియో పొరోసిస్‌కు దారి తీస్తుంది. కొన్నిసార్లు తుంటి కీలు మార్చాల్సిన దుస్థితీ తలెత్తుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల.. క్షయ, ఫంగస్ వంటివాటి బారిన సులభంగా పడతారు. ఫ్లూ, న్యూమోనియా లాంటివి వస్తే త్వరగా తగ్గవు. గుండె, కిడ్నీ సమస్యలు పెరుగుతాయి.

- డాక్టర్ ఎంవీరావు, కన్సల్టెంట్ ఫిజిషియన్, యశోదా ఆస్పత్రి, హైదరాబాద్




ప్రత్యామ్నాయాలున్నాయి



నొప్పినివారణకు.. నేరుగా స్టిరాయిడ్ ఇంజక్షన్స్, ట్యాబ్లెట్ల వాడకం మంచిది కాదు. వాటికి చాలా ప్రత్యామ్నాయాలున్నాయి. ముఖ్యంగా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను తీసుకోవాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల పళ్లతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. అల్లంతో పాటు పసుపు మంచి యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిజేస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ ఉండే విత్తనాలు, ఫిష్ ఆయిల్ వాడాలి. అలాగే ఆలివ్ ఆయిల్‌ను నొప్పిఉన్న ప్రాంతంలో వేసి మర్దన చేయాలి. ఫిజియోథెరపీ, ఆక్యుపంచర్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ లాంటివి చేయించుకోవచ్చు. నొప్పులను తాత్కాలికంగా తగ్గించుకోవాలన్న ఆలోచన కంటే.. దీర్ఘకాలికమైనా సురక్షిత విధానాలను అనుసరించడం మంచిది.

- డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, క్రిటికల్‌కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్, ఎండీ, శ్రీరక్ష హాస్పిటల్, ఖమ్మం

స్కిన్ వైటెనింగ్ స్టిరాయిడ్స్‌తో క్యాన్సర్ ముప్పు



చర్మ సంబంధిత సమస్యల్లో కొన్నింటికి తప్పకుండా స్టిరాయిడ్స్ వాడాల్సి ఉంటుంది. లేకుంటే రోగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కొన్ని సార్లు యాంటీబయాటిక్ రియాక్షన్స్ వచ్చినప్పుడు కూడా వీటిని వినియోగించాల్సి వస్తుంది. అలాగే స్టీవెన్‌జాన్సన్ సిండ్రోమ్‌కూ ఓరల్ స్టిరాయిడ్ వాడతాం. అయితే ముఖం తెల్లగా ఉండటం కోసం స్కిన్ వైటనింగ్ స్టిరాయిడ్స్‌ను కొందరు వినియోగిస్తుంటారు. దానివల్ల వారంలో ముఖమంతా తెల్లబడుతుంది. కానీ, వాటిని ఎక్కువకాలం వాడితే చర్మ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. అలాగే ముఖం కూడా మారిపోతుంది. ముఖ్యంగా.. చర్మవ్యాధులకు, చర్మానికి సంబంధించి వాడే స్టిరాయిడ్ల విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా, సిఫారసు, పర్యవేక్షణ లేకుండా వాడడం అనేక అనర్థాలకు దారి తీస్తుంది.

- డాక్టర్ రత్న కిషోర్, ఎండీ, ఎల్ఆర్కే స్కిన్‌గ్లో హాస్పిటల్, హైదరాబాద్


రుషికొండ ప్యాలెస్‌లో రూ.36 లక్షల విలువైన బాత్‌టబ్‌ను గురించి సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంటా


రుషికొండ ప్యాలెస్‌లోని ఖరీదైన ఫ్యాన్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు


స్పా రూమ్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కోండ్రు మురళి

ఇదేం విలాసం!?

"జగన్ వంటి వ్యక్తులు రాజకీయంగా పనికొస్తారో, లేదో అనేదానితోపాటు రుషికొండ ప్యాలెస్ పేరుతో జగన్ చేసిన అరాచకాన్ని ప్రజల్లో చర్చకు పెడతాం. ప్యాలెస్‌ను మొత్తం వీడియో తీసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆన్‌లైన్‌లో ఉంచుతాం. ప్రజలను ప్యాలెస్ సందర్శనకు అనుమతిస్తాం. ప్యాలెస్‌పై వారి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత, దీనిని దేనికి ఉపయోగించుకోవచ్చుననే దానిపై నిర్ణయిస్తాం" - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

బ్లూప్రింట్‌తోపాటు వైశాల్యం, ఒక్కో బ్లాక్‌లో నిర్మాణాల ప్రత్యేకతలు, ఇంటీరియర్, ఫ్లోరింగ్, సీలింగ్ ఫ్యాన్లు, బాత్‌టబ్‌లు, ఇతర సౌకర్యాల గురించి ఏపీటీడీసీ వైస్ చైర్మన్ అభిషిత్ కిషోర్, పర్యాటక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్.... చంద్రబాబుకు వివరించారు. విజయనగర బ్లాక్‌లోని విలాసవంతమైన బాత్‌రూమ్‌లు, మసాజ్‌రూమ్, మరుగుదొడ్డి కమోడ్‌లు, ఫ్యాన్‌లు, కళింగ బ్లాక్‌లోని విశాలమైన సమావేశ మందిరం, గజపతి, వేంగీ బ్లాక్‌లలో విదేశాల నుంచి తెప్పించిన రాజరికం ఉట్టిపడేలా కనిపిస్తున్న ఫర్నిచర్, ఇంటీరియర్‌ను చూసి చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "నాగరిక ప్రపంచంలో ఇలాంటి సంఘటనలు కూడా జరుగుతాయా అన్నట్టు రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించారు. ఒక వ్యక్తి విలాసవంతమైన జీవితం, స్వార్థం కోసం ఇంతగా బరి తెగించాడా? అని మైండ్‌బ్లోయింగ్ అయింది. అందుకే జగన్‌ను నేను 'ఆంధ్రా ఎస్కోబార్' అనేది." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

రుషుల కొండపై ఎందుకింత విలాసం?

"ఇంత విలాసవంతమైన భవనాలను ఎందుకు నిర్మించారో అర్థం కావడం లేదు. రుషులు తపస్సు చేసిన రుషికొండ అంటే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఒక మైలురాయి. అలాంటి రుషికొండకు గుండు కొట్టించారు. పర్యావరణ ప్రేమికులు కొందరు దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు,హైకోర్టుకు ఫిర్యాదు చేసినా, కేంద్రం జోక్యం చేసుకున్నాసరే కనిపించకుండా ప్రజాధనంతో నిర్మాణాలు చేసేశారు. రుషికొండను తవ్వేసి విలాసవంతమైన భవనాలను నిర్మిస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో నేను, పవన్‌కల్యాణ్ స్వయంగా చూసేందుకు యత్నిస్తే అడ్డుకున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డగోలుగా ఎలా వ్యవహరించారో చెప్పడానికి ఇదొక కేస్ స్టడీ. ఇప్పుడు ఈ భవనాల వినియోగంపై నిర్ణయం తీసుకునే అధికారం ప్రజలే మాకు అప్పగించడం ప్రజాస్వామ్యం ఎంత బలమైనదో చెప్పడానికి ఉదాహరణ.

....తవ్వితే చాలామంది అధికారులు పోతారు

"రుషికొండ ప్యాలెస్‌పై నాడు అన్నీ అబద్ధాలే ఆడారు. మొదట పర్యాటక ప్రాజెక్టులని చెప్పారు. ఆ తర్వాత ప్రధాని, రాష్ట్రపతి వంటివారు నగరానికి వస్తే విడిది కోసమని బుకాయించారు. చివరకు అసలు విషయం బయటపడింది. అసలు జగన్ మనస్సు ఏమిటో అర్థం కావడం లేదు. తాను రాజుని, రారాజుని, చక్రవర్తిని అనుకున్నాడో.. లేకపోతే శాశ్వతంగా అధికారంలో ఉండిపోతాననుకున్నాడో ఏమో, తెలియడం లేదు. ప్యాలెస్ పనులను తవ్వితే చాలామంది అధికారులు పోతారు"

దొంగలకు ఇంత ఇన్నోవేషనా?

"రాష్ట్రపతి భవన్, వైట్‌హౌస్‌లో కూడా లేనివిధంగా కారిడార్ ఉంది. దొంగలకు ఇలాంటి ఇన్నోవేషన్ ఎలా వచ్చింది? ప్యాలెస్‌లో పనిచేసే వారికోసం ఒక బ్లాక్ కట్టారు. 200 టన్నుల ఏసీలను ఏర్పాటు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. గత ఐదేళ్ల అణగదొక్కేపాలన సాగింది. దీంతో పత్రికా రంగం కూడా నోరెత్తలేకపోయింది. మళ్లీ దుర్మార్గులు గెలిస్తే విశాఖలో సముద్రాన్ని కూడా మిగిల్చే పరిస్థితి ఉండదు. ప్రధాని, రాష్ట్రపతి విశాఖ వస్తే నేవీ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారుగానీ, ఇలాంటిచోటకు ఎందుకు వస్తారు?"

అప్పుడూ, ఇప్పుడూ పోరాటమే..

"వైసీపీ నేతలు కొందరు ఇప్పుడు ఏవేవో అంశాలపై ప్రభుత్వ అభిప్రాయం అడుగుతున్నారు. ఆ పార్టీ నేతలకు ఏమాత్రం సిగ్గు, ప్రజలంటే భయం ఉంటే రుషికొండ ప్యాలెస్‌పై సమాధానం చెప్పాలి. ఆ పార్టీ నాయకుడే కాదు.. అతన్ని వెనకేసుకొచ్చే నేతలు కూడా బాధ్యత వహించాలి. సంఘ విద్రోహశక్తులతో పోరాటం చేశా. ఇప్పుడు రాజకీయం ముసుగులో తప్పులు చేసిన వారిపై పోరాడుతున్నాను. ఇలాంటి వారిని భావితరాలు కూడా ఛీ కొట్టాలి"

అందరి సలహాపై రుషికొండపై నిర్ణయం

విశాఖలోని రుషికొండ ప్యాలెస్‌ను ఎలా ఉపయోగించాలనే దానిపై అందరి సూచనలు, సలహాలు తీసుకుని నిర్ణయం తీసుకుంటామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'ప్రజాధనం అంటే బాధ్యత లేని, ప్రజలంటే లెక్కలేని, ప్రజాస్వామ్యమంటే భయంలేని పాలకులు కట్టిన నిర్మాణాలను మీడియా, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించాను. ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లు కుమ్మరించి, వ్యక్తిగత విలాసాల కోసం కట్టిన ఈ భవనాలను రాష్ట్రం కోసం ఎలా ఉపయోగించుకోవాలో చర్చిస్తున్నామని 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.


రుషికొండ ప్యాలెస్‌లో ఒక సమావేశ మందిరం

రుషికొండ ప్యాలెస్‌పై వైసీపీవన్నీ డ్రామాలే!

- జగన్ నిర్వాకంపై కూటమి కరపత్రం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు విరుద్ధంగా రుషికొండపై నిర్మించిన ఖరీదైన భవనం విషయంలో వైసీపీ నాయకులు ఆఖరి నిమిషం వరకూ అవాస్తవాలనే వల్లె వేస్తూ వచ్చారు. పర్యాటకులకు ఉపయోగపడుతున్న హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి జగన్ కోసం ప్యాలెస్ నిర్మాణం ప్రారంభించారు. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినా వైసీపీ నాయకులు మాత్రం పర్యాటకుల కోసమేనని బుకాయించారు. చివరకు హైకోర్టులో కూడా ఇవే మాటలు చెప్పి తప్పుదారి పట్టించారు. మొత్తం రూ.451.67 కోట్లు వెచ్చించారు. కేవలం జగన్, ఆయన కుటుంబం నివాసం కోసం 1,46,784 చ.అ. విస్తీర్ణంలో భవనాలు నిర్మించారు. ఈ భవన సముదాయాన్ని 2024 ఫిబ్రవరి 29న నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ విశాఖ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి కలసి ప్రారంభించారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చినప్పుడు సీఎం హోదాలో జగన్ బస చేయడానికి ఈ భవనం వీలుగా ఉంటుందని త్రిసభ్య కమిటీ ఎంపిక చేసి, సిఫారసు చేసిందని, ఈ ప్రతిపాదనకు జగన్ ఆమోదముద్ర వేస్తే... సీఎం క్యాంప్ ఆఫీసుగా ఉపయోగిస్తామని చెప్పారు. అయితే దీనికి 3నెలల ముందే త్రిసభ్య కమిటీ సిఫారసు మేరకు ఆ భవనాన్ని క్యాంప్ ఆఫీసుగా ఉపయోగించుకుంటామని ప్రభుత్వం 2023 డిసెంబరు 7న ఉత్తర్వులు జారీ చేసింది. రుషికొండ ప్యాలెస్‌పై తాజాగా విడుదల చేసిన కరపత్రంలో ఏ తేదీన ఏ నిర్ణయం తీసుకున్నారు? అనే వివరాలన్నీ స్పష్టంగా ఉన్నాయి.

రోడ్లకు సం..క్రాంతులు

- జనవరి 15 నాటికి గుంతలు లేని రోడ్లు
- 860 కోట్లతో రాష్ట్రమంతా మరమ్మతులు
- అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలో గుంతలు లేని ఏపీ మిషన్ ప్రారంభించిన సీఎం
- ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్: చంద్రబాబు

అనకాపల్లి, పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధికి చిహ్నలైన రోడ్లు అధ్వానంగా మారాయని, రూ.860 కోట్లతో మరమ్మతులు చేపట్టి వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఉండేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీనికోసం రూ. 860 కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నెలపాలెంలో నిర్వహించిన గుంతల రహిత ఏపీ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. పరవాడ-అచ్యుతాపురం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చే పనులకు ముఖ్యమంత్రి కొబ్బరికాయ కొట్టారు. పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం స్వయంగా పొక్లయినర్ ఎక్కి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. ఐదేళ్లలో రోడ్లపై గుంతలు పెట్టడమే కాకుండా రాష్ట్రానికి అనేక రంగాల్లో గోతులు తవ్వారంటూ.. పరోక్షంగా మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు విమర్శనాస్త్రాలు గుప్పించారు. గత ఐదేళ్లలో రోడ్లకు కేవలం రూ.1000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. మిత్రుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో రానున్న ఐదేళ్లలో అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేసేందుకు ప్రణాళిక అమలు చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. జగన్ దిగిపోయే సమయానికి ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్లకు రూ.1,060 కోట్లు బకాయి పెట్టారని, ఆర్‌అండ్‌బీ రోడ్లపై రూ.10.5 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. ఇప్పుడు రోడ్లపై అప్పు అడగాలన్నా ఇచ్చేవాడు లేకుండా చేశారని ఆరోపించారు. కాగా, మిట్టల్ అనే వ్యక్తి అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రూ.70 వేల కోట్ల పెట్టుబడులతో స్టీల్ ప్లాంటు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. రాబోయే రోజుల్లో 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. పోలవరాన్ని రెండేళ్లలో పూర్తి చేసి.. జూన్‌లో విశాఖకు తీసుకొచ్చే బాధ్యత తనదన్నారు. కాగా, గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో పెట్టిన రూ.1,061 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించినట్టు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పరవాడలో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి ఆయన సీఎం చంద్రబాబుతో కలిసి హాజరయ్యారు.

మెగా డీఎస్సీతో టీచర్ పోస్టులు భర్తీ...

త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో మద్యం అధిక రేట్లకు అమ్మినా, బెల్టు షాపులు పెట్టినా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశాలు జారీచేశామన్నారు.

డ్వాక్రా సంఘాలకు డ్రోన్ల శిక్షణ: చంద్రబాబు

విశాఖపట్నం/శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తును మార్చే నూతన ప్రణాళికను రెండు, మూడు రోజుల్లో ఆవిష్కరిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. డ్రోన్ల వినియోగంపై డ్వాక్రా సంఘాలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శనివారం విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వికసిత్ భారత్‌ను దృష్టిలో ఉంచుకొని 2047 నాటికి రాష్ట్రం పూర్తిస్థాయి అభివృద్ధి సాధించడానికి పది అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అసమానతల తొలగింపు, ఉద్యోగాల సృష్టి-ఉపాధి కల్పన, నైపుణ్యం పెంపుదల, రైతు సాధికారత-ఆదాయం పెంపు, తాగునీటి రక్షణ, ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ ఆంధ్ర, మానవ వనరుల నిర్వహణ-సద్వినియోగం, శక్తి వనరుల వినియోగం- నిర్వహణ, అన్నిరకాల సాంకేతిక జ్ఞానం పెంపు, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. గతంలో పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌తో సంపద సృష్టించామని, ఇకపై 4-పీ విధానంతో ముందుకు వెళతామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారయ్యేలా చేస్తామని, రాష్ట్రాన్ని రతన్ టాటా హబ్‌గా, ఉత్తరాంధ్ర జిల్లాలతో ప్రత్యేక హబ్ రూపొందిస్తామని వివరించారు.


అనకాపల్లి జిల్లా, పరవాడలో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించి రోడ్ రోలర్‌తో గుంతను చదును చేస్తున్న చంద్రబాబు, పక్కన మంత్రులు జనార్దన్ రెడ్డి, అనిత, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్, బండారు సత్యన్నారాయణ మూర్తి

ఎర్రన్నాయుడికి చంద్రబాబు నివాళులు

కేంద్ర మాజీమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. ఎర్రన్నాయుడు స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కేంద్ర మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళంలో ఎర్రన్నాయుడుకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి

కూటమిలో చిటపటలు!

(మొదటి పేజీ తరువాయి)

తూర్పుగోదావరి జిల్లాలో కొన్నిచోట్ల తమ్ముళ్లు, జనసైనికులు బాహాబాహీకి దిగుతున్నారు. పలుచోట్ల ఎమ్మెల్యేలపైనా విమర్శలు వస్తున్నాయి. కాకినాడ రూరల్, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు టీడీపీ నాయకులను దూరం పెడితే.. ఎర్రగొండపాలెంతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలున్న పలు నియోజకవర్గాల్లో జనసేన నాయకులను పట్టించుకోవడం లేదు. ఇలాంటి చోట్ల నాయకులు లోలోపల రగిలిపోతున్నారు. సమన్వయం పాటించమని అగ్రనాయకులు కోరడంతో వెనక్కి తగ్గుతున్నారు. టీడీపీ, జనసేన నాయకుల్లో సఖ్యత లోపం ఇరు పార్టీలను కలవరపాటుకు గురి చేస్తోంది.

చిన్న విషయాలకే రచ్చ

కూటమిలో మూడు పార్టీలు ఉన్నందున నేతలు సర్దుకుపోవాలి. అక్కడక్కడా సమన్వయం పాటించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన చిన్న సంఘటనే ఇందుకు ఉదాహరణ. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థికి సంబంధించిన సమావేశంలో కొంతమంది టీడీపీ నాయకులు జనసేన పార్టీ కండువా వేసుకోలేదు. దీంతో జనసేన నేతలు అభ్యంతరం తెలిపారు. వాస్తవంగా అయితే ఇది చాలా చిన్న సమస్య ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కండువాలు అందరూ కప్పుకొన్నారు. ఇప్పుడు కూడా జనసేన శ్రేణులు అభ్యంతరం తెలపగానే టీడీపీ నాయకులు జనసేన పార్టీ కండువాలు ధరించి ఉంటే ఎలాంటి సమస్య ఉండేది కాదు. ఈ చిన్న విషయానికే ఇరువర్గాల వారికి మాటామాట పెరిగి రచ్చకెక్కారు. పెద్దాపురం నియోజవర్గంలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఒక కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి ఫొటో ముద్రించలేదనే విషయంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల మధ్య వాగ్వాదం జరిగింది. మరోవైపు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా కొంతమంది టీడీపీ నాయకులు నేరుగా రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి అనుకూలంగా మారిపోయారని ఆరోపణలు చేశారు. ఇలా చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని స్థానిక నాయకులు రచ్చకెక్కుతున్నారు. అలాగే కొన్ని పదవులు, చిన్న చిన్న కాంట్రాక్ట్ పనుల విషయంలో ఇరు పార్టీ నేతల మధ్య విభేదాలు వస్తున్నాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య సఖ్యత పూర్తిగా లోపించింది. అక్కడ టీడీపీ నాయకులు జనసేనకి చెందిన నాయకులను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై స్థానిక నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

వైసీపీ నాయకులతోనూ సమస్యలు

వైసీపీ నాయకుల కారణంగా కూడా కూటమిలో సమస్యలు వస్తున్నాయి. చాలామంది వైసీపీ నాయకులు అధికారం కోసం కూటమి పార్టీల వైపు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా సమష్టిగా పని చేశారు. కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా గ్రామస్థాయిలో సమన్వయం చేసుకున్నారు. అప్పుడు వైసీపీ తరఫున ప్రచారం చేసిన నాయకులు ఇప్పుడు టీడీపీ లేదా జనసేన పార్టీలోకి చేరిపోతున్నారు. వీరి వల్ల కూడా కొన్ని చోట్ల సమస్యలు వస్తున్నాయని కొంత మంది నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని పిఠాపురం టీడీపీ నేత వర్మ కూడా ప్రస్తావించారు. కలసిమెలసి ఉన్న టీడీపీ, జనసేన నాయకుల మధ్య వైసీపీ వాళ్లు చిచ్చుపెడుతున్నారని, రెండు పార్టీల మధ్య సఖ్యతను దెబ్బతీస్తున్నారని అంటున్నారు. వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకునే సమయంలోనే ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేర్చుకుంటే మంచిదన్న సూచనలు వస్తున్నాయి.

కమిటీలు వేయాలి

ప్రభుత్వానికి సంబంధం లేకుండా జిల్లా స్థాయిలో మూడు పార్టీలకు సంబంధించి ముఖ్య నేతలతో కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. గ్రామస్థాయిలో సమస్యలు వచ్చినా ఈ కమిటీలో చర్చించి పరిష్కారం చూపించాలని, అప్పుడే నాయకుల్లో మార్పు వస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఇలాగే వదిలేస్తే కూటమిపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదన్నారు. అగ్రనాయకులు కల్పించుకుని పరిస్థితిని చక్కదిద్దకపోతే స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

అగ్రనేతలు ఒకేబాట-ఒకే మాట

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ సమన్వయంతో ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఇద్దరిలో ఎవరూ ఈగోలకు వెళ్లడం లేదు. సీఎం చంద్రబాబు తాను 40 ఏళ్ల సీనియర్ రాజకీయ నాయకుడినని, 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేశానని, ఇప్పుడు సీఎంగా ఉన్నానన్న భేషజాలకు పోవడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కూడా తాను ప్రజల్లో ఇమేజ్ ఉన్న నాయకుడినని, తన వల్లనే కూటమి ఏర్పడిందని, అధికారంలోకి వచ్చిందని అనుకోవడం లేదు. అందరి సమన్వయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని భావిస్తూ ఇద్దరు అగ్రనాయకులు కలిసి వెళ్తున్నారు. ముఖ్యమైన విషయాలపై ఇద్దరు చర్చించుకుంటూ నిర్ణయం తీసుకుంటున్నారు. నామినేటెడ్ పోస్టులు, కీలకమైన పోస్టింగ్‌ల విషయంలోనూ ఇద్దరూ ఒక మాట అనుకుని, ఫైనల్ నిర్ణయానికి వస్తున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా చెబుతున్నారు. ఏదైనా సమస్య వస్తే ఇరు పార్టీల నేతలు ఒక చోట కూర్చొని చర్చించుకోవాలని సూచిస్తున్నారు. ఎమ్మెల్యేలు కూడా ఈగోలను దూరం పెట్టి స్థానిక జనసేన, బీజేపీ నేతలతో కలిసి నడవాలని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రెండు నెలల క్రితమే పార్టీ శ్రేణులను హెచ్చరించారు. ఏ జిల్లాలో అయినా క్షేత్రస్థాయి నాయకులు చేసే పనుల వల్ల కూటమి ప్రభుత్వానికి ఇబ్బందులు ఏర్పడితే వారిని ఉపేక్షించేది లేదని, ఈ విషయాన్ని గుర్తించి నాయకులు ప్రవర్తించాలని ఘాటుగానే వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వంలో అగ్రనాయకుల వద్ద అంతా సక్రమంగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భవిష్యత్తులో ఇబ్బందులు తెచ్చిపెట్టేలా కనిపిస్తున్నాయి.



న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే విమానాశ్రయంలో లోకేశ్‌కు వీడ్కోలు పలుకుతున్న తానా ప్రతినిధులు నిరంజన్, జే తాళ్లూరి, సతీష్ వేమన, రామ్ చౌదరి, హరీశ్ కోయ

ప్రగతిశీల ఏపీకి పెట్టుబడులతో రండి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు
- రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం
- న్యూయార్క్ పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతున్నారు. ఆ దేశ పర్యటనలో చివరి రోజైన శనివారం న్యూయార్కులో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను లోకేశ్ వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ రాష్ట్రంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో విజనరీ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం కారణంగా పరిశ్రమలకు అవసరమైన వాతావరణం ఉందని లోకేశ్ చెప్పారు. బ్లూప్రింట్‌తో వచ్చే పరిశ్రమలకు వెనువెంటనే అనుమతులు ఇచ్చే ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఏపీఈడీబీ) చురుగ్గా పనిచేస్తోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రానికి లేనంత సానుకూల వాతావరణం ఏపీలో ఉందన్నారు. రాష్ట్రానికి 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, మూలపేట, కాకినాడ గేట్‌వే, మచిలీపట్నం, రామాయపట్నంలో పోర్టులను శరవేగంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేసే ఏఐ యూనివర్సిటీలో నిపుణులు తయారవుతారని అన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా మానవ వనరులను సిద్ధం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కాగా, న్యూయార్కులోని బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్‌చైర్మన్ పూర్ణ ఆర్ సగుర్తిని కలవడానికి బయలుదేరిన లోకేశ్.. ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. దాంతో కారును వదిలేసి కాలినడకన వెళ్లి ఆయనను కలిశారు. పారిశ్రామికవేత్తలలో జరిగిన సమావేశంలో టామ్ ఫ్రాంకో (సీనియర్ అడ్వయిజర్, సీడీ అండ్ ఆర్క్), టాడ్ రప్పర్ట్ (సీఈవో రప్పర్ట్ ఇంటర్నేషనల్), ఎరిక్ గెర్ట్లర్ (ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అండ్ సీఈవో యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టు), రాబర్ట్ టీచియో (సీఈవో, ఫారెస్క్) సంజయ్‌పటేల్ (వైస్ చైర్మన్, అపోలో కేపిటల్), రిచర్డ్ డ్రస్టేల్ (సీనియర్ ఎండీ మాడిసన్ రివర్ కేపిటల్) పాల్గొన్నారు.

ఔషధాల దందా

- ఆరోగ్యశాఖలో 'సెంట్రలైజ్డ్' విధానంతో దోపిడీ
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల నష్టం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో ఆరోగ్యశాఖను కుంభకోణాల మయం చేశారు. ముఖ్యంగా ఏపీఎంఎస్ఐడీసీ పరిధిలో జరిగిన టెండర్ ప్రక్రియల్లో భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. తమ వారి కంపెనీలకు టెండర్లు కట్టబెట్టేందుకు ఇష్టారాజ్యంగా నిబంధనలు మార్చేశారు. కొన్ని కంపెనీలను బెదిరించి మరీ వారి అనుకూల కంపెనీలకు టెండర్లు ధారాదత్తం చేశారు. ఇలా అడ్డగోలు టెండర్ ప్రక్రియలో శ్రీకృష్ణ ఫార్మా ముఖ్యమైన టెండర్‌ను దక్కించుకుంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులకు మందులతో పాటు ఏ వస్తువు కావాలన్నా ఏపీఎంఎస్ఐడీసీ నుంచే కొనుగోలు చేస్తారు. కార్పొరేషన్ అధికారులు ఫెలిటేషన్ పర్సంటేజ్ తీసుకుని ఆస్పత్రులకు అవసరమైన మందులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసి అందిస్తారు. మందుల విషయానికి వస్తే ఏటా ప్రభుత్వం వీటి కొనుగోలుకు దాదాపు రూ.300 కోట్ల వరకు కేటాయిస్తుంది. ఈనిధులను అధికారులు వివిధ ఆస్పత్రులకు కేటాయిస్తారు. వాటినుంచే సూపరింటెండెంట్లు మందులు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి ఏటా మందులు కొనుగోలుకు రూ.20కోట్ల వరకు కేటాయిస్తారు. మళ్లీ దీనిని నాలుగు క్వార్టర్లుగా విభజించి, ప్రతి క్వార్టర్‌కు రూ.5కోట్ల చొప్పున ఇస్తారు. ఈ రూ.5కోట్లను మళ్లీ 80శాతం, 20 శాతంగా విభజిస్తారు. ఇలా విభజించిన నిధుల్లో రూ.4 కోట్ల విలువైన మందులను కార్పొరేషన్ కొనుగోలు చేసి సరఫరా చేస్తుంది. మిగిలిన రూ.కోటి నేరుగా ఆస్పత్రి అకౌంట్‌లోకి జమచేస్తారు. ఆకౌంట్‌లో జమఅయిన నిధులతో ఆస్పత్రి అధికారులు అత్యవసర మందులను స్థానికంగా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంది. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు స్థానికంగా కొనుగోలు చేసే మందులకు కూడా టెండర్లు ఆహ్వానించి స్థానిక కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసుకుంటారు. కొనేళ్ల నుంచి ఇదే పద్ధతి కొనసాగుతోంది.

వైసీపీ హయాంలో అయిన వారికోసం..

వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాలకుల మేలు కోసం ఈ వ్యవస్థను బ్రేక్ చేశారు. స్థానికంగా మందులు కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వానికి భారీనష్టం వస్తోందని, దీనివల్ల రూకోట్ల ప్రజాధనం వృథా అవుతోందని చెప్పుకొచ్చారు. ఆ వెంటనే ఆసుపత్రులకు అందించే 20శాతం నిధులను కూడా కార్పొరేషన్ దగ్గర ఉంచుకుని, సెంట్రలైజ్డ్ కొనుగోలు విధానం తీసుకురావాలని నిర్ణయించారు. ఆస్పత్రుల ఖాతాలో ఒక్క రూపాయి వేయకుండా, రోగులకు అత్యవసర సమయంలో మందులు కొనుగోలు చేసే అవకాశం లేకుండా చేశారు. సెంట్రలైజ్డ్ విధానం కోసం టెండర్లు ఆహ్వానించారు. ఇందులో శ్రీకృష్ణ ఫార్మా ఎల్1గా వచ్చింది. ఈ కంపెనీ ఎంఆర్‌పీ కంటే 36శాతం తక్కువకు మందులు సరఫరా చేస్తామని అప్పటి కార్పొరేషన్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. వెంటనే అధికారులు సెంట్రలైజ్డ్ కొనుగోలు బాధ్యతను సదరు కంపెనీకి అప్పగించారు. అయితే, ఈ కంపెనీ ఏ రోజూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా మందులను సరఫరా చేయలేకపోయింది. పైగా మార్కెట్‌లో అతి తక్కువ ధరకే లభించే మందులకు కూడా ఎంఆర్‌పీ భారీగా కోట్ చేసి సరఫరా చేసింది. ఉదాహరణకు పారాసిట్మాల్ 10 టాబ్లెట్ల షీట్ రూ.20 ఉంటే, సదరు కంపెనీ 36 శాతం తగ్గించుకుని రూ.12.8 ఆస్పత్రులకు సరఫరా చేయాలి. కానీ, కంపెనీ దీనిని రూ.35గా నిర్ణయించి.. అందులో 36శాతం తగ్గించి రూ.22.4 చొప్పున బిల్లులు పెట్టింది. దీనివల్ల మార్కెట్ ధర కంటే ప్రభుత్వం సదరు కంపెనీకి ఎక్కువ మొత్తాన్ని చెల్లించింది. ఇలా అధిక ధరలు కోట్ చేసి రూ.కోట్లను నొక్కేశారు. ఈ విషయం గత ప్రభుత్వంలోనే ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించినా మౌనం వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సెంట్రలైజ్డ్ మందుల కొనుగోలు విధానంపై అధికారులు తెలివిగా ఆలోచించారు. శ్రీకృష్ణ ఫార్మా చేసిన అడ్డగోలు వ్యవహారం బయటకు వస్తే అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావించారు. సెంట్రల్‌లైజ్డ్ విధానం వల్ల రోగులకు పెద్దగా ప్రయోజనం లేదని, ఈ విధానాన్ని రద్దు చేద్దామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఫైల్ పెట్టారు. 20శాతం నిధులు సూపరింటెండెంట్లకు అప్పగించి స్థానికంగా వారే మందులు కొనుగోలు చేసే విధానాన్ని తేవాలని ఫైల్‌లో పొందుపరిచారు. దీనిపై అనుమానాలు వ్యక్తం చేసిన మంత్రి.. టెండర్ ప్రక్రియ నుంచి ఇప్పటి వరకు జరిగిన వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, కర్నూలు ఆస్పత్రులకు శ్రీకృష్ణ ఫార్మా సరఫరా చేసిన మందుల వివరాలు తెప్పించారు. ఈ 5 ఆస్పత్రులకు ఆ సంస్థ 106 రకాల మందులు సరఫరా చేసింది. అందులో 67% మందుల ధరలు మార్కెట్ ధర కంటే రెండు, మూడింతలు అధికంగా ఉన్నట్టు తేలడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణ ఫార్మా ఏయే ఆస్పత్రులకు ఎన్ని రకాల మందులు సరఫరా చేసింది? ఎంత మొత్తం చేసింది? అన్న వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

రూ.46 కోట్ల బిల్లులు

2022, జులైలో శ్రీకృష్ణ ఫార్మా టెండర్ దక్కించుకుంది. అప్పటినుంచి ఇప్పటి వరకు రూ.46కోట్ల వరకు కార్పొరేషన్‌కు బిల్లులు పెట్టింది. దీనిలో రూ.26కోట్లకు సంబంధించిన బిల్లులు ప్రాసెస్‌లో పెట్టారు. మరో రూ.20కోట్ల బిల్లులు చెల్లించేసినట్లు తెలుస్తోంది. అసలు ప్రభుత్వం చెల్లించిన రూ.20 కోట్ల విలువైన మందులు అయినా సదరు కంపెనీ సరఫరా చేసిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెంట్రలైజ్డ్ కొనుగోలుపై ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ఎప్పటి నుంచో ఫిర్యాదులు చేస్తున్నారు. మందులు సక్రమంగా సరఫరా చేయడం లేదని, పైగా జనరిక్ మందులు సరఫరా చేస్తున్నారని, అది కూడా మార్కెట్ ధర కంటే అధికంగా కోట్ చేస్తున్నారని అనేక ఫిర్యాదులున్నాయి. వీటిపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ప్రజాధనం వృథా అయ్యేది కాదు.

నడిరోడ్డుపై అమ్మ!

- అర్ధరాత్రి మరో ఊరిలో వదిలేసిన కొడుకు
- అవసాన దశలో.. చలిలో వృద్ధురాలి అవస్థలు
- అదే ఊరిలో కూతురు ఉన్నా తీసుకెళ్లని వైనం
- పత్తికొండలో అమానవీయ ఘటన

పత్తికొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమయం.. శనివారం ఉదయం 5 గంటలు. పత్తికొండ పట్టణం ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలోని ఓ కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న 75 ఏళ్ల వృద్ధురాలు ప్లాస్టిక్ కుర్చీపై చలికి వణికిపోతూ బిక్కుబిక్కుమంటూ కూర్చొని ఉంది. కనీసం లేచి అడుగు తీసి అడుగేయలేని పరిస్థితి ఆమెది. వీధిలో వాళ్లు 'ఏం అవ్వా.. ఎవరు నువ్వు? ఇక్కడ కూర్చున్నావు..' అంటూ అడిగే సరికి కళ్లలో నీళ్లు తిరిగే సమాధానమిచ్చింది!. 'అర్ధరాత్రి నా కొడుకు ఆటోలో తీసుకొచ్చి ఈడ వదిలేసి పోయినాడమ్మా. అరవలేను. పిలవలేను. నడవలేను తల్లీ.. కాసిన్ని నీళ్లు ఇవ్వండమ్మా..' అంటూ కన్నీటి సుడులతో ఆ వృద్ధురాలి నుంచి పొడిపొడిగా వచ్చిన మాటలివి. ఆమె పరిస్థితి తెలిసి స్థానికుల గుండె తరుక్కుపోయింది. వివరాలివీ.. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన తిరుపతమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు శ్రీనివాసులు గుంతకల్లులో ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. పెద్దకుమార్తె పత్తికొండలో, చిన్న కుమార్తె బళ్లారిలో కుటుంబాలతో ఉంటున్నారు. ఎవరికీ భారం కాకూడదని భావించిన తిరుపతమ్మ.. బళ్లారి సమీపంలో ఓ వృద్ధాశ్రమంలో చేరి తనకు వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవించేది. ఇటీవల కిందపడి గాయపడిన ఆమె మంచంపట్టింది. దీంతో చిన్నకూతురు, కుమారుడు వైద్యఖర్చులు భరించి ఆపరేషన్ చేయించారు. అటుతర్వాత గుంతకల్లులో కొడుకు ఇంటివద్దే తిరుపతమ్మ ఉంటోంది. ఈ క్రమంలో తల్లిని భారంగా భావించిన కొడుకు శ్రీనివాసులు.. కూతురి వద్దకు వెళ్లాలంటూ తిరుపతమ్మను గుంతకల్లు నుంచి పత్తికొండకు అర్ధరాత్రి ఆటోలో తీసుకొచ్చాడు. ఓ ఇంటి ఎదుట ప్లాస్టిక్ కుర్చీలో తల్లిని కూర్చోబెట్టి.. 'ఇదే నీ పెద్ద కూతురు ఇల్లు. తెల్లవారి వాళ్లు నిద్రలేచాక నిన్ను ఇంట్లోకి తీసుకెళ్తారు' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రాత్రంగా చలిలో వణుకుతూ బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉండిపోయింది. ఉదయం కాలనీవాసులు వృద్ధురాలికి సపర్యలు చేసి అల్పాహారం తినిపించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జయన్న అక్కడికి చేరుకుని తిరుపతమ్మ నుంచి వివరాలు సేకరించారు. పక్క వీధిలోనే ఉన్న కుమార్తె, అల్లుడికి సమాచారం ఇచ్చి పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే తల్లిని తన ఇంటికి తీసుకెళ్లేందుకు కుమార్తె నిరాకరించింది. కుమారుడైన శ్రీనివాసులుకు పోలీసులు ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ వస్తోంది. తల్లిని ఆదరించాల్సిన కొడుకు అర్ధరాత్రి నడిరోడ్డుపై తల్లిని వదిలేయడం, కుమార్తె ఇంటికి తీసుకెళ్లేందుకు ససేమిరా అనడంతో వృద్ధురాలిని 108 లో పోలీసులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంతకల్లులో ఉన్న కుమారుడు, ఇద్దరు కుమార్తెలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తామని సీఐ జయన్న తెలిపారు.




రోడ్డుపై దీనంగా కూర్చున్న వృద్ధురాలు, తిరుపతమ్మ నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ జయన్న

ఫార్మసీ అడ్మిషన్లు ఎప్పుడు?

- ఇంతవరకూ పీసీఐ అనుమతుల్లో జాప్యం

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో అడ్మిషన్లు ఎప్పుడనే దానిపై గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈఏపీసెట్ ఫలితాలు జూన్‌లో వెలువడగా.. ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లు పూర్తవడంతో పాటు తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ఫార్మసీ కోర్సుల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడింది. మొదట ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) నుంచి అనుమతులు రావడంలో ఎక్కువ ఆలస్యమైంది. పీసీఐ కాలేజీలకు సీట్ల మంజూరు ఆలస్యం చేయడంతో నెల కిందటి వరకూ అడ్మిషన్ల ఊసే లేదు. ఆ తర్వాత పీసీఐ నుంచి అనుమతులు రాగానే కాలేజీల్లో సీట్లకు సంబంధించి అనుమతులు జారీచేయాలని సాంకేతిక విద్యాశాఖ ప్రభుత్వానికి ఫైలు పంపింది. 131 ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లకు అనుమతులు రావాల్సి ఉంది. రెండు వారాల కిందట 83 కాలేజీలకు అనుమతులిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మరో పది కాలేజీలకు అనుమతిస్తూ ఈ వారంలో ఉత్తర్వులిచ్చింది. ఇంకా 38 కాలేజీలకు అనుమతులు రావాల్సి ఉంది. ప్రమాణాల పాటింపు విషయంలో అన్ని తనిఖీల తర్వాతే పీసీఐ అనుమతులు జారీచేసింది. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ కాలేజీలకు అడ్మిషన్ల విషయంలో ఎందుకు అనుమతులు జాప్యం చేస్తుందో తెలియడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అనుమతిచ్చిన 93 కాలేజీలతో కౌన్సెలింగ్ చేపట్టాలనే ఆదేశాలు కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. ఒకవేళ అనుమతులు రాని కాలేజీల్ని వదిలేసి ముందుకెళ్తే..అవి కోర్టునుఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

'తూర్పు' మణిహారం విశాఖ



పోర్టు చానల్ నుంచి సముద్రంలోకి వెళుతున్న సబ్‌మెరైన్

త్రివిధ దళాల కేంద్రంగా సాగర నగరం



సముద్రానికి అభిముఖంగా తూర్పు నౌకాదళాధిపతి కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వి శాఖ ప్రత్యేక కతలు

తూర్పు తీరానికి మణిహారం విశాఖపట్నం. దేశ రక్షణలో ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. శత్రువులు ఇటువైపు కన్నెత్తి చూడకుండా కట్టడి చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా సైనిక దళం (ఆర్మీ), విశాఖలో తూర్పు నౌకాదళం ఉండేవి. రాష్ట్ర విభజన తరువాత

'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరున్న విశాఖకు ఉన్న ప్రత్యేకతలే దేశ రక్షణలో కీలకంగా నిలిచేలా చేస్తున్నాయి. విశాఖ నగర నిర్మాణం చాలా భిన్నమైనది. మూడు వైపులా కొండలు, మరోవైపు సముద్రం ఉంటాయి. మధ్యలో నగరం. దీనిని పర్యావరణ శాస్త్రవేత్తలు 'బౌల్' ఆకారంలోని నగరంగా అభివర్ణిస్తారు. భారతదేశానికి వలస వచ్చిన ఆంగ్లేయులు నాడు చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న ఈ ప్రాంతం సముద్ర వ్యాపార కేంద్రానికి అనువుగా ఉంటుందని గుర్తించారు. నౌకలు లంగరు వేసుకోవడానికి సహజ సిద్ధమైన తీర ప్రాంత అమరిక ఉండడంతో పోర్టు నిర్మాణం, ఆ తరువాత దేశ రక్షణ కోసం నౌకాదళం ఏర్పాటయ్యాయి.

ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ కేంద్రం ఉన్న ఏకైక నగరంగా విశాఖ నిలిచింది. అమెరికా, చైనా దేశాల మాదిరిగా త్రివిధ దళాలు కలిసి ఒక్కచోటే పనిచేసేలా కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం త్వరలో 'థియేటర్ లెవెల్ కమాండ్'లను ఏర్పాటు చేయనుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ మూడూ ఒక్కచోటే ఉండి సమన్వయంతో పనిచేస్తూ ఉమ్మడి ఆపరేషన్లు నిర్వహిస్తాయి. అలాంటి థియేటర్ లెవెల్ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నది.

హెచ్‌ఎస్ఎల్, బీడీఎల్...

రక్షణ శాఖ పరిధిలోని రెండు కేంద్ర ప్రభుత్వ సంస్థలు విశాఖ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అందులో ఒకటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్). మరొకటి ఆటోనగర్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్). షిప్‌యార్డ్‌లో నేవీకి అవసరమైన నౌకలు నిర్మితమవుతుండగా, బీడీఎల్‌లో రక్షణ శాఖకు అవసరమైన పరికరాలు తయారవుతున్నాయి.

నేవల్ లేబొరేటరీ...

రక్షణ శాఖకు పరిశోధనలు చేసే డీఆర్‌డీఓకు దేశంలో 24 లేబొరేటరీలు ఉండగా అందులో విశాఖపట్నం అతి ప్రధానమైనది. అదే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్). నేవీకి సంబంధించిన రాడార్లు, సోనార్లు, టార్పెడోలు ఇక్కడే రూపుదిద్దుకుంటున్నాయి. వరుణాస్త్రకు ఇక్కడే రూపకల్పన చేశారు. అభివృద్ధి చేసిన టెక్నాలజీని ఇతర సంస్థలకు బదిలీ చేసి భారీ ఎత్తున ఉత్పత్తి చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో కొన్నింటిని విదేశాలకు కూడా విక్రయిస్తుంటారు.

నిరంతరం దేశ రక్షణలో...

మెరైన్ కమెండోలకు శిక్షణ ఇచ్చేందుకు భీమిలి సమీపాన ఐఎన్ఎస్ కర్ణ.. సబ్‌మెరైన్లలో పనిచేసే వారికి శిక్షణ ఇచ్చేందుకు ఐఎన్ఎస్ శాతవాహన... నౌకా నిర్మాణంలో ఆర్కిటెక్చర్, హల్ మౌంట్, సెయిలర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఐఎన్ఎస్ విశ్వకర్మ నిరంతరం శ్రమిస్తున్నాయి. ఇక ఐఎన్ఎస్ డేగాలో జెట్ ఫైటర్లు, మిగ్ 29-కేలపై శిక్షణ ఇస్తున్నారు.

చెరగని ముద్ర

కేంద్రప్రభుత్వవిధానాలు అమలుచేయడంలో తూర్పు నౌకాదళం కీలకంగా వ్యవహరిస్తోంది. యూపీఏ ప్రభుత్వం 'లుక్ ఈస్ట్ పాలసీ' అమలు చేసినపుడు తూర్పు తీర దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగించింది. ఆ తరువాత వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా మార్చింది. తూర్పు దేశాలతో స్నేహమే కాకుండా ఆర్థిక, సాంస్కృతిక బంధాలు బలోపేతం చేయాలన్నది దీని ఉద్దేశం. దీనిని అమలు చేయడానికి 2022లో మిలాన్ పేరుతో అతి పెద్ద కార్యక్రమం నిర్వహించారు. ఆ తరువాత ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించినప్పుడు 50 దేశాలు పాల్గొన్నాయి. విశాఖ కేంద్రంగా ప్రతి రెండేళ్లకోసారి ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. అంతకుముందు 2006లో ప్రెసిడెంట్‌ఫ్లీట్‌రివ్యూ నిర్వహించారు.

స్వదేశీ పరిజ్ఞానంతో

భారత నౌకాదళం తొలుత రష్యా నుంచి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్రను లీజుకు తీసుకుంది. ఆ తరువాత విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదట ఐఎన్ఎస్ అరిహంత్‌ను నిర్మించింది. ఇది 2016లో నేవీలో చేరి సేవలు అందిస్తోంది. రెండు నెలలక్రితం ఆగస్టు 29న ఐఎన్ఎస్ అరిఘాత్ అన్ని పరీక్షలు పూర్తి చేసుకొని నేవీలో చేరింది.



భీమిలి సమీపాన మెరైన్ కమెండోల శిక్షణ కేంద్రం

అతిపెద్ద సంస్థ

దేశంలో భౌగోళికంగా అది పెద్దది విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళమే. దీని పరిధిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలు ఉన్నాయి. బంగాళాఖాతంతో పాటు హిందూ మహా సముద్రంలో సగ భాగానికి ఈ దళమే బాధ్యత వహిస్తోంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే త్రివిధ దళాలలో కూడా అతి పెద్దది తూర్పు నౌకాదళం. ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అన్నింటిలోకి అతి పెద్ద సంస్థ. వేలాది మంది పనిచేస్తున్నారు. తూర్పు నౌకాదళంలో యుద్ధనౌకలు, జలాంతర్గాములు, అణు జలాంతర్గాములు, యుద్ధ విమానాలతో పాటు మూడు నేవల్ ఎయిర్ స్టేషన్లు ఉన్నాయి. విశాఖలో ఐఎన్ఎస్ డేగా, తమిళనాడులో ఐఎన్ఎస్ రజాలి, దక్షిణ తమిళనాడులో ఐఎన్ఎస్ పరందు ఉన్నాయి. వీటిలో నిఘా విమానాలు పీ8ఐలు కూడా పనిచేస్తున్నాయి. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా విశాఖ కేంద్రంగానే పని చేయనుంది. న్యూక్లియర్ సబ్‌మెరైన్లు కూడా ఇక్కడే నావల్ డాక్‌యార్డులోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో తయారవుతున్నాయి.

జగన్ పాలన సమస్తం
కక్ష సాధింపులు, కబ్జాలే

- ప్రజా వేదికలో క్యూ కట్టిన వైసీపీ బాధితులు

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు. అప్పటి అధికార పార్టీ నేతలు భూ కబ్జాలకు పాల్పడ్డారు' అంటూ గత ప్రభుత్వ బాధితులు టీడీపీ నేతలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. విజయవాడ, అశోక్‌నగర్‌కు చెందిన 92 ఏళ్ల వృద్ధురాలు కే నిర్మలమ్మ మాట్లాడుతూ, 'నా బంధువులు టీడీపీలో ఉన్నారనే కక్షతో నా పింఛన్, రేషన్ కార్డును వైసీపీ నేతలు తొలగించారు. మళ్లీ రేషన్ కార్డు, పింఛన్ మంజూరు చేయాలి' అని విజ్ఞప్తి చేసింది. 'గత ప్రభుత్వంలో ఏలూరులో అనేక మంది టీడీపీ సానుభూతిపరుల పింఛన్లను కుట్రపూరితంగా తొలగించారు. వారందరూ నిరుపేదలు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన అర్హుల పింఛన్లను పునరుద్ధరించాలి' అని ఏలూరుకు చెందిన రెడ్డి రాంబాబు కోరారు. గంటావారిపల్లికి చెందిన గంటా విజయ్‌కుమార్ ఫిర్యాదు చేస్తూ... 'నాకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారు. అప్పట్లో కలెక్టర్లను కలిసినా పట్టించుకోలేదు. వైసీపీ నేతల నుంచి భూమిని విడిపించి, నా భూమిని నాకిప్పించాలి'అని వేడుకున్నారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమ

ఎర్రన్నాయుడుకు టీడీపీ నేతల నివాళి

దివంగత కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఎర్రన్నాయుడు చిత్రపటానికి మాజీ మంత్రి దేవినేని ఉమా, ఆర్టీసీ చైర్మన్ నారాయణ, పలువురు పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు.



కర్నూలు-బళ్లారి రహదారిపై ధర్నా చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

యురేనియం తవ్వకాలు ఆపండి

- కప్పట్రాళ్లలో పలు గ్రామాల ప్రజల ఆందోళన
- కర్నూలు-బళ్లారి రహదారి దిగ్బంధం

దేవనకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పలు గ్రామాల ప్రజలు ఏకమయ్యారు. కర్నూలు జిల్లా కప్పట్రాళ్లలో శనివారం వారంతా ఆందోళనకు దిగారు. ప్రజలు పనులు మానేసి, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఉద్యమంలో పాల్గొన్నారు. కప్పట్రాళ్ల, పి.కోటకొండ, నెల్లిబండ, జిల్లెల బుడకలు, కరివేముల తదితర గ్రామాల ప్రజలు ఆందోళనలో పాల్గొన్నారు. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి కూడా కొద్దిసేపు ఆందోళనలో పాల్గొన్నారు. యురేనియం తవ్వకాలతో తమ జీవితాలు నాశనం చేయవద్దంటూ కర్నూలు-బళ్లారి రహదారిని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు దిగ్బంధించారు. వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై ముళ్లకంచె అడ్డుగా వేసి ఆందోళన చేపట్టారు. రిజర్వు ఫారెస్టులోకి యూసీఐఎల్ బోర్లు వస్తే ఊరుకోబోమని, ఆ వాహనాలు తమపై నుంచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. యురేనియం తవ్వకాలకు పాల్పడితే ఆత్మహత్యలు చేసుకుంటామంటూ పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. ఉద్యమకారులను అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చినా.. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో వెనక్కి తగ్గారు. సమస్యపై చర్చించేందుకు సోమవారం కలెక్టర్ కప్పట్రాళ్ల వస్తారని.. పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ చెప్పడంతో ప్రజలు ఆందోళన విరమించారు. మూడున్నర గంటల ఆందోళనతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

రాజధాని నిర్మాణానికి
వేగంగా రుణాలివ్వండి

- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధుల వర్క్‌షాపులో అమరావతి రైతులు
- అందరి ఆకాంక్షలకు అనుగుణంగానే రాజధాని నిర్మాణం: సీఆర్‌డీఏ



ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్

తుళ్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగర నిర్మాణానికి త్వరితగతిన రుణ సహాయం అందించి వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రతినిధులను రాజధాని రైతులు, కూలీలు, మహిళలు కోరారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఎన్నో విధ్వంసాలు కళ్లచూశామని, రాజధాని కోసం ఏళ్ల తరబడి పోరాటం చేశామని వివరించారు. శనివారం తుళ్లూరులో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిపుణుల బృందం వర్క్‌షాపు నిర్వహించింది. ఈ వర్క్‌షాపునకు రాజధాని రైతులు, రైతు కూలీలు, భూమిలేని పేదలు, మహిళలు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా.. రాజధాని నగరంలో పరిశ్రమలు, పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. రైతుల పాట్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని, కౌలు, అమరావతి పింఛన్‌ను సకాలంలో జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు-పరిశోధనా సంస్థలు అమరావతిలో కార్యాలయాలను నెలకొల్పడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి నగరాన్ని గొప్ప ఆర్థిక, విద్యా, వ్యాపార రాజధానిగా అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రాభివృద్ధికి బాటలు పడతాయని, తద్వారా, రైతుల త్యాగాలు, పోరాట ఫలాలు రాష్ట్రప్రజలందరికీ అందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 17లోగా రెండు విడతల రుణాలు

వర్క్‌షాప్‌లో సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణానికి రుణం అందించే విషయమై ఈ నెల 11న ఢిల్లీలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సమావేశం జరుగుతుందన్నారు. డిసెంబరు 17లోగా మొదటి, రెండోవిడత రుణాలను విడుదల చేసేందుకు వారు అంగీకరించడం శుభపరిణామమన్నారు. వర్క్‌షాపు ద్వారా రైతులు చేసిన విజ్ఞప్తులను ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణ నిబంధనలోనే పొందుపరిచాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయిప్రవీణ్ చంద్ అధ్యక్షత వహించారు. ఈ వర్క్‌షాపులో కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపునవీన్, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితమంటూనే వాతలు

- మూడు సిలిండర్లిచ్చి గప్పాలు కొడుతున్న కూటమి సర్కారు
- సర్దుబాటు పేరిట చార్జీల మోత: షర్మిల



అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మూడు సిలిండర్లు ఇచ్చి పేదల కుటుంబాల్లో దీపం పెట్టామని కూటమి సర్కారు గప్పాలు కొడుతోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సిలిండర్ పథకంపై శనివారం ఎక్స్‌లో ఆమె స్పందించారు. 'ఉచిత గ్యాస్ సిలిండరును ఇస్తూనే ఇంధన సర్దుబాటు పేరిట కూటమి సర్కారు విద్యుత్ చార్జీల వాతలు పెడుతోంది. ఈ పథకం కింద ఏటా ఇచ్చేది రూ.2,685 కోట్లు మాత్రమే. ప్రజల నుంచి కరెంటు బిల్లుల రూపంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న మొత్తం రూ.6,000 కోట్లు. ఉచిత బండ కోసం చేస్తున్న వ్యయం కంటే.. మరో రూ.3,000 కోట్ల మేర ప్రజలపై భారం పడటం లేదా? దీపం-2 కింద వెలుగులు పక్కన పెడితే కరెంటు బిల్లుల రూపంలో కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం కారు చీకట్లు నింపుతోంది. అవసరం అయితే.. 35 శాతం చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక జగన్ తరహాలోనే కూటమి కూడా ప్రజలపై భారాలు వేయడం మొదలుపెట్టింది. ప్రజలపై ఇంధన సర్దుబాటు చార్జీలు మోపడాన్ని వ్యతిరేకిస్తూ... కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడతాం' అని షర్మిల హెచ్చరించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.